ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
fb.com/vaartha Digital

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం


Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 274 పేజీలు: 10+4 వెల: 6.50

# సమృద్ధిగా జలరవాణా వనరులు

## అరుదైన ఖనిజాల వెలికితీతకు వర్శిటీల భాగస్వామ్యం

## లండన్‌లో పారిశ్రామికవేత్తలతో సిఎం చంద్రబాబు భేటీ

### వారికి విశాఖ భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానం



మంగళవారం లండన్‌లో పారిశ్రామికవేత్తలతో భేటీ అయిన సిఎం చంద్రబాబు

**విజయవాడ నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్గత జలరవాణా మార్గాల ద్వారా అతి తక్కువ వ్యయంతో సరుకు రవాణా చేసేందుకు ఆస్కారం ఉందని ఎపిలో ఈ జల రవాణాకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. లాజిస్టిక్ కారిడార్‌ద్వారా ఎపిని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రచిస్తున్నట్టు సిఎం లండన్‌లోని పారిశ్రామిక వేత్తలకు వివరించారు. లండన్ పర్యటనలోఉన్న సిఎం చంద్రబాబు వివిధ పారిశ్రామిక వేత్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎపిలో పెట్టుబడులు పెట్టాలని.. అలాగే ఈ నెల జరగనున్న భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలతో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రంలో రోడ్డు, రైలు, వాయు మార్గాలతో పాటు అంతర్గతంగా ఉన్న జలవనరుల్లో జల రవాణా ద్వారా సరకు రవాణాపై పని చేసేందుకు ముందుకు రావాలని లండన్‌లోని అరుప్ సంస్థను సిఎం కోరారు.

లండన్‌లోని ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ ఆరుప్ గ్లోబల్ అఫైర్స్ డైరెక్టర్ జేమ్స్ కెన్నీ, డిజిటల్ రిస్క్ మేనేజ్మెంట్ కంపెనీ అల్తైరిన్ టెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫ్రెడీ వూలాండ్, పీజీ పేపర్ కంపెనీ సిఇఒ పూనమ్‌గుప్తా, జూలీబి యూనివర్సిటీనుంచి గౌరవ్ మార్వాహా, >>2



# గ్రామీణ రోడ్లకు 2000 కోట్లు

## 'సాస్కీ' నిధులతో నిర్మిస్తున్నాం

## అన్ని స్థాయిల్లో క్వాలిటీ చెక్

### నాణ్యతా ప్రమాణాల బాధ్యత అధికార యంత్రాంగానిదే: డిసిఎం పవన్

**విజయవాడ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ రహదారులు అభివృద్ధికి రూ. 2000 కోట్లు సాస్కి నిధులను వినియోగిస్తున్నామని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో మరో ముందడుగు వేసామన్నారు. ప్రజలకు సాస్కి నిధుల ఫలాలు అందించాలి అని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు ఉప ముఖ్యమంత్రిఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేసారు.

రాష్ట్రంలోని గ్రామాల్లో రహదారుల స్థితిగతులను మార్చి నూతన రోడ్లు నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'సాస్కి' పథకం ద్వారా ఎపికి రూ. 2వేల కోట్లు నిధులు సమకూర్చింది. ఈ నిధులను సద్వినియోగం చేసుకొని, ప్రజలకు పటిష్టమైన రహదారులు అందించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మించే కార్యక్రమం చేపడుతున్నామని, ఇందులో బాగా దెబ్బతిన్నరోడ్లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంనుంచి అందుతున్నసహకారం మూలంగా రాష్ట్రానికి సాస్కి నిధులు సమకూరాయని చెప్పారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో వీటిని సద్వియోగం చేసుకుందామన్నారు. సాస్కి నిధుల వినియోగించే ప్రణాళికపై పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారు >>2

## వివేకా హత్య కేసు:

# సిబిఐ కోర్టులో సునీల్ యాదవ్ కౌంటర్ దాఖలు

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎ2 గా వున్న కడపకు చెందిన సునీల్ యాదవ్ మంగళవారం నాంపల్లి సిబిఐ కోర్టులో కౌంటర్ దాఖలు చేశాడు. ఈ కేసును మరోసారి విచారించాలని వివేకాతనయ సునీతారెడ్డి సిబిఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. దీని తరువాత చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సునీల్ యాదవ్ ఈ పిటిషన్ దాఖలు చేస్తూ అనేక అంశాలను ప్రస్తావించాడు. కడప జైల్లో దస్తగిరిని డాక్టర్ చైతన్య రెడ్డి బెదిరించిన ఘటనపై సిబిఐ విచారించలేదని, 2017 ఎంఎల్‌సి ఎన్నికల్లో వివేకా ఓటమి వెనుక అవినాష్ రెడ్డి కుట్ర కోణంపై నిగ్గు తేల్చాలని, వివేకా హత్య కేసులో సాక్షులుగావున్నవారిలో ఆరుగురు మరణించిన విషయంపైనా సిబిఐ విచారణ చేయాలని సునీల్‌యాదవ్ కోరాడు. కల్లూరు గంగాధర్ రెడ్డి అనంతపురం ఎస్‌పికి ఫిర్యాదు చేసిన తరువాత కూడా ఆయనకు రక్షణ కల్పించలేక పోయారని సునీల్ యాదవ్ తన పిటిషన్‌లో తెలిపాడు.

# ప్రపంచ పర్యాటక పటంలోకి ఎపి




మంగళవారం లండన్‌లో జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ 2025లో ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్‌లో మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ ఇతరులు

## లండన్‌లో జరుగుతున్న డబ్ల్యుటిఎంలో మంత్రి దుర్గేష్, ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్

### అంతర్జాతీయ ప్రతినిధులకు అరకు కాఫీతో స్వాగతం

**విజయవాడ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిని ప్రపంచ పర్యాటక పటంలో సగర్వంగా నిలుపుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్. అన్నారు. వరల్డ్ ట్రావెల్ మార్కెట్ ఎపి పర్యాటక ఖ్యాతిని వివరించామన్నారు. గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో అందరిని ఆకర్షించే దిశలో నిలబెడతామని మంత్రి కందుల దుర్గేష్‌అన్నారు. ఇప్పటికే ప్రపంచం ఎపిని అత్యంత ఆహ్లాదకరమైన, ప్రకృతి సోయగాల ప్రదేశంగా గుర్తించిందన్నారు.లండన్‌లోని ఎక్సెల్ లండన్ వేదికగా నవంబరు 4 నుండి 6 వరకు జరుగుతోన్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ 2025 ఎగ్జిబిషన్‌లో మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్‌లు పాల్గొని రాష్ట్ర పర్యాటక వాణిని వినిపించారు. తొలి రోజు మంత్రి కందుల దుర్గేష్ సారథ్యంలోని బృందం బిజీబిజీగా గడిపింది.

తొలుత భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను డిప్యూటీ హై కమిషనర్, దేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటకమంత్రులతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర సంస్కృతి ప్రతిబింబించేలా కూచిపూడి నృత్యంతో ఎపి పర్యాటక స్టాల్‌ను అక్కడి ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. వరల్డ్ ట్రావెల్ మార్కెట్ వేదికగా ఏర్పాటు చేసిన ఎపి స్టాల్ ద్వారా రాష్ట్రంలోని ప్రకృతి సహజ సిద్ధ ప్రదేశాలు, చారిత్రాత్మక కోటలు, సుదీర్ఘమైన తీర ప్రాంతం, వారసత్వ సంపదను ప్రపంచ దేశాల పర్యాటకులకు తెలిపేలా వరల్డ్ ట్రావెల్ మార్కెట్ వేదికగా ప్రచారం కల్పించారు. అదే విధంగా దాదాపు 20కి పైగా అంతర్జాతీయ టూర్ ఆపరేటర్లు, హోటల్స్ ప్రతినిధులు, మైస్ ఇన్వెస్టర్లు,ప్రఖ్యాత ట్రావెల్ మాగజైన్స్ యజమానులు, మీడియా బ్లాగర్స్, అడ్వెంచర్ ట్రావెల్ కంపెనీలు, టైలర్ మేడ్ ట్రావెల్ కంపెనీ, ఆన్ లైన్ ట్రావెల్ మీడియా, టూరిజం బోర్డులు, కృతి రిటైల్ వెంచర్స్ ఎల్‌ఎల్‌పీతో విడివిడిగా సమావేశమై రాష్ట్ర పర్యాటక రంగంలో ఉన్న పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను, ఎపి పర్యాటక రంగ ప్రత్యేకతలను వివరించారు. ఎపి స్టాల్‌కు వచ్చిన అంతర్జాతీయ ప్రతినిధులకు >>2



# లాజిస్టిక్ హబ్‌గా ఎపిని మారుస్తాం

### దుబాయ్‌లో మంత్రి నారాయణ

**సచివాలయం, నవంబరు 4,ప్రభాతవార్త :** రాష్ట్రాన్ని అన్నిరకాల లాజిస్టిక్ హబ్‌గా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు పురపాలక శాఖమంత్రి నారాయణ వివరించారు. పెట్టుబడులు ఆహ్వానించేందుకు దుబాయ్‌లో రెండో రోజు కొనసాగుతున్న మంత్రి నారాయణ పర్యటనలో భాగంగా పెట్టుబడిదారులకు వివరించారు.రాష్ట్రానికి పెట్టుబడుల సాధనకోసం దుబాయ్‌లో వివిధ రకాల పారిశ్రామికవేత్తలతో మంత్రి మంగళవారం భేటీ అయ్యారు.ఇందులో భాగంగా అపరెల్ గ్రూప్ చైర్మన్ నీలేష్ వేద్‌తో కలసి ఫ్యాషన్, ఫుట్‌వేర్ >>2

# ట్రక్కును ఢీకొన్న కారు

## బారాబంకిలో ఘోర ప్రమాదం

### ఆరుగురు మృతి, పలువురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

**బారాబంకి, నవంబరు 4:** రాజస్థాన్, తెలంగాణలో జరిగిన సంఘటనలు మరవకముందే యూపీలో మరో ఘోర రోడ్డు ప్రమాదం వెలుగు చూసింది. బారాబంకిలోని దేవా ఫతేపూర్ రహదారిపై ఓ కారును ట్రక్కు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్పాట్‌లోనే ఆరుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరించారు. దేవా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. దేవా ఫతేపూర్ హైవేపై వేగంగా దూసుకొచ్చిన ఒక ట్రక్కు కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఎని >>2



తుఫాన్ కారణంగా పంట నష్టంపై మంగళవారం కృష్ణా జిల్లాలో రైతులను ఆరా తీస్తున్న జగన్

# ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి

## చంద్రబాబు తప్పిదంవల్లే పంటలకు పరిహారం రావడం లేదు..

### తూతూ మంత్రంగా ఇ-క్రాప్: మాజీ సిఎం జగన్ విమర్శ

**విజయవాడ,నవంబరు4,ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యవసాయం దండగ అన్న సిఎం చంద్రబాబు అదే ధోరణితో వ్యవహరిస్తున్నారని వైయస్సార్సీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ 18 నెలల్లో దాదాపు 16 ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయన్నారు. దాంతో రైతులకు నష్టం కలుగుతోందని, అయినా ఏ ఒక్క రైతును ఆదుకున్న దాఖలా లేదని మాజీ ముఖ్యమంత్రి, వెల్లడించారు. మొక్కుబడిగా చాలా తక్కువగా పెట్టుబడి సాయం, ఉచిత పంటల బీమా రద్దు, ఇన్‌పుట్ సబ్సిడీ రద్దు, పంటలకు లేని కనీస మద్దతు ధర, రైతులకు తగిన యూరియా కూడా సరఫరా చేయకపోవడం, చివరకు పంటలు కూడా కొనేవారు లేకపోవడంతో.. రాష్ట్రంలో ఈ కూటమి ప్రభుత్వంలో రైతులు నానా అగచాట్లు పడుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పుడు తుపాన్‌లో నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి న్యాయం జరిగేవరకు పోరాడతామని, రైతులకు అండగా వైయస్సార్సీ నిలుస్తుందని >>2

# ప్రజా దర్బార్‌కు అపూర్వ ఆదరణ

## నాలుగు గంటలపాటు 4 వేల మందిని పైగా కలిసి సమస్యలు తెలుసుకున్న మంత్రి లోకేష్

### అందరిని ఆప్యాయంగా పలుకరించి వినతుల స్వీకరణ

### 70వ రోజు ప్రజా దర్బార్



మంగళవారం ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి లోకేష్

**మంగళగిరి, నవంబరు 4 ప్రభాతవార్త:** టిడిపి కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 70వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేష్‌ను కలిసి సమస్యలు విన్నవించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజలు, కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారినుంచి వినతులు స్వీకరించారు. నాలుగు గంటల పాటు దాదాపు 4 వేలమందికిపైగా కలిసి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ప్రతి విజ్ఞప్తిని పరిశీలించి సిబ్బందికి అప్పటికప్పుడే ఆదేశాలు జారీచేశారు. కూటమి ప్రభుత్వంలో అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వైఎస్సార్సీ పాలనలో అక్రమ కేసులతో పాటు ఆస్తులు లాగేసుకున్నారు టిడిపి కార్యకర్తనైన తనపై వైఎస్సార్సీ పాలనలో అక్రమ కేసులు నమోదు చేయడంతో పాటు ఆ పార్టీ నేతల ప్రోద్బలంతో తన భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, విచారించి తగిన న్యాయం చేయాలని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం బుడ్డేపుపేట గ్రామానికి చెందిన దనపాన హరికృష్ణ మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసాఇచ్చారు. తనకు వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూమిని తప్పుడు పత్రాలతో కబ్జా చేసేందుకు వైఎస్సార్సీ కార్యకర్త అన్నలదాసు జోసెఫ్ యత్నిస్తున్నారని, విచారించి తగిన న్యాయం చేయాలని గుంటూరు జిల్లా కాకుమాను గ్రామానికి చెందిన మెరిగల రవిబాబు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. టిడిపి సానుభూతిపరుడిననే కక్షతో >>2



గూడ్స్‌ బోగీలపైకి ఎక్కిన రైలు ఇంజన్


# గూడ్సును ఢీకొన్న ప్యాసింజర్ రైలు

2లో

## బిలాస్‌పూర్‌లో దారుణం.. దెబ్బతిన్న 3 బోగీలు

### 10 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు

# 'భోగాపురం' 90% పూర్తి



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

## ఇది దేశం గర్వించే విమానాశ్రయం: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విశాఖపట్నం, నవంబరు 4, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచాన్ని గెలిచే శక్తి ఉత్తరాంధ్రకు ఉందని.. అందుకు వనరుగా భోగాపురం విమానాశ్రయం ఉపయోగపడాలని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ. ఆర్. దామోదర్ స్థానిక ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం మాధవి, మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, కలసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. రెండు నెలల క్రితం తాను పరిశీలనకు వచ్చేసరికి విమానాశ్రయ నిర్మాణ పనులు 86.61 శాతం పూర్తి అవ్వగా.. నేడు.. 91.70 శాతానికి చేరుకుందని తెలిపారు. కూటమి సర్కారు ఏర్పడిన తొలిరోజుల్లో.. తాను కేంద్రమంత్రిగా బాధ్యతలు తీసుకున్నసందర్భంలో సిఎం నారా చంద్రబాబునాయుడు.. >>2



మంగళవారం సిఎం చంద్రబాబుతో భేటీ అయిన భారత హై కమిషనర్ విక్రమ్ దొరైస్వామి

## 'భోగాపురం' 90% పూర్తి

>> ఒక ఛాలెంజ్ గా ప్రాజెక్ట్ తీసుకోమన్నారని.. దానికి దీటుగానే డెడ్ లైన్ డిసెంబర్ 2026 కన్నా ముందుగానే వచ్చే సంవత్సరం జూన్ నాటికి విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఇంకా కేవలం 8.3 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని.. ఈలోగా ఈ డిసెంబర్, జనవరి నాటికి వ్యాలిడేషన్ ఫ్లైట్‌ను నడపనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఎం చంద్రబాబును ఆహ్వానించనున్నట్టు తెలిపారు. స్థానికంగా ఏవియేషన్ యూనివర్సిటీకి కూడా చంద్రబాబు నాయుడు ఆలోచనతో ముందుకు వెళ్తున్నట్టు స్పష్టం చేశారు. గడచిన పద్దెనిమిది నెలలలో ప్రధాని మోడీ మార్గదర్శనంలో దేశంలో అనేక చోట్ల విమానాశ్రయాలు నెలకొల్పామని.. అంతకుమించిన వృద్ధిని భోగాపురంలో చూస్తామని రామ్మోహన్ నాయుడు స్పష్టంచేశారు. భోగాపురం విమానాశ్రయంలో జరుగుతున్న పనుల తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 14,15 తేదీల్లో ఇన్వెస్టర్ సమ్మిట్ విశాఖలో జరగనుందని.. విమానయాన శాఖకు సంబంధించి కూడా స్థానికంగా అభివృద్ధికి ఐదువందల ఎకరాలు అందుబాటులో ఉంచిన నేపథ్యంలో.. అందుకోసం సమ్మిట్‌లో ప్రెజెంటేషన్ కూడా సిద్ధం చేసినట్టు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీని ఆహ్వానించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని.. అల్లూరు సీతారామరాజు పేరుతోనే విమానాశ్రయం ప్రారంభం అవుతుందని స్పష్టంచేశారు.



శ్రీశైలం డ్యాం వ్యూపాయింటు వద్ద జారిపడ్డ కొండరాయి

# సమృద్ధిగా జలరవాణా వనరులు

>> మాంచెస్టర్ యూనివర్సిటీ నుంచి నానోసైన్స్ ప్రొఫెసర్ రాధాబోయా, ఏఐ పాలసీ ల్యాబ్స్ ఫౌండర్ డైరెక్టర్ ఉదయ్ నాగరాజు, ఫ్యుయెంట్ గ్రిడ్ ప్రెసిడెంట్ రత్న గారపాటి, బ్రిటిష్ హెల్త్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రతినిధి పాల్ బెంటన్ తదితరులు హాజరయ్యారు. ఏపిలోని టెక్నాలజీ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని.. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోందని సిఎం వివరించారు. అమరావతిలోనూ వచ్చే జనవరి నాటికి ఏఐ క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ప్రారంభం కానుందని తెలిపారు. ఏపిలో ఏఐ వినియోగం, నిపుణుల తయారీ వంటి అంశాలతో పాటు ఎకోసిస్టం అభివృద్ధికి ఉన్న అవకాశాలను కూడా పరిశీలించాలని సిఎం స్పష్టం చేశారు. అలాగే అరుదైన భూగర్భ ఖనిజాల వెలికితీతపై వివిధ యూనివర్సిటీలు కూడా భాగస్వామ్యం వహించాలని తద్వారా వాటిని వెలికితీసి ప్రపంచ అవసరాలకు వినియోగించే అవకాశం ఉందని సిఎం స్పష్టం చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సిఎంతో భారత్ హైకమిషనర్ భేటీ**

లండన్‌లోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి సిఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. యుకెలోని వివిధ యూనివర్సిటీలు ఏపితో నాలుగు అంశాల్లో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకునే అంశంపై చర్చించారు. ఏపిలో ఆయా యూనివర్సిటీ కేంద్రాలను ప్రారంభించే అంశం, కేంద్రం సహకారంతో జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేసుకునే అంశంపై ఇరువురు చర్చించారు. అక్కడి యూనివర్సిటీలు ఇక్కడి విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకునే అంశంపై చర్చించారు. అలాగే యూనివర్సిటీలు, విద్యాసంస్థల మధ్య విద్యార్థుల ఎక్స్ఛేంజ్ అంశం, లైఫ్ సైన్సెస్, బయో జెనెటిక్స్, ఖనిజాల వెలికితీత, మెటల్స్ అంశాల్లో ఏపీ యుకె యూనివర్సిటీల మధ్య భాగస్వామ్యాల ఏర్పాటు గురించి చర్చ జరిపారు. అలాగే ఎఐ, సెమీ కండక్టర్, స్పేస్ టెక్నాలజీ, కోర్ ఇంజనీరింగ్, మెరైన్ ఇండస్ట్రీ 4.0 లో సహకారం గురించి కూడా ఇరువురు మధ్యా చర్చ జరిగింది. మరో పక్క అమరావతిలో వచ్చే జనవరి నాటికి ఎఐ,క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు. లండన్‌లో పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సాంకేతిక రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు,ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించారు. విశాఖలో ఈ నెల 14,15 తేదీల్లో జరుగనున్న భాగస్వామ్య సదస్సుకు వారిని ఆహ్వానించారు. ఏపిలో ఉన్న అంతర్గత జల రవాణా మార్గాల ద్వారా అతి తక్కువ ఖర్చుతో సరకు రవాణా చేసేందుకు ఆస్కారం ఉందని వివరించారు. 'అజ్జికో కారిడార్ ద్వారా ఏపిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఏఐ వినియోగం,నిపుణుల తయారీ వంటి అంశాలతో పాటు ఎకోసిస్టం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించండి. అరుదైన భూగర్భ ఖనిజాల వెలికితీతకు వివిధ విశ్వవిద్యాలయాలు కూడా భాగస్వాములు కావాలి.వీటిని వెలికి తీయడం ద్వారా ప్రపంచ అవసరాలకు వాటిని వినియోగించవచ్చు' అని చంద్రబాబు పేర్కొన్నారు. సమావేశంలో ప్రముఖ నిర్మాణ సంస్థ అరుప్ గ్లోబల్ ఎనర్జీ డైరెక్టర్ జేమ్స్ కెన్నీ,డిజిటల్ రిస్క్ మేనేజ్మెంట్ కంపెనీ అల్గోరిన్,టెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫ్రెడీ ఫులాంద్,బీజీ పేపర్ కంపెనీ సీఈఓ పూనమ్ గుప్తా,బద్మ్లింజీ యూనివర్సిటీ నుంచి గౌరవ్ మార్వాహ్,నానోసైన్స్ ప్రొఫెసర్ రాధాబోయా,ఏఐ పాలసీ ల్యాబ్స్ ఫౌండర్ డైరెక్టర్ ఉదయ్ నాగరాజు,ఫ్యుయెంట్ గ్రిడ్ ప్రెసిడెంట్ రత్న గారపాటి,బ్రిటిష్ హెల్త్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రతినిధి పాల్ బెంటన్ తదితరులు పాల్గొన్నారు.

## 'కల్తీ నెయ్యి'లో మరికొందరు?

**ఇక సిట్ దర్యాప్తు కీలకం • 2022 నుంచి 24 దాకా నెయ్యి సరఫరా మూలాలపై ఆరా**

**తిరుమల, నవంబరు 4, ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డూప్రసాదం తయారీ కల్తీనెయ్యి సరఫరా బాగోతం వెనుక సిబిఐ సిట్ ప్రస్తుత దర్యాప్తు కీలకంగా మారింది. ఇప్పటికే ఈ కేసులో తొలినుంచిదారిగా భావించిన టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి అంతరంగికుడు,వ్యక్తిగత సహాయకుడు చిన్నఅప్పన్నను గతవారం సిట్ అరెస్ట్ చేసి కటకటాల వెనక్కుపంపింది. అతని నుండి రాబట్టిన కీలక సమాచారంతో ఇప్పుడు ముందుకు కదులుతోంది. ఈకల్తీనెయ్యిపాపంలో ఇంకెందరికి ఉన్న బినియనుండనేది టిటిడి వర్గాల్లో సంచలనం కలిగిస్తోంది. 2022వ సంవత్సరం నుండి 2024 ఏప్రిల్ వరకు సరఫరా అయిన కల్తీనెయ్యి ఉదంతంలో రాజకీయ అరెస్టులతో బాటు టిటిడిమార్కెటింగ్, కొనుగోళ్ల విభాగంలో కూడా అరెస్టులు తప్పదనేది భయంగొల్పుతోంది. మొత్తంగా డెయిరీ నుండి నెయ్యి సరఫరా జరగడం, ఆ తరువాత నాలుగు డెయిరీలకు నెయ్యిసరఫరా చేసే టెండర్లు అప్పగించడం కూడా చిన్నఅప్పన్న చేతుల్లోకలలోనే సాగాయనేది సిట్ రాబట్టిన కీలక సమాచారం. ఈ సమాచారంతోనే మూడునాలుగురోజుల్లో మాజీలను విచారణకు పిలిచేందుకు నోటీసులు జారీ కానున్నాయనేది తెలుస్తోంది. 2022లోనే కల్తీనెయ్యి వ్యవహారంపై అప్పటి బోర్డు తీవ్రంగా పరిగణించినా ఎందుకు కేసు నమోదు చేయలేదు? నెయ్యి నాణ్యతపై పరిశీలనకు మైసూరుల్యాబ్‌కు పంపకపోవడం వెనుక కథనడిపిన కీలక సూత్రధారి ఎవరు అనేది తేల్చే పనిలో సిట్ అధికారులు నిమగ్నం య్యారు. 2021 నుండి 2024వరకు నాలుగేళ్లలో 250కొట్ల రూపాయలు విలువైన 68లక్షల కిలోల నెయ్యిని టిటిడి సరఫరా చేసుకుందనేది సమాచారం. ఈ వ్యవహారంలో ఎంతమొత్తంలో కమీషన్ల రూపంలో చేతులు మారాయనేది ప్రాథమికంగా ఆధారాలు సిట్ చేతికి జిక్కాయి.

## శ్రీశైలం ఘాట్‌లో విరిగిపడ్డ కొండ చరియలు

### శ్రీశైలం రోప్‌వే వద్ద జారిపడ్డ బండరాయి

**శ్రీశైలంప్రాజెక్టు, నవంబరు4,ప్రభాతవార్త:** గత రెండు రోజుల నుండి కురుస్తున్న జారీ వర్షాల కారణంగా శ్రీశైలం,సుండిపెంటలో వర్షం నీరు పొంగిపొర్లుతున్నాయి.రహదారులన్ని నీటి మడుగులతో నిండుకునా న్నయి.వర్షం నీటితో కొన్ని ప్రాంతాల్లో వాహనదారులు,పాదచారులు ఇబ్బందులకు గురి అయ్యారు.ఈ నేపథ్యంలోనే శ్రీశైలం టు హైదరాబాద్ రహదారి ఘాట్ డ్యాం వ్యూపాయింట్ స్వీచ్ యార్డ్ మధ్యలో కొండ మీద నుండి రాళ్లు జారి రోడ్డు ప్రక్కన పడ్డాయి.రాళ్లు జారిపడే క్రమంలో చెట్లు కూడా విరిగిపడ్డాయి.కొండ రాళ్లు జారిపడే క్రమంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం లేదు.హైదరాబాద్,శ్రీశైలంకు వచ్చే వాహనాల రాకపోకలు కొనసాగుతునా న్నయి.అదే విధంగా శ్రీశైలంలో పాతళగంగ రోప్‌వే వద్ద పెద్ద బండరాయి జారి క్రిందకు పడింది.దానితోపాటు చెట్లు కూడా విరిగిపడ్డాయి. సమీపంలో అటువైపు ఎవ్వరు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం లేదు.భక్తులు పాతళగంగ వైపు పుణ్యస్నానాలు అచరించే రహదారి కావడంతో విరిగిపడ్డ చెట్లను తోలగించే పనిలో అధికారులు, స్థానికులు నిమగ్నం అయ్యారు.

## గూడ్సును ఢీకొన్న ప్యాసింజర్ రైలు

**బిలాస్‌పూర్, నవంబరు 4:** ప్రయాణీకులతో వెళుతున్న మెమూరైలు ఎదురుగా వస్తున్న సరుకురవాణా గూడ్స్ రైలును ఢీకొనడంతో కనీసం పది మంది మృతిచెందారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. బిలాస్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఈప్రమాదంలో అనేక కోచ్‌లు పట్టాలు తప్పాయి. కాగామెము రైలు ముందుభాగం గూడ్స్ కంపార్టుమెంట్లపైకి ఎక్కింది. సీనియర్ రైల్వే అధికారులు, స్థానిక యంత్రాంగం మొత్తం స్పాట్‌కు చేరుకుని ప్రయాణీకులను రైలునుంచి దిగి ప్రత్యామ్నాయ రైళ్లలో పంపించారు. సాయంత్రం నాలుగు గంటలప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే అన్ని కోచ్‌లను తప్పించారు. తీవ్ర గాయాలపాలయిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. మెమూరైలు కోర్బాప్యాసింజర్ రైలు అని అధికారులు తెలిపారు. మొదటి రెండు బోగీలు, మొట్టమొదటి రిజర్వు బోగీ కూడా తీవ్రస్థాయిలో దెబ్బతిన్నది. రైల్వే అధికారులు బాధితుల సమాచారం కోసం అత్యవసర నంబర్లు ప్రకటించారు. అలాగే మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారంకూడా ప్రకటించారు. మృతులకుటుంబాలకు రూ.10 లక్షలుచొప్పున తీవ్ర గాయాలపాలయినవారికి రూ.5లక్షలు చొప్పున మంజూరుచేసారు. అలాగే ప్రమాదంలో ఒకమోస్తరు గాయాలుపాలయినాసరే వారికి లక్ష పరిహారం తక్షణఖర్చుల కింద చెల్లిస్తున్నట్లు రైల్వేశాఖప్రకటించింది.

## ట్రక్కును ఢీకొన్న కారు

>> మిది మందిలో ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానిక వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలను వెలికి తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్కక్కు కారును క్రేన్ సాయంతో పక్కకు తీసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## గ్రామీణ రోడ్లకు2000 కోట్లు

>> లకు దిశానిర్దేశం చేశారు. రహదారుల నాణ్యతలో రాజీపడబోమని పవన్ కల్యాణ్ తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో రోడ్లు మెరుగుపడే విధంగా నిధులు సమకూరుస్తున్నాము. ఎక్కడా నాణ్యత విషయంలో రాజీపడవద్దు. రహదారుల నిర్మాణంలో నిబంధనలకు అనుగుణంగా, ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. రోడ్ల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం పూర్తి అలక్ష్యంతో వ్యవహరించింది. వివిధ మార్గాల్లో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు వచ్చే వెసులుబాటు ఉన్నప్పటికీ, దానిని విస్మరించింది. కూటమి ప్రభుత్వం కేంద్ర సహకారంతో ఎప్పటికప్పుడు రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు సాధిస్తోంది. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు. నిధులు పొందటంలో, వాటిని వినియోగించే ప్రక్రియలో సిఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలని కృత నిశ్చయంతో ఉంది. ఇందులో అధికార యంత్రాంగం కీలక భూమిక పోషించాలన్నారు.

## జోగి బ్రదర్స్ కస్టడీకోసం ఎక్సైజ్ పోలీసుల పిటిషన్

**విజయవాడ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో నిందితులు జోగి రమేష్, జోగి రాములను కస్టడీకి కావాలని కోరుతూ భవానీపురం ఎక్సైజ్ పోలీసులు పిటిషన్లు దాఖలు చేశారు. 10 రోజుల పాటు కస్టడీకి కావాలని కోరుతూ పిటిషన్‌లో పేర్కొన్నారు. నిందితుల నుంచి నకిలీ మద్యం తయారీ కుట్రపై కీలక విషయాలు రాబట్టాల్సి ఉందన్నారు. పిటిషన్లపై విజయవాడ ఎక్సైజ్ కోర్టు విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. తదుపరి విచారణను న్యాయస్థానం ఈనెల 4కి వాయిదా వేసింది.ఈ కేసులో ఏ18గా జోగి రమేష్, ఏ19గా జోగి రాములు ఉన్నారు. ప్రస్తుతం నిందితులు జోగి బ్రదర్స్ నెల్లూరు కేంద్రకారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. మరోవైపు నకిలీ మద్యం కేసులో నిందితులు జనార్ధనరావు, జగన్మోహన రావులను మరోసారి కస్టడీకి కోరుతూ ఎక్సైజ్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్ పై న్యాయస్థానం విచారణ జరిపింది. 5 రోజులపాటు కస్టడీకి కావాలని ఎక్సైజ్ అధికారులు కోరారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 6వ తేదీకి వాయిదా వేసింది.నకిలీ మద్యం కేసులో తిరుమలశెట్టి శ్రీనివాసరావు కస్టడీ ముగిసింది. శ్రీనివాసరావును ఎక్సైజ్ అధికారులు ఐదు రోజులపాటువిచారించారు. కస్టడీముగియడంతో నెల్లూరు జైలుకు శ్రీనివాసరావును తరలించారు. ఇప్పటికే జోగి రమేష్, జోగి రామునుసైతం నెల్లూరు జైలుకు తరలించారు. జోగిరమేష్, ఆయన సోదరుడు రాముకు ఈనెల 13 వరకు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకూ నకిలీ మద్యం కేసులో నిందితుల సంఖ్య 23 కి చేరింది. నకిలీ మద్యం కేసులో ఏ18గా జోగి రమేష్, ఏ19గా జోగి రాము, ఏ20గా మనోజ్ కొఠారి, ఏ21గా సుదర్శన్, ఏ22గా సింధిల్, ఏ 23గా ప్రసాద్ ఉన్నారు.

## మద్యం కుంభకోణంలో ఎ-49గా అనిల్ చోఖ్రా

**విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసు నిందితుల జాబితాలో మరొకరు చేరారు. ముడుపుల సొమ్ము రూటింగ్,మనీ లాండరింగ్ కోసం పెద్ద ఎత్తున డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసిన ముంబయి వాసి అనిల్ చోఖ్రాను 49వ నిందితుడిగా చేరుస్తూ సిట్ అధికారులు తాజాగా విజయవాడ ఏసిబి కోర్టులో మెమో దాఖలు చేశారు. గత ప్రభుత్వంలో అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న అదాన్ డిస్టిలరీస్, ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, లీలా డిస్టలరీస్ సంస్థలు నాటి ప్రభుత్వ పెద్దలకు ముడుపులుగా చెల్లించాల్సిన మొత్తాన్ని ఓల్విక్ మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఉ11), క్రిపాటి ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్(ఎ 12), నైన్న మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఎ13), ట్రిఫెర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్(ఉ14), విక్సో ఎంటర్‌ప్రైజెస్ (ఎ15) తదితర డొల్ల కంపెనీల ఖాతాల్లో జమ చేసేవి. అక్కడి నుంచి మరికొన్ని కంపెనీల ద్వారా రెండు మూడు అంచెల్లో రూటింగ్ జరిగి, చివరిగా ముడుపుల సొమ్ము నగదు రూపంలో వైకాపా ముఠాకు, అంతిమ లబ్దిదారుకు చేరేది.

ఈ అక్రమ దందా కోసం పైన పేర్కొన్న డొల్ల కంపెనీలన్నీ అనిల్ చోఖ్రాయే ఏర్పాటు చేసినట్లు సిట్ గుర్తించింది. రికార్డుల్లో పేర్కొన్న చిరునామాల్లో అలాంటి కంపెనీలేవీ లేవని తేల్చింది. ఈ నేపథ్యంలో మరింత సమాచారం రాబట్టేందుకు మూడు రోజులుగా సిట్ బృందాలు ముంబయిలో సోదాలు చేస్తున్నారు. అనిల్ చోఖ్రాను ప్రశ్నిస్తున్నాయి.

మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అనిల్ చోప్రాపై అనేక కేసులున్నాయి. గతంలో ఆయన్ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) అరెస్ట్ చేసింది. ముంబయి విడిచిపెట్టి వెళ్ళకూడదనే షరతుతో తర్వాత బెయిల్ లభించింది.

## ఎపిని మారుస్తాం

>> రంగాల్లో 14దేశాల్లో ప్రసిద్ధి పొందిన అపరెల్ గ్రూప్‌ను ఆహ్వనించారు.ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ ఛైర్మన్ రమేష్ రామకృష్ణన్‌తో భేటీ అయిన అనంతరం షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగంలో దుబాయ్ కేంద్రంగా అనేక దేశాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న ట్రాన్స్‌వరల్డ్ గ్రూప్‌ను రావలసిందిగా కోరారు.రాష్ట్రంలో లాజిస్టిక్స్ రంగం అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు తీసుకుంటున్న నిర్ణయాలను వివరించిన మంత్రి ఎపిని లాజిస్టిక్ హబ్‌గా మార్చేందుకు చర్యలుచేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 14,15 తేదీల్లో విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని ఆయా కంపెనీలకు ఆహ్వానం పలికారు మంత్రి నారాయణ.

## పర్యాటక పటంలోకి ఎపి

>> ఎపి సంస్కృతి ప్రతిబింబించేలా కూచిపూడి నృత్యంతో స్వాగతం పలికి, అరకు కాఫీని అందజేశారు. ఆంధ్రా ఫేమస్ పూతరేకులు రుచి చూపించారు. జీఐ ట్యాగ్ పొందిన ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను ప్రదర్శించి వాటి ప్రత్యేకతలను, తయారీ విధానాన్ని వివరించారు.పలువురికి వాటిని బహుమతులుగా అందించారు. అనంతరం అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో మాట్లాడి రాష్ట్ర పర్యాటక రంగంలో తీసుకువచ్చిన నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పన తదితర వివరాలను వెల్లడించి ఎపిలో పర్యాటక పెట్టుబడులను ఆహ్వానించారు. రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులు పెడితే భరోసా కల్పించే బాధ్యత మాది తెలిపారు. మంత్రి దుర్గేష్ భేటీ అయిన వారిలో పికాక్ టూర్ కంపెనీ సిఇఒ కన్నన్ శివనాథన్, రష్యాతో పాటు వివిధ దేశాలకు చెందిన అంతర్జాతీయ ట్రావెల్ ఎగ్జిబిటర్లు, మైనా ట్రావెల్ ఎండీ, మైస్ ఇన్వెస్టర్లు, 500 హోటల్స్ చైన్ యాజమాన్యం, సిగ్నేచర్ హాస్పిటాలిటీ గ్రూప్ సీఈవో రమేశ్ అరోరా, రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి తదితరులు ఉన్నారు. హై కమిషనర్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన డిన్నర్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ పర్యాటకాన్ని విశ్వవ్యాప్తం చేయడమే తమ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు

**విజయవాడ, నవంబరు 4, ప్రభాతవార్త ప్రతినిధి:**వాతావరణంలో నెలకొన్న పరిస్థితులతో ఏపీలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. కోస్తా తీరానికి ఆనుకుని పశ్చిమమధ్య బంగాళా ఖాతంలో సముద్ర మట్టానికి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని ఎండీ ప్రఖర్‌జైన్ వెల్లడించారు ఆవర్తనం ప్రభావంతో బుధవారం కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కడప, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించారు. అలాగే మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో ఎల్లుండఅక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

## దొనకొండలో ప్రపంచస్థాయి కేన్సర్ సెంటర్

### దక్షిణ కొరియాకు చెందిన వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం ఛైర్మన్ వెల్లడి

**విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకాశం జిల్లా దొనకొండలో 25 ఎకరాల విస్తీర్ణంతో సుమారు రూ.4,260 కోట్ల (480 మిలియన్ డాలర్ల) వ్యయంతో 'చున్ జియాంగ్ ఉన్ చల్లా క్యాన్సర్ సెంటర్'ను నిర్మించనున్నట్లు దక్షిణ కొరియాకు చెందిన వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం ఛైర్మన్ పీటర్ చున్ వెల్లడించారు. వరల్డ్ స్మార్ట్ సిటీస్ ఫోరం, చల్లా గ్రూప్, ఒమెక్సా బయాలజీస్,మేస్, ఐ హోల్డింగ్ సంస్థల భాగస్వామ్యంతో ఈ సెంటర్‌ను నిర్మించనున్నట్లు ఆయన ప్రకటించారు. విజయవాడలోని ఓ హోటల్‌లో సమావేశమైన ఆయా సంస్థల ప్రతినిధులు ప్రపంచస్థాయి క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పీటర్ చున్ మాట్లాడుతూ చున్ జియోంగ్ ఉన్ క్యాన్సర్ సెంటర్‌ను చెన్నైలో ప్రారంభించామన్నారు. స్మార్ట్ మెడికల్ సిటీ ప్రాజెక్టులో భాగంగా క్యాన్సర్ దయాగ్నసిస్, అంకాలజీ, క్యాన్సర్ చికిత్స, శస్త్రచికిత్సలు, 1500 పడకలతో ఇన్ పేషెంట్ వార్డు,నర్సింగ్ హాస్పటల్, మెడికల్ స్కూలు, హెలిపోర్ట్, హోటల్, నివాస సముదాయం, రెస్టారెంట్లు, బొటానికల్ గార్డెన్, పార్కు, క్యాన్సర్ మ్యూజియం, ఆరోగ్య సాంకేతిక కేంద్రం తదితరాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుతో 4 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

'నేను ప్రకాశం జిల్లా వాసిని...నాకు జన్మ నిచ్చిన ప్రాంతంలో క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటుచేయడం ఆనందంగా ఉంది. రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలన్న సిఎం చంద్రబాబు పిలుపుతో మరికొన్ని ప్రాజెక్టుల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం' అని చల్లా గ్రూప్ ఛైర్మన్ చల్లా ప్రసాద్ చెప్పారు. ఒమెక్సా కో ఫౌండర్ డాక్టర్ రాజన్ గార్గ్ మాట్లాడుతూ పేదలకు మేలు చేసేలా అత్యాధునిక వైద్య సదుపాయాలతో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మిస్తామని తెలిపారు. తాము సేవలను విస్తరించాలనే ఆలోచనలో ఉన్నప్పుడు చల్లా గ్రూప్ అధినేత చల్లా ప్రసాద్ సూచన మేరకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నట్లు తెలిపారు. అనుమతులు రాగానే నిర్మాణాన్ని ప్రారంభిస్తామన్నారు.

# ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి

>> వైయస్ జగన్ ప్రకటించారు. మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన పంటలు పరిశీలించడంతో పాటు, రైతులను పరామర్శించేందుకు వైయస్ జగన్ కృష్ణా జిల్లా పెనమలూరు, పెడన, పామర్రు, మచిలీపట్నం నియోజకవర్గాలలో పర్యటించారు. తాడేపల్లి నుంచి బయలుదేరిన ఆయనకు అడుగడుగునా జనం నీరాజనం పలికారు. మరోవైపు ప్రతిచోటా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా రోప్‌పార్టీలు, బారికేడ్లు ఛేదించుకుని జనం, అభిమానులు తరలిరాగా, రైతులు తమ గోడు చెప్పుకున్నారు. మొంథా తుఫాన్ ఎపిలో విధ్వంసమే సృష్టించింది. మంగళవారం కృష్ణా జిల్లాలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తుఫాన్ బాధిత రైతులను కలిశారు. పంట నష్టంపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి ఏ మేరకు సాయం అందిందని ఆయన అడిగి తెలుసుకున్నారు. రైతుల్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతు పరిస్థితి తెలుసుకోవాలంటే గ్రౌండ్ లోకి తిరిగి చూస్తే అర్థం అవుతుంది. ఈ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా, నిర్దయగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. గోదావరి జిల్లాల నుంచి కర్నూల్ వరకు తుఫాను ఎఫెక్ట్ ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. గతంలో ఎప్పుడూ ఊహించని విధంగా పంట పొలాలు మొత్తం నీట మునిగాయి. తీవ్ర గాలులకు పంటలు దెబ్బతిన్నాయి. రైతుల ఆరుగాలంకష్టం కోల్పోయారు. పత్తి, మొక్క జొన్న, బత్తాయి పంటలు నాలుగు లక్షల ఎకరాల్లో మునిగాయి. 18 నెలల చంద్రబాబు ప్రభుత్వంలో 16 సార్లు ప్రకృతి విపత్తులు సంభవించాయి. 18 నెలలుగా ఒక్క రైతుకైనా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారా..? ఇన్సూరెన్స్ డబ్బులు, పెట్టుబడి సాయం అందిందా..? అనినిలదీశారు ప్రభుత్వాన్ని నిలదీశారు. పూర్తిగా ఈ ప్రభుత్వం రైతుల వెన్ను విరిచిందని ఆయన విమర్శించారు. చివరికి రైతులకు ఉచిత పంటల బీమా కూడా లేకుండా పోయింది. ఒక్కొక్క రైతు వేల రూపాయల నుంచి లక్షల్లో నష్టపోయారు. ఎరువులు కూడా బ్లాకులో కొనుక్కోవాల్సి వచ్చింది. ఇంత దారుణ పరిస్థితులు గతంలో ఎప్పుడూ లేవు. ఇన్ని కష్టాలతో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. ప్రతీ అడుగులో కూడా రైతు నష్టపోతున్నారనన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అండగా నిలబడ్డాం. ఒక్క రైతు కూడా భయపడలేదు.. మా ప్రభుత్వం అందరికీ భరోసా ఉంది. అన్న ఉన్నాడన్న ధైర్యంతో ఉండేవారు. డబ్బులు వస్తే తర్వాత సీజన్ పెట్టుబడి పెట్టడానికి డబ్బులు అందేవి.. ఏ రైతు కూడా ఈ ప్రభుత్వంలో సంతోషంగా లేరు. ఆర్బీకేల పరిధిలో సచివాలయంతో అనుసంధానమై ఈ క్రాప్ బుకింగ్ నమోదయ్యేది. రైతుకు ఎప్పుడు ఏ పంటకు ఇబ్బంది జరిగినా నష్టపరిహారం అందేది.. ప్రభుత్వం రైతులకోసం ఉంటుంది అనే భరోసా లభించేది. ఎక్కడ పంట రేట్లు తగ్గినా ప్రభుత్వం స్పందించేది.. మార్క్ ఫెడ్ ద్వారా మార్కెట్ లో కాంపిటీషన్ క్రియేట్ చేసి పంటలకు గిట్టుబాటు ధరలు ఇచ్చే వాళ్లం. సీఎం యాప్ సాయంతో గతంలో అన్నీ అందుబాటులో ఉండేవి.. 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశామని జగన్ గుర్తు చేశారు. ఈరోజు ఈ రైతు ఒకే విషయం చెప్పాడు. ఎక్కడా, ఏ రైతు వద్దకు, ఏ పొలం వద్దకు ఎవరూ ఎన్యుమరేషన్ కోసం రాలేదని అన్నారు.

## అపూర్వ ఆదరణ

>> అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తున్న తనను వైఎస్సార్సీ హయాంలో విధుల నుంచి తొలగించారని, తిరిగి తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ఉలిద్ర రవి మంత్రి నారా లోకేష్‌ను కలిసి విన్నవించారు. పరిశీలించి తగిన న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలోని పారామెడికల్ విభాగంలో ఖాళీగా ఉన్న హెల్త్ అసిస్టెంట్ మేల్ పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని అన్ ఎంప్లాయిస్ పారా మెడికల్ హెల్త్ అసిస్టెంట్(మేల్) అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తిచేశారు. టీడీపీ పాలనలో ఎంపీహెచ్ ఏ మేల్ పోస్టులను భర్తీ చేశారు. గత కొన్నేళ్లుగా హెల్త్ అసిస్టెంట్ మేల్ పోస్టులకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని మంత్రిదృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రకాశం జిల్లా అటవీ ప్రాంతంలోని గిరిజన చెంచు, ఆదివాసి గూడెంల్లో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నూతన పాఠశాలల మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని నల్లమల గిరిజన చెంచు సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## వారం - వర్జ్యం

05-11-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
○ పౌర్ణమి సా.6.48
అశ్విని ఉ.9.39, స్వాతి కార్తె
వర్జ్యం : సా.6.01-7.25
దు.ఉ.11.29-12.15
శుభసమయం:.6.15-6.50, సా.4.30-5.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. నూతన ప్రయత్నాలు లాభిస్తాయి. సంఘంలో ప్రత్యేక గౌరవం లభిస్తుంది.

**వృషభం:** దూర ప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపారాలు పురోభివృద్ధి ఉంటాయి.

**మిథునం:** ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలం. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కర్కాటకం :** మీ మాట తీరు కొంత కటువుగా, ఎదుటి వారిని నొప్పించే విధంగా ఉంటుంది. జాగ్రత్త అవసరం.

**సింహం:** కుటుంబ సమస్యలు కొంత వరకు తీరుతాయి. వాహన యోగం. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కన్య :**ఓర్పు, నేర్పుతో ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు. నూతన కాంట్రాక్టులు లభిస్తాయి.

**తుల :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. వస్త్రాల కొనుగోలు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది.

**వృశ్చికం:** చిన్ననాటి మిత్రు సహాయ సహకారాలతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుడతారు.ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**ధనుస్సు:** మాట మీద నిలకడ లేని మనుషుల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. జాగ్రత్తలు అవసరం.ఉద్యోగులకు బదిలీల సూచన.

**మకరం:** వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

**కుంభం:** మీ ఆలోచనా విధానం మంచి మార్పు వస్తుంది. స్వల్ప ధనలాభం. సాంకేతిక విద్యావకాశాలు లభిస్తాయి.

**మీనం :** దూరపు బంధువుల నుండి వచ్చిన వార్త ఆనందం కలుగుతుంది. భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తిరుపతి జిల్లాకు కుంకీ ఏనుగులు అవసరం లేదు

## - డిఎఫ్ఓ సాయిబాబా

**తిరుపతి,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లాలో అటవీప్రాంతంలో ఉన్న పరిస్థితుల్లో కుంకీ ఏనుగులు అవసరం లేదని తిరుపతి డిఎఫ్ఓ సాయిబాబా తెలిపారు. చిత్తూరు జిల్లాకే ఎక్కువ అవసరం ఉంటుందన్నారు. అలిపిరి నడకమార్గంలో చిరుతపులుల సంచారంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా లైటింగ్‌ను పెంచుతున్నట్లుచెప్పారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అలిపిరిలో 10, యూనివర్సిటీలో ఐదుమంది సిబ్బందిని నియమించి చిరుతల కదలికలను ట్రేస్ చేస్తున్నామన్నారు. వ్యర్థాలదగ్గర కుక్కలు, ఎలుకలు తిరుగుతున్నాయని, వాటిని తినడానికి చిరుతలు వస్తున్నాయని తెలిపారు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చిరుతల సంచారం ఉండదని డిఎఫ్ఓ కీలక వ్యాఖ్యలు చేశారు.



# శ్రీవారి ఆశీస్సులతో సకలం సుభిక్షం

## - మాజీ ఎస్ఇసి రమేశ్‌కుమార్

**తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనంతో, స్వామివారి ఆశీస్సులందుకోవడం ఆనందంగా ఉందని మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ తెలిపారు. కార్తీక మాసంలో మంగళవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి ఆయన ఆలయం వద్దకు విచ్చేశారు. ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజ స్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# కెసిఆర్ సిఎం కావాలని కోరుకున్నా

## - బిఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

**తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణరాష్ట్రంలో ఉన్న పరిస్థితుల్లో మళ్ళీ కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలని కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని వేడుకున్నానని బిఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శ్రీవారి ఆశీస్సులతో అన్ని కార్యాలు సజావుగా జరుగుతున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో మళ్ళీ కెసిఆర్ సిఎం కావాలని ఆయన ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం తిరుమలకు వచ్చిన ఆయన ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# వైఎస్సార్సీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ పర్యటనలో అపశ్రుతి

**విజయవాడ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీఅధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృష్ణా జిల్లాలో పర్యటిస్తున్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలలో జగన్ పర్యటన చేపట్టారు. ఈ పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. వైఎస్ జగన్ కాన్వాయిలో ప్రమాదం జరిగింది. ఉయ్యూరు మండలం గండిగుంట వద్ద జగన్ కాన్వాయ్ వాహనాలు ఒక దానికొకటి పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం కారణంగా రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాల రాకపోకలు నిలిచిపోవటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

# కొల్లేరు సరస్సు అభివృద్ధి కోసం అథారిటీ ఏర్పాటు

**విజయవాడ ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** కొల్లేరు వన్యప్రాణి సంరక్షణా ప్రాంతం, రామ్సార్ స్థలంగా గుర్తింపు పొందిన సరస్సును సుస్థిరంగా అభివృద్ధి చేయడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం కోసం అథారిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కొల్లేరు సరస్సు పరిరక్షణ, అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించడం అథారిటీ కీలక లక్ష్యంగా ఉంది.పర్యావరణ కాలుష్యం నియంత్రణ, నీటి నాణ్యత మెరుగుదల. చేపల వైవిధ్యం రక్షణ, సుస్థిర మత్స్యాభివృద్ధి. పర్యాటక అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు ఆదాయ అవకాశాలు. జీవ వైవిధ్యం సంరక్షణ, ఆక్రమించే జాతుల నియంత్రణ. సిల్టేషన్ నియంత్రణ, నీటి ప్రవాహ వ్యవస్థ పునరుద్ధరణ. ప్రతి మూడు నెలలకోసారి సమావేశం జరిపి పురోగతి సమీక్ష చేస్తారు...అథారిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షుడుగా ఉంటారు. ఉపాధ్యక్షులుగా పర్యావరణ, అరణ్య, విజ్ఞాన సాంకేతిక శాఖ ప్రధాన కార్యదర్శి,రెవెన్యూ, ఫిషరీస్, వ్యవసాయం, పంచాయతీ రాజ్, వాటర్ రిసోర్సెస్, టూరిజం, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా కలెక్టర్లు (ఏలూరు, భీమవరం, మచిలీపట్నం), బయోడైవర్సిటీ బోర్డు, విల్ డ్రైఫ్ సభ్యులుగా ఉంటారు.

# రూ.113కోట్లతో గిరిజన వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన

## మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి

**సచివాలయం,నవంబర్ 4,ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9ఐటిడిఏ లోనున్న 757గిరిజన పాఠశాలల్లో మౌలికవసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.113 కోట్లను మంజూరు చేసినట్లు రాష్ట్రమహిళా అభివృద్ధి,శిశు సంక్షేమం,గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.ఇందులో రూ.83కోట్లను గిరిజన ఆశ్రమ పాఠశాలకు మరియు రూ.30కోట్లు గురుకుల పాఠశాలలకు ఇవ్వడం జరిగిందన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వేంటనే గిరిజన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకై గత ఏడాది రూ.155కోట్లను వెచ్చించడం జరిగిందన్నారు.ఈ ఏడాది కూడా మరిన్ని మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో రూ.113కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు.రాష్ట్రంలో 757గిరిజన పాఠశాలలు ఉన్నాయని,వీటిలో 199గురుకులాలు, 558ఆశ్రమ పాఠశాలలు ఉన్నట్లు ఆమె తెలిపారు.వీటన్నింటిలో ఆర్ఓ ప్లాంట్లు,వాష్ రూమ్‌లు,ఇతర సదుపాయాలను కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. వీటన్నింటినీ టాయిలెట్ల నిర్మాణానికి ఇప్పటికే 2,012టాయిలెట్లను స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ ద్వారా మంజూరు చేయడం జరిగిందని,వీటి నిర్మాణ పనులు ప్రగతిలో ఉన్నట్లు తెలిపారు.అదేవిధంగా ముఖ్యమంత్రి ఆదేశించినట్లుగా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడుకునే వీలుగా అన్ని వసతి గృహాల్లో ప్రిపెయిడ్ ఫోన్లు,కాయిన్ ఫోన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. డిఎస్సీ ద్వారా 16వేల పోస్టులకు పైబడి ప్రభుత్వం భర్తీ చేయడం వల్ల అన్ని గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిండుగా ఉన్నారని,ఇప్పటికే ఉన్న 1100మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు ఎవరి్ని తొలగించకుండా వారి సేవలను కూడా వినియోగించుకోవడం జరుగుతుందని తెలిపారు.150మంది మెరిటోరియస్ విద్యార్థులను గుర్తించి వారికి ఐఐటి,ఎన్ఐటి,నీట్ పోటీ పరీక్షల కోచింగ్‌ను పార్వతీపురం, సీతంపేటలలో అందజేయడం జరుగుతుందని, మరో కేంద్రాన్ని త్వరలోనే విశాఖపట్నంలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5వేల మిని అంగన్ వాడీలను మెయిన్ అంగన్ వాడీలుగా మార్చి ప్రతి కేంద్రానికి ఒక టీచర్‌ను,ఆయాను నియమించడం జరిగిందన్నారు. సాక్షం అంగన్ వాడీల్లో దృశ్యశ్రవణ విధానం ద్వారా విద్యాబోధన చేసేందుకు అవసరమైన టివి,ఫర్నిచర్‌ను కొనుగోలు చేసే నిమిత్తం ఒక్కొక్క సాక్షం అంగన్‌వాడీకి రూ.1.లక్ష చొప్పున మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హాయాంలో ఎటువంటి ట్రైకార్ రుణాలను మంజూరు చేయడం జరగలేదని, అయితే గిరిజనుల జీవనోపాధిని మెరుగు పర్చేందుకు తమ ప్రభుత్వం రూ.24కోట్లతో గోకులాలను మంజూరు చేయడం జరిగిందన్నారు.అదేవిధంగా ట్రైకార్ రుణాలను కూడా అందజేయాలనే లక్ష్యంతో రూ.20కోట్లను కేటాయించడం జరిగిందని ఆమె తెలిపారు.ఉపాధి హామీ పథకం కింద 150రోజులపాటు పనిదినాలను గిరిజనులకు కల్పించడం జరుగుతుందన్నారు.శ్రీశైలం అటవీ ప్రాంతంలో 42గ్రామాలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించే ప్రాజెక్టును చేపట్టడం జరిగిందన్నారు.ఆయా ప్రాంతాల్లో ఉన్న చెంచులు,యానాదులకు ఆధార్‌కార్డులు,రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని,తద్వారా వారికి గృహాలు,తాగునీటి సౌకర్యాలు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు చేసే చర్యలను చేపట్టడం జరిగిందన్నారు.పోడు వ్యవసాయం చేసుకునే గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ క్రింద భూపట్టాలను త్వరలో అందజేసే చర్యలను చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. సికిల్సెల్ ఏనిమియాతో బాధపడే గిరిజన మహిళలకు ఐరన్,క్యాల్షియమ్ ఔషధాలను అందజేయడం జరుగుతుందని,వీరికి ప్రత్యేక చికిత్స అందజేసేందుకు విశాఖపట్నం కెజిహెచ్‌లో ఒక ప్రత్యేక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు.

# 5 వేల హెక్టార్లలో బీచ్‌శాండ్ లీజులకు ప్రయత్నాలు!

## - కేంద్ర గనుల శాఖకు ఎపిఎండిసి లేఖ

## - బాక్సైట్ సేకరించిన భూములు బీచ్‌లాండ్‌కు వినియోగం

**విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అణుధార్మికతతో కూడిన అరుదైన ఖనిజాలు ఉండే బీచ్‌శాండ్ తవ్వకాల కోసం మరో 5 వేల హెక్టార్లలో లీజులు పొందేందుకు ఎపి ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ప్రయత్నాలు చేస్తోంది. శ్రీకాకుళం జిల్లా పరిధిలో మూడు లీజుల కింద 5వేల హెక్టార్లు కేటాయించారంటూ కేంద్ర గనుల శాఖ తాజాగా లేఖ రాసింది. గతంలో శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని రెండు లీజులు, విశాఖప్టనం జిల్లా భీమిలి పరిధిలోని ఒక లీజు కలిపి మొత్తం మూడు లీజుల్లో వెయ్యి హెక్టార్ల బీచ్‌శాండ్ నిల్వలను ఎపిఎండిసికి కేంద్రం రిజర్వ్ చేసింది. అయితే రాష్ట్రమంతా కలిపి 16,604 హెకా టర్లలో బీచ్‌శాండ్ డిపాజిట్లు ఉన్నాయి. వీటిని 16 లీజులుగా దశల వారీగా ఇస్తామని గతంలో కేంద్రం తెలిపింది. తొలుత తీసుకున్న లీజుల్లో కార్యకలాపాలు ఆరంభిస్తే, మిగిలినవి కేటాయిస్తామని పేర్కొంది. దీంతో ఇప్పటికే తీసుకున్న వెయ్యి హెక్టార్ల మేర మూడు లీజుల్లో ప్రాజెక్ట్ చేపట్టే ప్రక్రియ మొదలైంది. దీంతో మరో 5 వేల హెక్టార్లు కేటాయించాలని కేంద్రాన్ని ఎపిఎండిసి కోరింది. బీచ్‌శాండ్ లీజుల్లో కొన్నిచోట్ల అటవీ ప్రాంతం ఉంది. ఆ భూములు సేకరించాలంటే ప్రత్యామ్నాయంగా అటవీ శాఖకు భూములు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే గతంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా లోని ఏజెన్సీ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాల కోసం ఆ లీజులను ఎపిఎండిసికి కేటాయించారు. ఆ సమయంలో అక్కడి అటవీ భూములను ప్రత్యామ్నాయ భూములు ఇచ్చేందుకు... ఉమ్మడి కడప జిల్లాలోని జమ్మలమడుగు, మైదుకూరు ప్రాంతాల్లోని 1212 హెక్టార్లు ఎపిఎండిసి సేకరించింది. బాక్సైట్ ప్రాజెక్ట్ లేనందున వాటి కోసం సేకరించిన 1212 హెక్టార్ల భూములను బీచ్‌శాండ్ లీజుల్లోని అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ఇవ్వాలని భావిస్తున్నారు. ఇందుకు అనుమతివ్వాలంటూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రిత్వ శాఖకు ఎపిఎండిసి లేఖ రాసింది. ఎపిలోని బీచ్‌శాండ్‌లో ఇల్మెనైట్ నిల్వలున్నాయి. వీటితో పాటు రూటైల్, గార్నెట్, సిల్లిమినైట్, జిర్కాన్, మోనజైట్ ఖనిజాలున్నాయి. ఈ లీజుల్లో తవ్వే ఖనిజాలను సెరేషన్ ప్లాంట్ ద్వారా వేరుచేస్తారు. తర్వాత వాల్యూ ఎడిషన్ ప్లాంట్ ద్వారా వాటిని మరింత విలువైన ఖనిజాలుగా మారుస్తారు. ఇప్పటికే వెయ్యి హెక్టార్లలో బీచ్‌శాండ్ లీజుల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి, నిర్వహణ కాంట్రాక్టును అదానీకి చెందిన అల్లూవియల్ హెవీ మినరల్స్ దక్కించుకుంది. 2029-30 నాటికి ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. అప్పటి నుంచి ఎపిఎండిసికి ఏటా రూ.120 కోట్ల రాబడి రానుందని భావిస్తున్నారు.

# సీతమ్స్ కళాశాలలో మరో విద్యార్థి ఆత్మహత్య

## - ప్రేమ అంగీకరించలేదని కాలేజీ పై నుండి దూకి మృతి

**చిత్తూరు, నవంబర్ 4 ప్రభాతవార్త:** చిత్తూరు మురకంబట్టు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మరో విద్యార్థి మంగళవారం కళాశాలపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వారం రోజుల్లో చిత్తూరు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇది రెండవ సంఘటన. మూడు రోజుల క్రితం బిటెక్ 3వ సంవత్సరం విద్యార్థిని నందిని కళాశాల 3వ అంతస్తు నుండి కిందికి దూకి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. ఈమె ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ ఘటన మరువకముందే సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రుద్రమూర్తి(17) ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. ఈ క్రమంలో కళాశాలలో తమ క్లాసు అమ్మాయిని రుద్రమూర్తి గాఢంగా ప్రేమించినట్లు తెలిసింది. అయితే ఆ అమ్మాయి రుద్రమూర్తి ప్రేమను అంగీకరించకుండా తాము స్నేహంగా వుందామని, ప్రేమ, పెళ్ళి వద్దని పలుమార్లు చెప్పింది. అయినప్పటికీ రుద్రమూర్తి పట్టువదలని విక్రమార్కుడిలా ఆమెను ప్రేమలో దింపడానికి ప్రయత్నాలు చేస్తునే వున్నాడు. ఈ క్రమంలో సోమవారం సైతం రుద్రమూర్తి తమను ప్రేమించాలని ఆమెను కళాశాలలో కోరినట్లు తెలిసింది. ఆమె యధావిధిగా స్నేహంగా వుందాం! ప్రేమ, పెళ్ళి వద్దని హితబోధ చేసింది. ఈ క్రమంలో మంగళవారం ఇద్దరు పరీక్షకు హాజరయ్యారు. అమ్మాయి పరీక్ష రాసి వెళ్ళిపోగా, రుద్రమూర్తి మాత్రం పరీక్ష రాసిన అనంతరం తమ ప్రేమను తన ప్రేయసి నిరాకరించిందని భావించి కళాశాల 2వ అంతస్తుపై నుండి కిందికి దూకాడు. కళాశాల పై నుండి కిందికి దూకడంతో రుద్రమూర్తికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన రుద్రమూర్తిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రుద్రమూర్తి మృతి చెందాడు. రుద్రమూర్తి చిత్తూరు మురుగానిపల్లికి చెందిన వాడు. ఈ మేరకు చిత్తూరు తాలుకా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రూ.50 కోట్లు దాటిన బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ డిపాజిట్లు

**విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి బ్రాహ్మణ సంక్షేమ సంస్థకు అనుబంధంగా ఉన్న బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ తొలిసారిగా డిపాజిట్ల సేకరణలో రూ.50 కోట్ల మైలురాయిని దాటింది. గత నెలాఖరుతో సొసైటీ డిపాజిట్లు రూ.50.99 కోట్లకు చేరాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నుంచి ఇప్పటి వరకు బ్రాహ్మణులకు వివిధ అవసరాల కోసం రూ.81.95 కోట్లను రుణాలుగా మంజూరు చేసింది. 2016లో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ సొసైటీలో ప్రస్తుతం 79,625 సభ్యులు ఉండగా, 17 శాఖలతో నడుస్తోంది. ప్రాథమిక సహకార సంఘాల్లో అత్యధిక సభ్యత్వం గల సంఘంగా గుర్తింపు తెచ్చుకుంది.

వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి లక్ష మందికి సభ్యత్వం, రూ.100 కోట్ల రుణాల పంపిణీని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ సంస్థ చైర్మన్ కె.బుచ్చిరాంప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలోని బ్రాహ్మణులంతా ఈ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని వారి ఆర్థిక అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

# ప్రభుత్వాస్పత్రిలో దౌర్జన్యంపై కేసు నమోదు

## - ఎ1గా జోగి రమేష్ భార్య శకుంతల, ఎ2, ఎ3గా కుమారులు

**విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసులను దౌర్జన్యంగా తోసేసి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో అద్దాలు పగులగొట్టిన ఘటనపై వైకాపా నేత జోగి రమేష్ భార్య, ఇద్దరు కుమారులు, మరికొందరిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. నకిలీ మద్యం కేసులో అరెస్టయిన జోగి రమేష్, రాములను న్యాయస్థానంలో హాజరుపరిచే ముందు పోలీసులు ఆదివారం రాత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వైకాపా శ్రేణులు వీరంగం సృష్టించాయి. లోపలకు చొచ్చుకురాకుండా నిలువరిస్తున్నా ఆగకుండా ఆ పార్టీ అనుచరులు పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డు ప్రవేశ ద్వారం అద్దాలు పగులగొట్టారు. అక్కడే విధుల్లో ఉన్న మాచవరం ఎస్ఐ శంకరరావు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిపై దౌర్జన్యం చేశారు. వీరిలో జోగి రమేష్ భార్య శకుంతల, కుమారులు రాజీవ్, రోహిత్ కూడా ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి బీఎన్ఎస్‌లోని 189(2), 324(3), రెడ్‌విత్ 190,3 పీడీపీపీఏలోని సెక్షన్ల క్రింద కేసు నమోదు చేశారు. ఎ1గా జోగి రమేష్ భార్య శకుంతల, ఏ2గా పెద్ద కుమారుడు రాజీవ్, ఏ3గా చిన్న కుమారుడు రోహిత్‌లతో పాటు మరికొందరిని నిందితులుగా చేర్చారు.

ఘటన జరిగిన సమయంలో తీసిన వీడియోలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మరో 10 నుంచి 15 మందిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది.

# రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు వర్షాలు

**విజయవాడ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు మంగళవారం ఆ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సమయాల్లో చెట్ల కింద నిలబడరాదని ఆ సంస్థ సూచించింది.

# అమరావతిలో రూ.150 కోట్లతో సెంట్రల్ లైబ్రరీ

# 10మున్సిపాలిటీల్లో రూ.1004 కోట్లతో నీటిసరఫరా ప్రాజెక్టులు

**రాజంపేట, నవంబరు 4 ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లతో పెద్ద ఎత్తున సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ పనులు చేపట్టేందుకు దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన ఆర్కిటెక్చర్ కన్సల్టెన్సీ ఏజెంట్లను టెండర్ల ద్వారా ఆహ్వానించింది. రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో సెంట్రల్ లైబ్రరీని నిర్మించాలని టెండర్లలో పేర్కొంది. ఈ మేరకు ఆర్ఎఫ్‌పిని రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల సంస్థ టెండర్లను పిలిచింది. అలాగే పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (యుఐడిఎఫ్) కింద రాష్ట్రంలో పది మున్సిపాలిటీల్లో నీటి సరఫరా పథకాలు, రెండు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు రూ.1004.87 కోట్ల అంచనాతో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం టెండర్లను పిలిచింది. రాష్ట్రంలోని జగ్గయ్యపేట, గుంటూరు, మాచర్ల పిడుగురాళ్లలో రూ.401.70 కోట్ల వ్యయంతో నీటి సరఫరా చేసేందుకు స్థానిక నీటి వల్ల ద్వారా ప్రాజెక్టులను చేపట్టనున్నారు. అలాగే నెల్లూరు, సూళ్లూరుపేటలో పారిశుద్ధ్యం ప్రాజెక్టులు చేపట్టనున్నారు. అదేవిధంగా పుత్తూరు,

గూడూరు, కావలి, కందుకూరు మున్సిపాలిటీలో నీటి సరఫరాకు రూ.603.17 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. దీనికి సంబంధించి పబ్లిక్ హెల్త్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు.

# తిరుమల సమాచారం

## గోవుల సంరక్షణ పై మరింత బాధ్యత

### - టిటిడి ఇఒ సింఘాల్ పరిశీలన



**తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో గోసంరక్షణకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారు. టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్వీ గోసంరక్షశాల, తిరుమలలో గోశాల నిర్వహిస్తున్నారు. ఇక్కడ స్వదేశీ గోజాతులకు చెందిన ఆవులు ఉన్నాయి. వీటి ఆరోగ్యం, సంరక్షణపై గతంలో వెల్లువెత్తిన ఆరోపణలతో టిటిడి పాలనపై అనుభవం, అధికారులతో సమన్వయం చేసుకునే తత్వం కలిగిన ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ మంగళవారం ఉదయం ఉన్నఫళంగా తిరుపతిలోని ఎస్వీ గోశాలను పరిశీలించారు. గోశాలకు ఇన్‌ఛార్జిగా డిఎఫ్ఓ ఫణికుమార్‌నాయుడు వ్యవహరిస్తున్నారు. ఆయనకు రైతాంగం, గోమాతల సంరక్షణపై అవగాహన ఉంది. ఈ నేపథ్యంలో గోవుల ఆరోగ్యసంరక్షణ, నాణ్యమైన దాణా, ఏ సమయంలో ఎలాంటి ఆహారం అందించాలనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గోశాలలో సిబ్బందితో మమేకమై వారితో కలసి ఫణికుమార్‌నాయుడు గోమాతలకు సేవలందిస్తున్నారు. మంగళవారం ఇఒ సింఘాల్ పరిశీలనలో గోవుల నిర్వహణ, గోవులకు అందుతున్న దాణా, వసతి, వైద్యం, తాగునీరు, పరిశుభ్రత అంశాలపై తనిఖీ చేశారు. దాదాపు 500 గోవులకు ఆధునిక వసతులతో నిర్మిస్తున్న సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ భవనాన్ని, గోవులు, పేయదూడలు ఉంటున్న షెడ్డును ఇన్‌ఛార్జి ఫణికుమార్‌నాయుడుతో కలసి ఇఒ పరిశీలించారు. గోశాలలో పశువులు, దాణా మిక్సింగ్‌ప్లాంట్, అగరబత్తీల యూనిట్ కార్యకలాపాలను ఆయన పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారినుండి ఉత్పత్తులు, వారి సమస్యలు తెలుసుకున్నారు.

## సంప్రదాయ ఆహారం అందించాలి

### - ఔషధవనం ఏర్పాటుపై అదనపు ఇఒ చౌదరి సూచనలు



**తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్త ప్రతినిధి:** భక్తులకు నాణ్యమైన రుచికరమైన సాంప్రదాయ ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటళ్ళు, దుకాణాదారులపై ఉందిన టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఉద్ఘాటించారు. త్వరలో భక్తులకు సేవలందించనున్న కొత్త హోటళ్ళు, జనతాక్యాంటీన్ల యాజమాన్యం భక్తులకు సాంప్రదాయ ఆహారాన్ని అందించాలన్నారు. పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంగళవారం తిరుమల పద్మావతి అతిధిభవనంలోని సమావేశమందిరంలో అన్ని విభాగాల అధికారులతో సమన్వయసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాదారులకు భక్తులకు అందించాల్సిన నాణ్యమైనసాంప్రదాయ ఆహారంపై సూచనలు చేశారు. తిరుమలలో పచ్చదనం పెంపుపై, భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ఉద్యానవనాలు సుందరీకరణపై సూచనలు చేశారు. ఔషధవనాన్ని ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ఎల్ఇడి బోర్డులు, శ్రీవారిసేవ, వైద్య,ఐటి.కల్యాణకట్ట విభాగాల పనితీరును సమీక్షించారు. ఈ సమావేశంలో రవాణ జిఎం శేషారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ వెంకటయ్య, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, ఇఇ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ శుభాలు కలగాలి: ప్రముఖులు



**తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలశ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని దేవుని ప్రార్థించినట్లు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం ఉదయంనైవేద్యాల విరామ సమయంలో ఆయన కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రూ.30లక్షలు విలువైన వెండి గంగాళం విరాళం



**తిరుమల,నవంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన జక్కారెడ్డి శ్రీనివాసులురెడ్డి 30లక్షలు రూపాయలు విలువైన వెండి గంగాళాన్ని విరాళంగా అందించారు. మంగళవారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు ఆలయ అధికారులకు 22కిలోల వెండి గంగాళాన్ని అందజేశారు.

## 7న తిరుపతి పర్యటనకు డిసిఎం పవన్‌కల్యాణ్

**తిరుపతి,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటనకు ఈనెల 7వతేదీ శుక్రవారం వస్తున్నారు. అటవీశాఖమంత్రి కూడా అయిన ఆయన 7,8తేదీల్లో రెండురోజులు మామండూరు అటవీప్రాంతాన్ని, పలమనేరులో పర్యటించనున్నట్లు జనసేనపార్టీ వర్గాలు తెలిపాయి


**ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ**
రాయపూడి , అమరావతి- 522237, (ఎ.పి.)

**నోటీసు**

ఫైల్ నెంబర్: MAU61-LNDOOTH/175/2025-LND:
ఏపీ సిఆర్‌డిఏ చట్టం, 2014 సెక్షన్ 39(1) మరియు 41(3) కలిగిన అధికారాలను వినియోగిస్తూ, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(APCRDA), అమరావతి, ఈ ప్రకటన ద్వారా E-13 రహదారి పునర్వవస్థీకరణను ప్రతిపాదిస్తోంది. ఈ రహదారి 50 మీటర్ల వెడల్పుతో పాత జాతీయ రహదారి నుంచి NH-16 వరకు ప్రతిపాదించబడింది. ఈ విస్తరణ నవులూరు గ్రామంలోని సర్వే నెం. 201, 200, 810, 224, 808, 799, 800, 802, 801, 803, 793, 792, 791 మంగళగిరి గ్రామంలోని సర్వే నెం.: 232 మరియు తాడేపల్లి గ్రామంలోని సర్వే నెం.: 372 మరియు గ్రామంలోని సర్వే నెం.: 6, 7, 8 & 10 మంగళగిరి-తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిపాదించబడింది.

ప్రతిపాదిత ఈ-13 రోడ్ విస్తరణ ముసాయిదా ప్రణాళిక మరియు సంబంధిత వివరాలను APCRDA వెబ్‌సైట్ http://crda.ap.gov.inలో, అలాగే అమరావతిలోని APCRDA కార్యాలయం, గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం, మంగళగిరి మండల తహసీల్దార్ (MRO) మరియు MPDO కార్యాలయాలలో, మంగళగిరి-తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చూడవచ్చు.

ఫైల్ నెంబర్: MAU61-LNDOOTH/175/2025-LND:
ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం 2014 నందు సెక్షన్ 39(1) మరియు 41(3) అధికారముల ప్రకారం, అమరావతిలోని APCRDA కార్యాలయం ప్రస్తుతం ఈ క్రింది వివరాల ప్రకారం E-15 రోడ్డును విస్తరించే ప్రతిపాదనను ప్రకటిస్తోంది. ఈ రోడ్ విస్తరణ ప్రతిపాదన ప్రకారం 30 నుండి 45 మీటర్ల మధ్య వ్యత్యాసంగా ఉన్న వెడల్పుతో ప్రధాన జిల్లా రహదారి MDR-104, 138 పై విస్తరించబడనుంది. ఇది నవులూరు గ్రామంలోని సర్వే నెం.357, 358, 351, 360, 359, 372, 356 & 113, 114, 112 లో మరియు మంగళగిరి గ్రామంలోని సర్వే నెం.8,10, 271/A, 297, 273, 271/B, 288, 293, 296, 295, 292, 271/C, 298, 303, 304, 276, 274/C, 274/D, 302, 299, 274/A, 305, 309, 287, 258, 272, 260 & 254, 255, 256, 257, 111, 251, 250, 112, 41, 39, 40, 253, 279, 280, 234, 235, 236, 252, 249, 113లో విస్తరించనుంది. ఈ రోడ్ విస్తరణ ద్వారా అమరావతి రాజధాని నగరం గుంటూరు- మంగళగిరి రహదారికి అనుసంధానం కానుంది.

ప్రతిపాదిత ఈ-15 రోడ్ విస్తరణ ముసాయిదా ప్రణాళిక మరియు సంబంధిత వివరాలను APCRDA వెబ్‌సైట్ http://crda.ap.gov.inలో, అలాగే అమరావతిలోని APCRDA కార్యాలయం, గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం, మంగళగిరి మండల తహసీల్దార్ (MRO) మరియు MPDO కార్యాలయాలలో, మంగళగిరి తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చూడవచ్చు.

ఈ ప్రకటన పబ్లిష్ అయిన తేదీ నుండి 30 రోజుల వ్యవధిలోగా ఏమైనా అభ్యంతరాలు/సూచనలు ఉన్న వ్యక్తులు లేదా సంస్థలు వాటిని రాతపూర్వకంగా క్రింది చిరునామాకు పంపవచ్చు:కమిషనర్, APCRDA, లెనిన్ సెంటర్, గవర్నర్ పేట్, విజయవాడ - 520002. అభ్యంతరాలు లేదా సూచనలు పంపే వారు వారి పేరు, చిరునామా, టెలిఫోన్/ఫ్యాక్స్ నంబరు మరియు ఈమెయిల్ చిరునామా తప్పనిసరిగా ఇవ్వాలి. సంప్రదించడానికి అవసరమైన వివరాలు లేకపోతే, అభ్యంతరాలు లేదా సూచనలు పరిగణనలోకి తీసుకోబడవు.

కమిషనర్, ఎ.పి.సి.ఆర్.డి.ఎ., విజయవాడ

మన సమస్యలకు పరిష్కారాలు మన దగ్గరే ఉంటాయి. కానీ మనం ఎవరో పరిష్కరించుకోవాలని అనుకుంటామంతే.

-షేక్‌స్పియర్

# 'డిజిటల్' వంచనకు కళ్లెం ఎప్పుడు?


ఆర్థిక నేరాల జాబితాలో కొత్తగా చేరిన డిజిటల్ అరెస్టులు, కోట్లు కొల్లగొట్టడాలు వంటి మోసపూరిత వ్యవహారాలు విరివిగా జరగడంతో ఈ దేశానికి పెద్ద చిక్కొచ్చిపడింది. దేశం మొత్తం మీద రోజుకొక్కటైనా బయటపడుతోంది. ఈ ఏడాది సమాజానికి అతి పెద్ద సవాలు ఏదైనా ఉందంటే అది డిజిటల్ అరెస్టులే. జరిగిన సంఘటనలను విశ్లేషించుకుంటే బాధితులు ఎక్కువ మంది వృద్ధులే. దేశంలోనే ఇంతవరకు రూ.3 వేల కోట్లు మోసగాళ్ల ఖాతాల్లోకి చేరిపోయింది. వయోవృద్ధుల కష్టార్జితాన్ని, సంపదను, మోసగాళ్లు తేలికగా కొల్లగొట్టగలిగారంటే, దానికి పెట్టుబడి కేవలం జనంలో ఉండే భయమే. అరెస్ట్ అనే పదం వింటేనే భయపడతాం. ఇదెక్కడి గొడవరా బాబూ! అని నిట్టూర్పు విడుస్తాం. అలాంటిది కనీసం పోలీసుస్టేషన్‌కి వెళ్లకుండానే ఫోన్లోనే డిజిటల్ అరెస్ట్ అయ్యారు. అంటే ఇంక పైప్రాణాలు పైకే. ఈ బలహీనతను ఆసరాగా తీసుకుని డిజిటల్ అరెస్టులను కొత్త పదం సృష్టించారు. ఇది ఏ సాంకేతిక పద కోశంలోనూ కనపడని మాట. కనీసం పోలీసులకు పరిచయం లేని మాట. కానీ ఈ పదాన్ని సృష్టించి విశ్వామిత్రుడిని తలదన్నేలా విశ్వవ్యాప్తి చేయగలగటం విస్మయపరిచే విషయం. ఇది విస్తృత పరిధి గల అంశంగా సుప్రీంకోర్టు భావిస్తోంది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం సమర్పించిన రహస్య నివేదికను పరిశీలిస్తోంది. ధర్మాసనం ముందుకు డిజిటల్ అరెస్టుల సమస్య ప్రస్తావనలోకి రావడంతో రానున్న రోజుల్లో ఈ అంశంపై గట్టి పరిష్కారం లభించే అవకాశం ఉంది. దీనిని అతి పెద్ద సవాలుగా స్వీకరిస్తోంది. న్యాయవ్యవస్థ కఠినమైన ఆదేశాలను జారీ చేసే విషయమై ఆలోచిస్తోంది. నేరగాళ్లను గుర్తించడంలో ఎలాంటి ఆటంకాలున్నా, చట్ట పరిధిలో నుంచి మినహాయింపు నిచ్చే విధంగా నిర్ణయిస్తుందని ఎదురు చూస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ స్కామ్ మొదట్లో తాము ఊహించిన దానికంటే ఎక్కువగా ఉందని న్యాయవ్యవస్థ పరిధిలోనే పరిష్కారాలు, మార్గదర్శకాలు లభిస్తాయని పోలీసు వ్యవస్థ నమ్ముతోంది. మునుపటి విచారణలో, సుప్రీంకోర్టు మోఖికంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దర్యాప్తు బాధ్యతను చేపట్టాలని ప్రతిపాదించింది. నకిలీ పత్రాలను ఉపయోగిస్తూ న్యాయమూర్తులు, పోలీసు అధికారులుగా నటిస్తూ మోసగాళ్ల మోసానికి డిజిటల్ పరికరాలే పరోక్షంగా సహకరిస్తున్నాయి. సైబర్ నేరాలు సరిహద్దుల అవతల నుండి ఉద్భవించాయని, "మనీ లాండరింగ్ ముఠాల" ద్వారా రూపొందించబడ్డాయని అటార్నీ జనరల్ వెంకటరమణి తన అభిప్రాయాన్ని కోర్టుకు నివేదించారు. డిజిటల్ అరెస్టుల వెనుక ఉన్న ఆర్గనైజేషన్ సైబర్ నేరాలు 'స్కామ్ కాంపౌండ్స్' నుండి ఉత్పన్నమవుతున్నాయి అనే అభిప్రాయపడ్డారు. హర్యానాలోని అంబాలాలో సీనియర్ సిటిజన్ జంట నుంచి రూ. 1.05 కోట్లు వసూలు చేయడానికి మోసగాళ్ళు డిజిటల్ అరెస్టు పేరిట దోచుకున్న కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. అయితే, దేశవ్యాప్తంగా అనేక నమోదవుతున్నాయని, అమాయక ప్రజలను, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లను, నేరస్థులు ఆర్టిఫిషియల్ ఇంటెల్‌లిజెన్స్ ఇతర అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్న విషయం న్యాయస్థానం ముందుకు వచ్చింది. 'ఆర్థిక కోణం మాత్రమే కాకుండా మానవీయ కోణం కూడా ప్రభావం చూపుతుంది. మోసపూరిత వ్యక్తులకు విదేశాలలో ఉపాధి హామీగా ఈ దగా ఉపయోగపడుతుంది. నేరస్థులున్యాయమూర్తుల ముఖాలను మార్ఫింగ్ చేస్తారు.కోర్టు గదులను నేపథ్యంగా చూపించి బాధితులకు కాల్‌చేస్తారు.డిజిటల్ ఆరెస్టుకేసుల్లో కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని సాక్షాత్తూ సుప్రీంకోర్టు త్రిసభ్యధర్మాసనం అభిప్రాయపడింది.విస్తృత స్థాయిలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అత్యున్నత న్యాయస్థానం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. తమకు ఒక పరిశీలనా నివేదికనిచ్చి సూచనలు చేసేందుకు అమికస్ క్యూరీని ఏర్పాటు చేసింది. సైబర్ నేరాలలోనే ఇది అతి కిరాతకమైన నేరం. ఈ రకం నేరం చేసే మోసగాళ్లు బెదరింపులకు పాల్పడుతూ,ఆడియో,విడియో కాల్స్‌తో ప్రధానంగా వృద్ధులను లక్ష్యంగాచేసుకుని పీడిస్తున్నారు. బాధితులను కాల్స్‌లోనే బందీలుగా చేసి, డబ్బులు చెల్లించేలా వత్తిడి తెస్తున్నారు. వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని ఒక విధంగా చెప్పాలంటే మెస్మరైజ్ చేస్తున్నారు. కేంద్ర హోంశాఖ సిబిఐ సమర్పించిన రెండు నివేదికలను కోర్టు పరిశీలించింది. ఒకవేళ ఇలాంటి కేసుల్లో కఠినమైన ఆదేశాలు ఇవ్వకుంటే, ఈ సమస్య మరింత జటిలంగా మారుతుందని ధర్మాసనం పేర్కొన్నది. సైబర్ నేరాల కారణంగా ఎంతో మంది ఆర్థిక దోపిడీకి గురవుతున్నారు. ఈ కేసుల తీవ్రతను అర్థం చేసుకోకపోతే ఇకపై మరింత మంది మోసగాళ్ల గాలంలో పడిపోతారు. థాయ్‌లాండ్, నైజీరియా వంటి దేశాల నుంచి ఇలాంటి నేరాలు తొంగి చూస్తున్నాయి. ఇదే విషయమై ఇంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రొబేషనరీ ఐపిఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు డిజిటల్ అరెస్టు ముప్పు నుంచి ప్రజలను కాపాడాలంటే వారిని చైతన్యవంతుల్ని చేయడం ఒక్కటే తక్షణ కర్తవ్యంగా భావించాలని కోరారు. సైబర్ నేరగాళ్ల వీడియోకాల్స్ చేసి తాము పోలీసులమని తాము చెప్పినట్లు చేయకుంటే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారు. కాగా అలాంటి సందర్భంలో ధైర్యం వహించి చాకచక్యంగా వ్యవహరించినప్పుడే ఇలాంటి ముప్పు నుంచి బయటపడతాం.

నువ్వు భయపడితే అది భయపెట్టేవాని సమర్థత కాదు, భయపడే అసమర్థత నీది.



ఎల్లెన్ గ్లాస్గో

మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.



పాస్కల్


# సునామీపై అవగాహన అవసరం

**సునా మీ ప్రమాదం గురించి,అత్యవసర పరిస్థితుల్లో ఏమి చేయా లో ప్రజలకు తెలిసినప్పుడే ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ప్రభావ వంతంగా ఉంటుందనే సూత్రంపై ఇది ఆధారపడి ఉంది. సునామీ సంసిద్ధత ప్రామాణిక స్థాయిని చేరుకోవడా నికి సహకార ప్రయత్నం ద్వారా ఇది సాధించబడుతుంది. ఈ కార్యక్రమం స్వచ్ఛందంగా ఆధారిత కమ్యూనిటీ పని తీరు గుర్తింపు కార్యక్రమంగా అమలు చేయబడుతుంది.ఇది జాతీయ,స్థానిక హెచ్చరిక,అత్యవసర నిర్వహణ సంస్థలు, ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు,కమ్యూనిటీ నాయకులు, ప్రజల మధ్య క్రియాశీల సహకారంగా సంసిద్ధత భావనను అర్థంచేసుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది. జాతీయస్థాయిలో ఈ కార్యక్రమానికి జాతీయ విధానం, యంత్రాంగం మద్దతు ఇవ్వాలి. ఇక మన దేశంలో చూస్తే ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ నేషనల్ సునామీ రెడీబోర్డును ఏర్పాటు చేసింది. ఒడిషా రాష్ట్రంలోని వెంకట్రాయిపూర్,నోలియాసాహి గ్రామాలు మన దేశంలో మొట్టమొదటి హిందూ మహాసముద్ర సునామీ రెడీ కమ్యూనిటీలుగా ఉన్నాయి. హిందూ మహాసముద్ర ప్రాంతానికి ఉన్న మూడు సునామీ సర్వీస్ ప్రొవైడర్లలో భారతదేశం ఒకటిగా పనిచేస్తుంది.**

డి. జయరాం

సునామీలను నివారించడం సాధ్యం కానప్పటికీ, అత్యవసర సంసిద్ధత,సమయానుకూల హెచ్చరికలు, సమర్థవంతమైన ప్రతిస్పందన, ప్రభుత్వ సహాయం ద్వారావాటి ప్రభావాన్ని మనం తగ్గించవచ్చు. 2004 డిసెంబర్ 26న హిందూ మహాసముద్రంలో,ఇండోనేషియాలోని ఉత్తర సుమత్రా పశ్చిమ తీరంలో గల సిమెలుయే ద్వీపానికి ఉత్తరాన 6.8 నుంచి 9.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ భూకంపం సృష్టించిన సునామీ 18మీటర్ల (55.8 అడుగులు)ఎత్తు అలలతో ఇండోనేషియా, శ్రీలంక, థాయ్‌లాండ్, దక్షిణ భారతదేశం, టాంజానియా వరకు విధ్వంసం సృష్టించింది. 1964లో అలాస్కాలో 9.2 తీవ్రతతో సంభవించిన గుడ్ ఫ్రైడే భూకంపం తర్వాత ఇదే అతిపెద్ద భూకంపం.ఈ సంఘటన 21వ శతాబ్దంలో సంభవించిన మొదటి పెద్ద ప్రపంచ విపత్తుగా చరిత్రలో అత్యంత ఘోరమైన విపత్తులలో ఒకటిగా నిలిచిపోయింది. ఈ విపత్తులో అధికారిక లెక్కల ప్రకారం మన దేశంలో 10,136మంది మరణించారు. వీరిలో అత్యధిక మరణాలు తమిళనాడులో నమోదయ్యాయి. ఈ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, సునామీల పట్ల అవగాహన, సంసిద్ధత, ముందస్తు హెచ్చరిక, ప్రమాదకర ప్రభావాల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచే లక్ష్యంతో 2015 డిసెంబరులో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ నవంబర్ 5ను ప్రపంచ సునామీ అవగాహన దినంగా గుర్తించింది. సునామీలపై ప్రజలందరికీ అవగాహన ఉండాలి. ఎందుకంటే 1998 నుండి 2018 మధ్య సునామీల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇరవై వేల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లింది. తీరప్రాంతాల్లో జనాభా అధికమవడం, సముద్ర మట్టం పెరుగుదల వంటి ఉమ్మడి ప్రభావాల కారణంగా భవిష్యత్తులో సునామీ మరణాల సంఖ్య ఇంకాపెరిగే అవకాశం ఉంది.ప్రపంచ సునామీ అవగాహన దినం అనేది జపాన్ మేధోమథనం నుంచి పుట్టింది. సునామీల ముప్పు ఉన్న దేశాలు వారివారి దేశాల ప్రజల తరలింపు మార్గాలను, కొత్త హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, పిల్లలు యువతలో అవగాహన పెంచాలని వైపరీత్యాల ప్రమాదాలను తగ్గించే ఐక్యరాజ్యసమితి కార్యాలయం (యుఎన్డిడిఆర్ యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్) కోరుతోంది.'సునామీ' అనే పదం జపనీస్ భాష నుండి ఉద్భవించింది. ఇందులో 'త్సు'అంటే నౌకాశ్రయం,'నామి' అంటే తరంగం అని అర్థం. సునామీ అనేది సాధారణంగా సముద్రం క్రింద లేదా సమీపంలోసంభవించే భూకంపాలతో సంబంధం ఉండి నీటి అడుగున అంతరాయం సృష్టించే భారీ తరంగాల శ్రేణిని సూచిస్తుంది.

మహాసముద్రాలలో నీటి స్థానభ్రంశం ద్వారా సునామీలు ఉత్పన్నమవుతాయి. భూకంపం సమయంలో సముద్రపు అడుగుభాగంలో ఉన్న టెక్టోనిక్ ప్లేట్ల కదలిక ద్వారా ఇవి సాధారణంగా సృష్టించబడతాయి.అయినప్పటికీ, అగ్నిపర్వత విస్ఫోటనాలు, హిమనదీయ శిల్పాలపతనం, ఉల్క ప్రభావాలు లేదా కొండచరియలు విరిగిపడటం వల్ల కూడా ఇవి సంభవించవచ్చు. అయితే అన్ని భూకంపాలు సునామీలకు కారణంకావు. భూకంపం సునామీని సృష్టించడానికి నాలుగు ముఖ్యమైన షరతులు అవసరమని నిపుణులు చెబుతున్నా



రు. ఇందులో మొదటది, భూకంపం సముద్రం అడుగున సంభవించాలి. రెండు, రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత కనీసం 6.5గా నమోదవ్వాలి.మూడు, భూకంపంతో భూమి ఉపరితలం చీలిపోవాలి. నాలుగు, భూకంప కేంద్రం భూమి ఉపరితలం నుంచి 70 కిలోమీటర్ల కంటే తక్కువ లోతులో ఉండాలి. 1883 ఆగస్టు 26న ఇండోనేషియాలోని క్రాకటొ అగ్నిపర్వత విస్ఫోటనం అత్యంత విధ్వంసకర సునామీని సృష్టించింది.ఈ పేలుడు కారణంగా 135 అడుగుల ఎత్తుకు అలలు ఎగిసిపడగా, జావా, సుమత్రా దీవుల్లోని సుందా జలసంధి వెంబడి తీరప్రాంత పట్టణాలు, గ్రామాలు ధ్వంసమయ్యాయి. సుమారు 36,417 మంది మరణించారు. ఇటీవలి చరిత్రలో ఉల్కలు లేదా గ్రహశకల ప్రేరిత సునామీలు నమోదు కానప్పటికీ ఈఖగోళ వస్తువులు సముద్రాన్ని తాకితే నిస్సందేహంగా పెద్ద మొత్తంలో నీరు స్థానభ్రంశం చెంది సునామీని సృష్టిస్తుందని శాస్త్రవేత్తలు నొక్కి చెబుతున్నారు. తీరప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలలో అధిక జనాభా కేంద్రీకృతమై ఉండటం వలన, వీరు సునామీల ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా లోతట్టు తీరప్రాంతాలు, చిన్న ద్వీపాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 కోట్లకు పైగా ప్రజలు సునామీలతో సహా తీవ్రమైన సముద్రమట్ట సంఘటనలకు గురవుతున్నారని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 2019 తెలిపింది. సునామీ ప్రమాదం గురించి, అత్యవసర పరిస్థితుల్లో ఏమి చేయాలో ప్రజలకు తెలిసినప్పుడు మాత్రమే ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ప్రభావవంతంగా పనిచేస్తుందని యునెస్కో 2022 నివేదిక నివేదించింది.2004 హిందూ మహాసముద్రసునామీ దుర్ఘటన ఫలితంగాహిందూ మహాసముద్ర పరీవాహక ప్రాంతంలోని 27దేశాలకు ప్రయోజనం చేకూర్చే సునామీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ సృష్టికి దారితీసింది. ఇంటర్ గవర్నమెంటల్ ఓషనోగ్రాఫిక్ కమిషన్ (ఐఓసీ) యునెస్కో సమన్వయంతో రూపొందించిన గ్లోబల్ సునామీ వార్నింగ్ సిస్టం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఐఓసి యునెస్కో సునామీ కార్యక్రమం,సునామీ సర్వీస్‌ప్రొవైడర్లు, సమాచార కేంద్రాల మద్దతుతో, సునామీ ప్రమాదాన్ని అంచనా వేయడంలో, సునామీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను (ఇడబ్ల్యుఎస్) అమలు చేయడంలో ప్రమాదంలో ఉన్న కమ్యూనిటీలకు సంసిద్ధత చర్యల గురించి అవగాహన కల్పించడంలో సభ్యదేశాలకు మద్దతుఇస్తుంది. భారత ప్రభుత్వం భారత సునామీ ముందస్తు హెచ్చరిక కేంద్రాన్ని హైదరాబాద్‌లో అక్టోబర్ 2007 నుండి నిజ సమయ భూకంప పర్యవేక్షణ,సముద్రమట్ట టైడ్ గేజ్‌ల నెట్‌వర్క్‌తో 24 గంటలూ పనిచేసే విధంగా నెలకొల్పబడింది. సునామీసంసిద్ధతా కార్యక్రమం అనేది ఒక బహుళ స్థాయి కార్యక్రమం. సునామీ ప్రమాదం గురించి,అత్యవసర పరిస్థితుల్లో ఏమి చేయాలో ప్రజలకు తెలిసినప్పుడే ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ప్రభావ వంతంగా ఉంటుందనే సూత్రంపై ఇది ఆధారపడి ఉంది. సునామీ సంసిద్ధత ప్రామాణిక స్థాయిని చేరుకోవడానికి సహకార ప్రయత్నం ద్వారా ఇది సాధించబడుతుంది. ఈ కార్యక్రమం స్వచ్ఛందంగా ఆధారిత కమ్యూనిటీ పని తీరుగుర్తింపు కార్యక్రమంగా అమలు చేయబడుతుంది.ఇది జాతీయ,స్థానిక హెచ్చరిక,అత్యవసర నిర్వహణ సంస్థలు, ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు,కమ్యూనిటీ నాయకులు, ప్రజల మధ్య క్రియాశీల సహకారంగా సంసిద్ధత భావనను అర్థంచేసుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది. జాతీయస్థాయిలో ఈ కార్యక్రమానికి జాతీయ విధానం, యంత్రాంగం మద్దతు ఇవ్వాలి. ఇక మనదేశంలో చూస్తే ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ నేషనల్ సునామీ రెడీబోర్డును ఏర్పాటు చేసింది. ఒడిషా రాష్ట్రంలోని వెంకట్రాయిపూర్,నోలియాసాహి గ్రామాలు మన దేశంలో మొట్టమొదటి హిందూ మహాసముద్ర సునామీ రెడీ కమ్యూనిటీలుగా ఉన్నాయి. హిందూ మహాసముద్ర ప్రాంతానికి ఉన్న మూడు సునామీ సర్వీస్ ప్రొవైడర్లలో భారతదేశం ఒకటిగా పనిచేస్తుంది. •

# అమానవీయతతో మనుగడ సాధ్యమా!

జోస్యుల వేణుగోపాల్

అక్కడ, ఇక్కడ అని లేకుండా ఎక్కువగా ప్రభుత్వ రంగంలో ఈనిర్లక్ష్యమనేది ప్రజలకు నరకంగా మారుతోంది. ఏ వ్యక్తికైనా, ఏ ప్రభుత్వ రంగానికైనా సొంత ఎజెండా తప్ప ప్రజా సంక్షేమం పట్టదు. అనేక పుణక్షేత్రాల్లో దర్శనాలకు, స్నానాలకు, వెళ్ళిన వాళ్ళు, అనేక పార్టీ మీటింగుల్లో అభిమానంతో నాయకుడి జెండా మోయడానికి వెళ్ళినవాళ్ల మృత్యువాత పడడం చూస్తున్నాం.ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల్ని గాలికొదిలేసిన ప్రభుత్వాలను చూస్తున్నాం. పరిశ్రమల్లోను, రోడ్డు ప్రమాదాలు, విమాన ప్రమాదాలకు ఎక్కువభాగం కారణం నిర్లక్ష్యమే. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా అధికార యంత్రాంగాల నిర్లక్ష్య ధోరణే కోట్ల మంది ప్రాణాలు హరించింది. ప్రభుత్వ రికార్డుల్లైన ఆధార్ కార్డ్ లాంటి వాటిల్లో అడ్రసు నమోదు చేసే సమయంలో ఇష్టా రీతిన తప్పులు రాసి దాన్ని సరిదిద్దడానికి మరలా వారి చుట్టే తిరగాల్సి రావడం ప్రజల దౌర్భాగ్యం. అనేక ప్రభుత్వాసుపత్రుల్లోను, బ్యాంకుల్లోను వచ్చే జనం కోసం ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయకుండా చిన్నస్థాయి ఉద్యోగి నుండి అధికార్ల దాకా అందరూ ప్రజల్ని విసుక్కుంటూ మహిళలు, పిల్లలు, పెద్దవాళ్లు అనేది లేకుండా, ప్రతిపనికి గంటల తరబడి క్యూలో నిలబెడుతూ వారి సహనానికి పరీక్ష పెడతారు. ఏ వ్యవస్థ అయినా అది ప్రజలవల్లే నడుస్తుందనేది గుర్తించరు. చెమటోడ్చి రూపాయి రూపాయి కూడగట్టిన సొమ్ము అనారోగ్య సమయంలోకొన్ని హాస్పిటల్స్‌లో నిర్లక్ష్యం వల్ల డబ్బు,ప్రాణాలు రెండూ పోతున్నాయి.ఇటీవల అంతులేని ఆశ్చర్యపోయే నిర్లక్ష్యం ఓ వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చిన సంఘటన తెలంగాణాలో చూశాం. హైదరాబాద్ ఏరియా హాస్పిటల్‌లో ఓ.పి. చీటి రాయడానికి ఒక వ్యక్తిని రూల్స్ కారణంగా నిరాకరించి నిర్లక్ష్యం చేయడమేకాక అదే వ్యక్తి స్పృహకోల్పోయిన సందర్భంలో సిబ్బంది చనిపోయినట్లుగా నిర్ధారించి మార్చురీకి పంపడం వారం తర్వాత అదృష్టం కొద్ది అతను బయట పడడం జరిగితే ఆ విలువైన ప్రాణం ఖరీదు చిన్న పొరపాటుగా చెప్తున్నారు. మన రాష్ట్రంలో ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సకాలంలో ట్రీట్‌మెంట్ జరగక ఒక గర్భవతి ప్రాణాలు కోల్పోయింది. ఒరిస్సాలోని ఒక మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో తప్పుగా ఇంజక్షన్ ఇచ్చినా కారణంగా ఏడు మంది మృతిచెందారు. మధ్యప్రదేశ్‌లో కరెంటు స్థంభాన్ని ముట్టు కున్న చిన్నారి కరెంట్ షాకుకు గురై మృతిచెందింది. ఈ ప్రమాదాలన్నీ బయటపడ్డవి. దేశవ్యాప్తంగా ఇంకా బయటికి రాని ఇలాంటివి లక్షలు,కోట్లు. ఒక నిర్లక్ష్యం ఎందరి ప్రాణాలు తీసుకున్నా తామరాకు మీద నీటిబొట్టులా తమకు అంటకుండా చూసుకుంటారు అందుకు బాధ్యులు.దీనికిప్రైవేటు,ప్రభుత్వ, ఏ రంగము మినహాయింపు కాదు. ఇక రోడ్డు ప్రయాణాల్లో అన్ని రకాల వాహన చోదకుల నిర్లక్ష్యం వారి ప్రాణాలతో పాటు మరెందరినో బలితీసుకుంటోంది. ప్రభుత్వాల విధి విధానాలను అమలుపరిచే విద్యుత్తు, నీరు, విద్య,వైద్య రంగాల్లో నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలితీసుకుంటోంది. ఇక న్యాయ వ్యవస్థల్లో నిర్లిప్తతతో ఎంతోమంది నిందలు మోస్తూ తీర్పులకోసం దీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత వెంటనే జరిమానాలు, ప్రాణాలు నేలకొరిగిన తర్వాత పారితోషికాలు. లక్షలాది కుటుంబాల ఆరోగ్యాన్ని హరిస్తున్న మద్యపానాన్ని ప్రోత్సహిస్తాం, దాంతో సంభవించే మరణాలన్నిటికీ కాంపన్సేషన్స్ ఇస్తాం అని అంటారు. ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉన్నా మన ప్రాణాలకు గ్యారెంటీ లేదు. వేల కోట్ల అప్పు లతో ఇస్తున్న ఉచిత పథకాల్లో నిర్వహణాలోపంపై నిర్లక్ష్యపు నీడ ప్రజలకు పీడగామారింది.పార్టీలు, ప్రతిపక్షాలు, ప్రభుత్వాలు ఒకరి నిర్లక్ష్యాన్ని మరొకరు ఎండగడుతూ నిం దిస్తూనే ఉన్నారు. ప్రతి పనిలో నిర్లక్ష్యం మనిషిని మానవ త్వం లేని శిలగా మారిస్తే, ఇది మానవ జాతి మనుగడకు, దేశాభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయి. •

# ప్రజావాక్కు



### భయం కల్గిస్తున్న బస్ ప్రమాదాలు

**తెలుగు** రాష్ట్రాలలో బస్‌ప్రమాదాలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.వారంక్రితం కర్నూల్ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్ అగ్ని ప్రమాదానికి గురై 25 మంది మరణించి వారం గడవక ముందే రంగారెడ్డి జిల్లాచేవెళ్ల సమీపంలో జరిగిన ఆర్టీసీబస్సు ప్రమాదంలో 19మంది మరణించడం బాధాకరం.పోలీసులు ప్రాథమిక దర్యాప్తులోటిప్పర్‌లో అధికంగా కంకర (గ్రావెల్) లోడింగ్ కారణంగానే ప్రమాదం సంభవించినట్లుగుర్తించారు. టిప్పర్‌వాహనంలోనియమిత సామర్థ్యాన్నిమించి మట్టిగుండు, కంకర లాంటి బరువైన పదార్థాలు లోడ్ చేయడంతో వాహనం సంతులనం కోల్పోయిందని అధికారులు పేర్కొన్నారు. వాహనం అధిక వేగంతో మలుపు తిరిగే సమయంలో బరువు అసమానంగా పడి నియంత్రణ తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టినట్లు స్పష్టమవుతోంది.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### కలికాలం

**అధికార** పదవుల కోసం పాకులాడ్డం మోసం చేసి ఎన్నికల్లో గెలవటం అనేది ఇప్పుడు చాలా సునాయాసంగా జరిగే పని.పురాణ, ఇతిహాసాల కాలంలోనూ ఇలానే మోసంచేసిరాజ్యాలను తమస్వాధీనంచేసుకునేవారు. అయితే ఆ కాలంలో రాజ్యాలను పోగొట్టుకుని అష్టకష్టాలు పడినా చివరికి వారికి న్యాయం జరిగేది. వారి రాజ్యం వారికి దక్కేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సిబిఐ, ఇడి, ఎసిబి వంటి దర్యాప్తు సంస్థలతోపాటు ఈ మధ్య ఎన్నికల సంఘం కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తు వారికి అనుకూలంగా పనిచేస్తోంది. వారిని గెలిపించటం కోసం ఓట్లను తారుమారు చేస్తోంది.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### నాణ్యమైన విద్య అందించాలి

**రాష్ట్ర** ప్రభుత్వం సకాలంలో ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకార వేతన నిధులను విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్‌కళాశాలల యాజమాన్యం ఆర్థికఇబ్బందులతో కళాశాలలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులకునాణ్యతతో కూడిన విద్యఅందడం లేదు.విద్యార్థులు తమభవిష్యత్తుగురించి ఆందోళనచెందుతున్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడ కుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయి నిధులను విడుదల చేయాలి.

- బూర్గుపల్లి కృష్ణ యాదవ్, హైదరాబాద్

### పెరుగుతున్న అంతర్జాల నేరాలు

**సాంకేతిక** విప్లవం వేగంగా విస్తరిస్తోన్నంతలో, అంతర్జాల నేరాల కేసులు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. స్నేహాలు, పరిచయాల కోసం రూపొందిన డేటింగ్ యాప్‌లు ఇప్పుడు నేరగాళ్లకు సులభమైన వేట వేదికలుగా మారాయి. యువత, ఒంటరి వ్యక్తులు స్నేహం కోసం అడుగుతారు. నేరగాళ్లు ఆ భావోద్వేగ అడుగునే దోపిడీగా మలుస్తున్నారు. హైదరాబాద్‌లో మలక్‌పేట యువకుడిపై ఈ మోసం గమనార్హం. టన్యా శర్మ" అనే పేరుతోపరిచయమైన మహిళ రూ. 1,950తో ప్రారంభించి, మొత్తం దాదాపు రూ. 6,49,840 వసూలు చేసింది. ఇదే ధోరణి దేశవ్యాప్తంగా వందలకేసుల రూపంలో ఉంది. మోసాల మూలం మానసిక బలహీనత,నేరగాళ్ల ఒంటరితనం, భావోద్వేగ ఆధారపడుదల,శారీరక ఆకర్షణలను గుర్తించి, నమ్మకాన్ని సంపాదించి, ఆర్థికంగాదోచుతారు.కొందరు దృశ్య సంభాషణలను రికార్డు చేసి భయపెట్టడం ద్వారా డబ్బు వసూలు చేస్తారు. బాధితులు భయంతో మౌనం పాటిస్తారు. ఫిర్యాదు చేయలేరు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### యువతకు ప్రేరణ

**మహిళల** క్రికెట్ ప్రపంచకప్ విజయం భారతీయ క్రీడా చరిత్రలో గర్వించదగిన ఘట్టంగా నిలిచింది. ఎన్నో సంవత్సరాల కష్టసాధన, పట్టుదల, క్రమశిక్షణ ఫలితంగా భారత మహిళా జట్టు ఈ ఘన విజయాన్ని సాధించింది. గతంలో పురుషుల జట్టుమాత్రమే ప్రపంచకప్ గెలిచి గర్వించగా, ఇప్పుడు మహిళా జట్టు కూడా ఆగౌరవాన్ని తెచ్చి భారత జెండాను అంతర్జాతీయ స్థాయిలో ఎగరవేసింది. ఈ విజయంలో ముఖ్యపాత్ర వహించిన కెప్టెన్ సాహసస్ఫూర్తి, ఆటగాళ్ల మధ్య ఐక్యత, సమయోచిత నిర్ణయాలు అన్నీ కలిసి భారత జట్టును విజయం వైపు నడిపించాయి. ప్రతిఆటగాళ్ల ప్రదర్శన భారత మహిళా క్రీడాకారిణుల ప్రతిభను ప్రపంచానికి చాటింది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### రైతు సమస్యలను పట్టించుకోండి

**వ్యవసాయ**రంగం భారత ఆర్థికవ్యవస్థకు ఆధారస్తంభంగా నిలుస్తోంది.ప్రధానంగా,2013 భూసేకరణ చట్టంప్రకారం, భూమిని కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలోఅందడం లేదు.అలాగే, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని పునఃసమీక్షించి, రైతుఉత్పత్తులకు అనుకూలమైనవిధంగామార్చాలి.రైతుకువాస్తవలాభంచేకూరేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బిసి, ఎంబిసిలకు ఏదీ సమన్యాయం?

మన్నారం నాగరాజు

భారతదేశంలో చిన్న రాష్ట్రాల కోసం జరిగిన పోరాటాలు ఎప్పటికప్పుడు ఒక ప్రధాన రాజ కీయ అందెలాగా నిలిచాయి. భౌగో ళిక విస్తీర్ణం తగ్గి పరిపాలన సులభ తరం అవుతుందని, ప్రాంతీయ సమ స్యలు త్వరగా పరిష్కారం అవుతా యని, ప్రజలకు సమాన న్యాయం లభిస్తుందని ఆశతో ప్రజలు చిన్న రాష్ట్రాల కోసం కష్టపడ్డారు. తెలంగాణ, జార్ఖండ్,చత్తీస్‌గఢ్, ఉత్తరా ఖండ్ వంటి రాష్ట్రాల ఆవిర్భావం ఈ స్వప్నాన్ని నిజం చేసింది. అయితే ప్రశ్న ఏమిటంటే ఈ చిన్న రాష్ట్రాల్లో నిజంగా అన్ని వర్గాలకూ, ముఖ్యంగా బీసీలకు, రాజకీయ సమన్యాయం కలుగుతోందా? చిన్నరాష్ట్రాల కోసం పోరాటంలో ప్రధానంగా 'సమాన వనరుల పంపిణీ, సమాన రాజకీయ అవకాశాలు' అని తెలంగాణ ఉద్యమంలో కూడా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ముఖ్య భూమిక పోషించారు. పల్లె స్థాయి నుండి నగర స్థాయి వరకు వేలాది బీసీ నాయకులు, కార్య కర్తలు ఉద్యమంలో తలమునకలయ్యారు. ఆత్మగౌరవం స్థానిక పాలన, సొంత వనరులపై హక్కులనే నినాదాలు బీసీ సమాజంలో విశేష స్పందన కలిగించాయి. ముఖ్యమంత్రి మంత్రివర్గం, ముఖ్యమైన అధికార పదవుల్లో బిసిల శాతం అతి తక్కువగా ఉండటం గమనార్హం. చిన్నరాష్ట్రం ఏర్పడితే అధికారం సులభంగా అందుతుందని భావించిన బీసీల ఆశలు, వాస్తవ రాజకీయ కుతంత్రాల కిందనలిగిపోయాయి. రాజకీయ సమన్యాయం అనేది కేవలం పదవులు పంచుకోవడమే నిర్ణయాధికారం,విధానాల రూపకల్పనలో సమానపాత్ర కలిగి ఉండటమే. బీసీలు జనాభాలో 50శాతం పైగా ఉన్నా అసెంబ్లీ సీట్లలో, మంత్రివర్గంలో, లోక్‌సభ స్థానాల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉండటం అసమానతను చూపిస్తుంది. ఒక చిన్నరాష్ట్రంలో భౌగోళిక సౌలభ్యం ఉన్నా, రాజకీయ నిర్ణయాలు సాంప్రదాయిక కులాధారిత శక్తుల చేతుల్లోనే ఉండటం, సమన్యాయం కేవలం నినాదంగా మిగిలిపోవడానికి కారణమవుతోంది. తెలంగాణ ఏర్పాటుకు ముందు బీసీ వర్గాలు ఉద్యమానికి వెన్నెముకలా నిలిచాయి. కానీ అవిర్భావం తరువాత మంత్రివర్గంలో, ముఖ్యపదవుల్లో వారికున్న ప్రాధాన్యం చాలా తక్కువ. ముఖ్య మంత్రిత్వ శాఖలు (హోంశాఖ, ఆర్థిక శాఖ, మున్సిపల్, రెవెన్యూ) బీసీలకు దూరంగానే ఉన్నాయి. గ్రామ, మండల స్థాయిలలో కొంతమేర బీసీ నాయకులున్నా విధాన రూపకల్పనలో ప్రభావం చూపే స్థాయిలో అవకాశం తక్కువ. ఇక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిన్న రాష్ట్రాల ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యాన్ని, చాలా స్పష్టంగా చెప్పారు "అధికార వికేంద్రీకరణ ద్వారా బహుజనులకు,ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు, నిజమైన రాజ్యాధికారం తేవాలి అని.ఈ ఆలోచన ప్రకారం, చిన్నరాష్ట్రాల ద్వారా అధికారం కొద్దిమంది చేతుల్లో కాకుండా, గ్రామాల నుంచి పట్టణాల వరకు సమానంగా పంచబడాలి. తెలంగాణరాష్ట్రం ఏర్పాటుకు జరిగిన ఉద్యమంలో ఈ భావజాలంకొంతవరకు ప్రతిఫలించింది. ఎందుకంటే, ఆ ఉద్యమంలో బడుగు బలహీన వర్గాలే కాకుండా, బీసీలు, ఎంబీసీలు, నిమ్నకులాలు




పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీని రక్తం,చెమట, త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది.కానీ రాష్ట్రంఏర్పడి 11సంవత్సరాలు గడిచినా, అంబేద్కర్ కలలలోని 'నిజమైన ప్రజాధికారం' ఈ వర్గాలకు ఎంతవరకు చేరిందో ఆలోచిస్తే నిరాశ కలుగుతుంది. స్థానికసంస్థల నుంచే ప్రజాస్వామ్యానికి ప్రవేశం. నిమ్న కులాలకు చెందిన వ్యక్తులు రాజకీయ ప్రస్థానంలో ముందుకు రావాలంటే మొదటగా స్థానిక సంస్థలలో సర్పంచ్, కార్పొరేటర్, వార్డు కౌన్సిలర్ వంటి పదవులలో అవకాశాలు రావాలి. ఎందుకంటే, ఇవే రాష్ట్రఅసెంబ్లీలు, పార్లమెంటులకు పునాది రాళ్లు. కానీ వాస్తవం ఏమిటంటే, రాష్ట్రంలోని కొన్నిగ్రామాల్లో ఇప్పటికీ కొంత మంది కులాలవారికి ఒక్కసారి కూడా సర్పంచ్ పదవి దక్క లేదు ఒక కులానికి గ్రామంలో ఓటు శాతం ఉన్నా, ఆ స్థానాన్ని ఎప్పటికీ ఇతర శక్తివంతమైన కులాలే ఆక్రమిస్తారు. కారణం రిజర్వేషన్ విధానంలో వర్గీకరణ లేకపోవడం. 2014లో తెలంగాణలో జరిగిన సర్పంచ్ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించబడింది.ఇది కాగితం మీద మంచి శాతం అనిపిం చినా, వర్గీకరణ లేకపోవడం వల్ల రిజర్వేషన్ ఎక్కువగా ప్రభావవంతమైన బీసీ కులాలకే దక్కింది. మిగిలిన నిమ్మ, బలహీన బీసీ కులాలకు మాత్రం ప్రాతినిధ్యం దొరకలేదు. ఇక 2019లో రాష్ట్రంలో మొత్తంగా 12,751 గ్రామ పంచా యతీలున్నాయి.పంచాయతీల్లో 50 శాతానికి లోబడే రిజ ర్వేషన్లు ఉండాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో బీసీ లకు 22,8శాతం,వారిలో 3146ఎస్టీలు,2113 ఎస్సీలు, 3346లు, ఓపెన్ క్యాటగిరీలో 1417మందిసర్పంచ్‌లు బాధ్యతల్లోకి వచ్చినట్టు పంచాయతీరాజ్ గతంలో ఉన్నతాధికారులు వెల్లడించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించిన పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లు 34శాతం నుంచి 21శాతం తగ్గించి బీసీల నాయకత్వాన్ని ఎదగకుండా దెబ్బతీశారు.సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి బిసి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 21 శాతానికి తగ్గించింది. అదీగాక ఇంకేవేవో తప్పుడు లెక్కలు చూపి కేవలం 18శాతం రిజర్వేషన్లు అమలుచేశారు.మొత్తం గ్రామ పంచాయతీలు సుమారు 12,751 కాగా 56శాతం జనాభా ఉన్న బీసీలకు 8822గ్రామ పంచాయతీలు దక్కాలి. గతంలో 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే 4300 పంచాయతీలో బీసీలకు దక్కాలి. కానీ 2332 మాత్రమే కేటాయించారు. అంటే సుమారు22శాతం మాత్రమే దక్కాయి.దీంతో రెండు వేల గ్రామ సర్పంచులు 3వేల వార్డు మెంబర్లు బీసీలకు దక్కాల్సినవి దక్కకుండా పోయాయి. అట్లనే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, జిల్లా పరిషత్ చైర్మన్, మండల్ పరిషత్ చైర్మన్ పదవుల్లో కూడా బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించి బీసీల నాయకత్వాన్ని ఉద్దేశపూర్వకంగా అణచివేశారు. ప్రభుత్వం కూడా "వర్గీకరణ లేని రిజర్వేషన్" విధానం మార్పు చేసి, ప్రతి బీసీ ఉపవర్గానికి తగిన ప్రాతినిధ్యం, స్థానిక సంస్థల నుంచే అవకాశాలు రాజకీయశిక్షణ, ఆర్థిక సహాయం ఇవన్నీ కలిపి ఒక సమగ్రప్రణాళిక రూపొందించాలి. చిన్న రాష్ట్రాలు ఏర్పడితే బహుజనులకుఅధికారం వస్తుందని అంబేద్కర్ చెప్పినది సత్యమే. కానీ అధికారం సత్యంగా జనుల వద్దకు రావాలంటే, బహుజనులలోని అత్యంత వెనుకబడిన వర్గాలకు ముందుగా హక్కులు, అవకాశాలు ఇవ్వాలి. లేకపోతే, రాష్ట్రం చిన్నదైనా, అధికారం మాత్రం కొద్దిమందికే పరిమితం అవుతుంది.తెలంగాణ సాధనలో కష్టపడిన బీసీ, ఎంబీసీ, నిమ్న కులాలు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం పొందే రోజురాకపోతే, మనం అంబేద్కర్ కలలోని సమానత్వ రాజ్యానికి చాలా దూరంలోనే ఉన్నట్టే. మంత్రివర్గంలో ముఖ్య పదవుల్లో బీసీలకు నిర్దిష్ట శాతం రెజర్వేషన్ కల్పించాలి.బీసీవర్గాల నుండియువనాయకులకు శిక్షణ ఇచ్చి, రాజకీయాల్లో ప్రోత్సహించాలి. •



# 'సర్'పై మమత భారీ నిరసన

## ఆందోళనకారులను ముందుండి నడిపించిన ముఖ్యమంత్రి

**కోల్‌కతా, నవంబర్ 4:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆ ఆందోళనకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వం వహించారు. మంగళవారం కోల్‌కతా వీధుల్లో నిర్వహించిన భారీ ర్యాలీని ముందుండి నడిపించారు. ఈ సమగ్ర సవరణ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం కుమ్మక్కై నిర్వహిస్తోన్న నిశ్శబ్ద రిగ్గింగ్ అని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. బెనర్జీతో పాటు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. మొత్తం 3.8 కిలోమీటర్ల మేర ఈ మార్చ్ కొనసాగింది. దాంతో ఆ దారులన్నీ తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలతో నిండిపోయాయి. అయితే ఈ నిరసనలపై బిజెపి తీవ్రంగా మండిపడింది. తీవ్రంగా మండిపడింది. భారత రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా టిఎంసి వ్యవహరి స్తోందని విమర్శించారు. మమతా బెనర్జీ దీనిలో లోపాలను ఎత్తి చూపాలనుకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించాలి అని వ్యాఖ్యలు చేశారు. రెండో దశలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సరవణను చేపట్టనున్నట్లు ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించిన విషయం తెలిసిందే. అండమాన్ నికోబర్, చత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుద్దుచ్చేరి, రాజస్థాన్,

తమిళనాడు, యుపి, పశ్చిమబెంగాల్‌లో జరగనున్న రెండో దశలో 51 కోట్ల మంది ఓటర్లు భాగం కానున్నారు అని తెలిసింది. ఇసి ప్రకటించినట్లుగా ఈ రోజు నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే బీహార్ ఎస్ఐఆర్ పూర్తయిన సంగతి తెలిసిందే. ఎన్డీయే పార్టీలు మినహా ఇసి చేపట్టిన ఎస్ఐఆర్‌ను విపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పేరిట బిజెపితో కలిసి ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. గత కొన్నేళ్లుగా దేశంలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లో ఇదే విధంగా ఓట్ల చోరీ జరిగిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే.

# ఇజ్రాయెల్‌కు మద్దతిస్తే.. మా సహకారం ఉండదు

## అమెరికాకు తేల్చి చెప్పిన ఇరాన్



**టెహ్రాన్, నవంబరు 4:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేని అమెరికాను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ పాలనకు మద్దతు ఇవ్వడం ఆపేవరకు యుఎస్‌కు సహకరించేది లేదని తేల్చి చెప్పారు. టెహ్రాన్‌లో విద్యార్థులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇరాన్ సహకరించాలని అమెరికన్లు కోరుకుంటున్నారని ఖమేనీ అన్నారు. అయితే ఇజ్రాయెల్ పాలనకు మద్దతు ఇవ్వడం పూర్తిగా ఆపేసేంత వరకు యుఎస్‌కు ఇరాన్ సహకరించదన్నారు. సైనిక స్థావరాలను తొలగించడంతోపాటు మధ్యప్రాచ్యంలో అగ్రరాజ్యం జోక్యం చేసుకోవడం ఆపేస్తే దానితో కలుస్తామన్నారు. ఈ సందర్భంగా వాషింగ్టన్ అహంకారంతో వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికాతో అణుచర్చలు తిరిగి ప్రారంభించడానికి తొందరపడటం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఇటీవల పేర్కొన్నారు. ఇదే క్రమంలో పరోక్ష చర్చలకు సిద్ధంగా ఉన్నామన్నారు.

**ఆ ప్రాంతంలోని హమాస్ ఉగ్రవాదులను వదిలిపెట్టం : నెతన్యాహు**

తమ నియంత్రణలో ఉన్న రఫా ప్రాంతంలోని 200 మంది హమాస్ ఉగ్రవాదులను వదిలిపెట్టమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. వారికి ఎలాంటి సురక్షిత మార్గం ఉండబోదని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా హమాస్‌ను నిరాయుధీకరణ చేసేందుకు నెతన్యాహు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించింది. ఆయుధాలను వదిలేయడానికి అంగీకరిస్తే హమాస్‌కు సురక్షిత మార్గాన్ని అందించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించే అవకాశాలు ఉన్నాయంటూ స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతోపాటు మిగిలిన బందీల మృతదేహాలను అప్పగిస్తే.. రెడ్‌క్రాస్ వాహనాల్లో ప్రత్యేక కారిడార్ నుంచి హమాస్ ఫైటర్లను తరలించే సాధ్యాసాధ్యాలను మధ్యవర్తులు చర్చించినట్లు అల్‌జజీరా వార్తాసంస్థ పేర్కొంది. అయితే, ఈ కథనాలను ఇజ్రాయెల్ ప్రభుత్వాధికారులు తీవ్రంగా ఖండించారు. ఇవి పూర్తిగా అసంబద్ధమైనవని ఆ దేశ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఈ విషయంపై జాతీయ భద్రతా మంత్రి ఇటీమర్ బెన్‌గ్విర్ నెతన్యాహుతో సంప్రదింపులు జరిపారు. 200 మంది హమాస్ ఉగ్రవాదులను చంపాలని లేదా జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు.

## హర్యానాలో క్రికెట్ కోచ్‌పై విచక్షణా రహితంగా కాల్పులు



# దుండగుల దాడిలో మృతిచెందిన క్రికెటర్, కోచ్

**గనౌర్,(హర్యానా), నవంబరు 4:** హర్యానాలోని గనౌర్ పట్టణంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానిక క్రికెటర్, కోచ్ అయిన రామ్‌కరణ్‌ను కొందరు దుండగులు కాల్చి చంపారు. సబ్‌డివిజనల్ ఆసుపత్రి సమీపంలో జరిగిన ఈ హత్యతో పట్టణంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కొనసాగుతున్న రాజకీయ కక్షలే ఈ హత్యకు దారితీశాయని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ముందురోజు సాయంత్రం ఆసుపత్రి వెలుపల రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఒక వాహనంలో వచ్చిన దుండగులు రామ్‌కరణ్‌పై విచక్షణారహితంగా కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన ఆయనను వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనను పలువురు ప్రత్యక్షంగా చూసినట్లు సమాచారం. ఈ హత్య వెనుక బలమైన రాజకీయ వైరం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కోడలు ప్రస్తుతం వార్డ్ నెం 12 కౌన్సిలర్‌గా పనిచేస్తున్నారు. నిందితులలో ఒకరిగా భావిస్తున్న సునీల్ లంబూ గతంలో గనౌర్ మున్సిపల్ కౌన్సిల్‌కు యాక్టింగ్ చైర్మన్‌గా వ్యవహరించారు. గత మున్సిపల్ ఎన్నికల నుంచి ఈ రెండు కుటుంబాల మధ్య విభేదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ కాల్పుల ఘటనతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు. సోనేపట్ సీనియర్ పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, ఫోరెన్సిక్ బృందాలతో ఆధారాలు సేకరించారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తు న్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గనౌర్ పోలీసులు నిందితులపై హత్య కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకు నేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా పట్టణంలో అదనపు భద్రతను ఏర్పాటు చేశారు.

# బీహార్‌లో ప్రచారానికి తెర

## - రేపటి పోలింగ్ కోసం ఓటర్లకు తాయిలాలు పంపిణీ - బరిలో తేజస్వి, డిప్యూటీ సిఎం, పలువురు మంత్రులు - ఇసి పకడ్బందీ ఏర్పాట్లు.. భద్రత కట్టుదిట్టం

**పాట్నా, నవంబరు 4:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తొలి దశ ప్రచారం ముగిసింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, వివిధ రాష్ట్రాల బిజెపి ముఖ్య మంత్రులు ఎన్‌డిఎ అభ్యర్థుల తరుపున ప్రచారం చేయగా, మహాకూటమి తరఫున కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్, సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. చివరి రోజున ఆయా పార్టీల నేతలు, స్టార్ క్యాంపెయినర్లు ర్యాలీలు, రోడ్ షోలతో హోరెత్తించారు. ఎన్నికల ప్రచారం ముగియగా, ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థుల తాయిలాలు పంపిణీకి శ్రీకారం చుట్టారు. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకు నగదు పంపిణీ చేస్తూ ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు పట్టుబడ్డారు. భారీగా నగదు, మద్యం, వివిధ వస్తు సామాగ్రిని ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక తొలి దశ ఎన్నికలకు సంబంధించి ఈనెల 6వ తేదీ గురువారం 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగనుంది. 1,314 మంది అభ్యర్థుల భవితవ్యం ఏమిటో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని తీర్పు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే ఆయా పోలింగ్‌కు అవసరమైన సామాగ్రి ఎన్నికల సిబ్బందికి అందజేసింది. బుధవారం సాయంత్రానికల్లా ఆయా పోలింగ్ కేంద్రాలకు యంత్ర సామాగ్రితో చేరుకోనున్నారు. ఎన్‌డిఎ, ఇండియా కూటమి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అధికారం తిరిగి దక్కించుకోవాలని సిఎం నితీశ్ నేతృత్వంలోని ఎన్‌డిఎ, ఈసారి ఎలాగైనా విజయదుందుభి మోగించాలని ఆర్‌జెడి సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ శ్రమటోడ్చారు. ఇటు ఎన్‌డిఎ, అటు ఇండియా కూటమికి తొలి దశ ఎంతో కీలకం. ఇక తొలి దశలోనే మహామహులు బరిలో ఉన్నారు. వీరిలో మహా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్, డిప్యూటీ సిఎంలు సామ్రాజ్ చౌదరి, విజయ్ సిన్హా, మంత్రులు నితిన్ రాబిన్, మంగల్ పాండే, ప్రముఖ గాయని మైథిలీ ఠాకూర్, మాజీ కేంద్ర మంత్రి రాం క్రిపాల్ యాదవ్ భవితవ్యం పరీక్షించుకుంటున్నారు.



**మోడీపై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు**

**రాహుల్ పెళ్లి ఎప్పుడంటూ కేంద్రమంత్రి చురక**

పంచాయతీ నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు ఏదైనా ఎన్నిక జరిగినా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజీగా ప్రచారం చేస్తూనే ఉంటారని, ఇప్పుడు బీహార్‌లో కుమారుడి పెళ్లికి తిరుగుతున్నట్లుగా పర్యటిస్తున్నారంటూ ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఎన్నిసార్లు కేవలం మోడీ ముఖం చూసి ఓట్లు వేస్తారని ఆయన ప్రశ్నించారు. ఖర్గే వ్యాఖ్యలపై బిజెపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ఖర్గే గారూ, మీ యువరాజు రాహుల్ గాంధీ వివాహం ఎప్పుడైనా జరిగితే మాకు ఆహ్వానం పంపండి. ఆ వివాహానికి మేము తప్పకుండా హాజరవుతాం" అంటూ కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వ్యంగ్యంగా అన్నారు.

## ఫరీదాబాద్‌లో పట్టపగలే బాలికపై కాల్పులు!

**ఫరీదాబాద్, నవంబరు 4:** హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్ నగరంలో ఒక దుండగుడు నడిరోడ్డుపై 17 ఏళ్ల బాలికపై కాల్పులు జరిపాడు. కాల్పులకు తెగబడిన యువకుడు గత కొన్ని రోజులుగా ఆమెను వెంబడిస్తున్నాడు. ఈ ఘటన నగరంలోని ఒక ప్రైవేటు లైబ్రరీ వెలుపల చోటు చేసుకుంది. వీరిద్దరు నిత్యం ఆ లైబ్రరీకి వస్తున్నట్లు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలను బట్టి తెలుస్తోంది. కాల్పులకు పాల్పడిన వ్యక్తి ఆ బాలిక దినచర్యను తెలుసుకుని నిత్యం ఆమె రాక కోసం వేచి చూస్తున్నాడని విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. బాలిక సంఘటన స్థలానికి రావడానికి కొద్దిసేపటి ముందు నిందితుడు ఆ ప్రాంతానికి వచ్చి వేచి చూస్తున్నట్లు సీసీటీవీ ఫుటేజీలో గుర్తించారు.




## నేపాల్ జన్‌జెడ్ ఆందోళనలు చూసారు కదా! ఇప్పటికిప్పుడు మీ పిటిషన్ విచారణచేయలేం..

### అశ్లీలకంటెంట్ నిషేధంపై పిటిషన్ విచారణలో చీఫ్‌జస్టిస్ గవాయ్ హితవు

**న్యూఢిల్లీ, నవంబరు 4:** ఇంటర్నెట్ లో మితిమీరిపోతున్న అశ్లీల కంటెంట్ పై నిషేధం విధించాలంటూ దేశ అత్యున్నత న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలైంది. విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న ఈ అశ్లీల వీడియోలు, క్లిప్పులు ఎదిగే పిల్లల మనసులను కలుషితం చేస్తాయని, తీవ్ర దుష్పరిణామాలకు కారణమవుతాయని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్ ను పరిశీలించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని డివిజనల్ బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్ లో ఇటీవల జరిగిన జెన్ జెడ్ ఆందోళనలను ప్రస్తావించింది. ఇంటర్నెట్ లోని పలు సైట్లపై నిషేధం విధించడం వల్ల నేపాల్‌లో చోటుచేసుకున్న పరిణామాలు చూశారు కదా అంటూ పిటిషనర్ ను ప్రశ్నించింది. ఇప్పటికిప్పుడు ఈ పిటిషన్ ను విచారించలేమని చెబుతూ 4 వారాలకు వాయిదా వేసింది. ఈ నెల 23న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ పిటిషన్ పై విచారణకు ఆయన సుముఖంగా లేరని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. డిజిటలైజేషన్ తర్వాత దేశంలో ఇంటర్నెట్ వాడకం విపరీతంగా పెరిగిందని, చిన్నాపెద్దా తేడా లేకుండా, అక్షరాస్యతతో సంబంధం లేకుండా అందరూ నెట్ వాడుతున్నారని పిటిషనర్ చెప్పారు. కోవిడ్ తర్వాత చిన్నారుల్లో కూడా మొబైల్, ట్యాబ్, ల్యాప్ టాప్ వాడకం పెరిగిందని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఇంటర్నెట్ లో అశ్లీల కంటెంట్ ను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. పోర్న్ కట్టడికి సంబంధించి జాతీయ స్థాయిలో ఓ పాలసీ తీసుకురావాలంటూ కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషనర్ కోర్టును అభ్యర్థించారు. ఇంటర్నెట్లో పోర్న్‌ను ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రోత్సహించే సైట్లు కోట్ల సంఖ్యలో అందుబాటులో ఉన్నాయని పిటిషనర్ చెప్పారు. ఈ వెబ్ సైట్లకు కేంద్రం ఎందుకు అనుమతిస్తోందని ప్రశ్నించారు. ఒక్క మన దేశంలోనే 20 కోట్ల అశ్లీల వీడియోలు, వీడియో క్లిప్పులు ఆన్ లైన్ లో అమ్మకానికి ఉన్నాయని చెప్పారు. డిజిటలైజేషన్ తర్వాత ఆన్ లైన్ లో అశ్లీల కంటెంట్ కేవలం ఒక్క క్లిక్ తో అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆన్ లైన్ లో విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న ఈ అశ్లీల కంటెంట్ వల్ల ఎదిగే పిల్లల మనసులు కలుషితమవుతాయని, ఇది దుష్పరిణామాలకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# భారతీయ విద్యార్థులకు కెనడా వీసా షాక్!

## భారీ సంఖ్యలో వీసా దరఖాస్తుల తిరస్కరణ

**టొరంటో, నవంబరు4:** ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లాలనుకుంటున్న భారతీయ విద్యార్థులకు ఆ దేశ ప్రభుత్వం గట్టి షాక్ ఇస్తోంది. ఒకప్పుడు భారతీయ విద్యార్థులకు ప్రధాన గమ్యస్థానంగా ఉన్న కెనడా, ఇప్పుడు వారి దరఖాస్తులను పెద్ద ఎత్తున తిరస్కరిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నెలలో భారతీయ విద్యార్థులు చేసుకున్న స్టడీ పర్మిట్ దరఖాస్తులలో ఏకంగా 74 శాతం తిరస్కరణకు గురైనట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2023 ఆగస్టులో ఇది కేవలం 32 శాతంగా ఉండటం గమనార్హం. కెనడా ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది అంతర్జాతీయ విద్యార్థుల వీసాల జారీపై పరిమితులు విధించింది. దేశంలోకి వచ్చే తాత్కాలిక వలసదారుల సంఖ్యను తగ్గించడం, స్టూడెంట్ వీసాలకు సంబంధించి జరుగుతున్న మోసాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ఈ కొత్త నిబంధనల ప్రభావం భారత్ నుంచి వచ్చే దరఖాస్తుదారులపై తీవ్రంగా పడింది. ఆగస్టు 2023లో 20,900గా ఉన్న భారతీయ విద్యార్థుల దరఖాస్తుల సంఖ్య, 2025 ఆగస్టు నాటికి కేవలం 4,515కు పడిపోయింది. వీసాల తిరస్కరణ వెనుక ప్రధాన కారణంగా వీసా మోసాలని కెనడా ఇమ్మిగ్రేషన్ విభాగం పేర్కొంది. 2023లో దాదాపు 1,550 దరఖాస్తులు నకిలీ అడ్మిషన్ లెటర్లతో వచ్చినట్లు గుర్తించామని, వాటిలో చాలా వరకు భారత్ నుంచే ఉన్నాయని తెలిపింది. గత ఏడాది పటిష్ఠమైన వెరిఫికేషన్ వ్యవస్థ ద్వారా 14,000కు పైగా నకిలీ లెటర్లను గుర్తించినట్లు వెల్లడించింది. దీంతో పాటు, విద్యార్థులు తమ ఖర్చుల కోసం చూపించాల్సిన ఆర్థిక నిల్వల నిబంధనలను కూడా కఠినతరం చేసినట్లు ఇమ్మిగ్రేషన్ శాఖ ప్రతినిధి వివరించారు. ఈ విషయంపై ఒట్టావాలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. వీసాల జారీ కెనడా అంతర్గత విషయమైనప్పటికీ, ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రతిభావంతులైన విద్యార్థులు భారత్‌లో ఉన్నారని, వారి వల్ల కెనడా విద్యాసంస్థలు ఎంతో ప్రయోజనం పొందాయని గుర్తు చేసింది. భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంపై కెనడాలోని పలు ప్రముఖ యూనివర్సిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# కటకటాల వెనక్కి ఇజ్రాయెల్ సైనిక న్యాయవాది!



**టెల్ అవీవ్, నవంబరు 4:** ఇజ్రాయెల్ సైన్యంలో ఉన్నత స్థాయి న్యాయవాదిగా పనిచేసిన మేజర్ జనరల్ యిఫాత్ టోమర్ యెరుషాల్మి ఇప్పుడు కటకటాల వెనుక ఉన్నారు. వారం రోజుల వ్యవధిలో జరిగిన నాటకీయ పరిణామాలు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తున్నాయి. ఉన్నపళంగా రాజీనామా చేయడం, కొద్దిసేపు అదృశ్యం కావడం, ఆ తర్వాత టెల్ అవీవ్ బీచ్‌లో కనిపించడం, చివరికి అరెస్ట్ కావడం వంటి పరిణామాలు ఇజ్రాయెల్‌ను కుదిపేస్తున్నాయి. పాలస్తీనా ఖైదీపై ఇజ్రాయెల్ సైనికులు అత్యంత దారుణంగా లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో కీలకమైన సర్వైలెన్స్ వీడియోను తానే లీక్ చేసినట్లు యిఫాత్ గత వారం అంగీకరించారు. సైనికుల దురాగతం తీవ్రతను బయటపెట్టేందుకే తాను ఈ పనిచేశానని ఆమె తెలిపారు. అయితే ఆమె చర్యపై ఇజ్రాయెల్‌లోని తీవ్రవాద రాజకీయ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఒత్తిడికి తలొగ్గి ఆమె రాజీనామా చేసినప్పటికీ, ఆమెపై వ్యక్తిగత దూషణలు ఆగలేదు. ఈ క్రమంలో, యిఫాత్ తన కుటుంబానికి ఓ రహస్య సందేశం పంపి, కారును బీచ్ వద్ద వదిలి అదృశ్యమయ్యారు. ఆమె ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చనే ఆందోళనతో మిలిటరీ డ్రోన్లతో గాలింపు చేపట్టారు. చివరికి ఆదివారం రాత్రి ఆమె బీచ్‌లో ప్రాణాలతో కనిపించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ, అప్పటి నుంచి ఆమెపై విమర్శల దాడి మరింత పెరిగింది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మద్దతుదారు, టీవీ వ్యాఖ్యాత యినోన్ మగల్ ఇక ఆమెను వేధించడం కొనసాగించవచ్చని ఎక్స్‌లో పోస్ట్ చేయడం వివాదాస్పదమైంది. యిఫాత్ ఫోన్‌లలో ఒకటి కనిపించకుండా పోవడంతో, సాక్ష్యాలను నాశనం చేయడానికే ఆమె ఆత్మహత్య నాటకమాడారని కొందరు ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం ఇజ్రాయెల్‌లో రెండేళ్లుగా యుద్ధం జరుగుతున్నప్పటికీ అంతర్గత విభేదాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో చూపిస్తోంది. కోర్టు విచారణలో భాగంగా, మోసం, నమ్మకద్రోహం, న్యాయ విచారణకు ఆటంకం కలిగించడం వంటి అభియోగాలపై యిఫాత్ కస్టడీని బుధవారం వరకు పొడిగిస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. ప్రస్తుతం ఆమెను సెంట్రల్ ఇజ్రాయెల్‌లోని మహిళల జైలులో ఉంచారు. ఇదే కేసుకు సంబంధించి మాజీ చీఫ్ మిలిటరీ ప్రాసిక్యూటర్ కల్నల్ మటన్ సోలోమేష్‌ను కూడా అరెస్ట్ చేసినట్లు ఇజ్రాయెల్ మీడియా తెలిపింది. 2024 జూలై 5న స్దే టెయిమాన్ సైనిక జైలులో పాలస్తీనా ఖైదీపై కొందరు సైనికులు విచక్షణారహితంగా దాడి చేసి, లైంగిక దాడికి పాల్పడ్డారని అభియోగాలున్నాయి.

# సంక్షిప్తంగా..

## బంగ్లా పాఠశాలల్లో మ్యూజిక్, పిఇటి టీచర్ల నియామకం రద్దు



ఢాకా, నవంబరు 4: **బంగ్లాదేశంలోని** పాఠశాలల్లో మ్యూజిక్, పిఇటి టీచర్ల నియామకాలను రద్దు చేస్తున్నట్లు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సంగీత, నృత్య ఉపాధ్యాయులను నియమించాలని అక్కడి విద్యా మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్ణయం తీసుకుంది. అయితే ఈ చర్యలను ఇస్లాం వ్యతిరేక అజెండాగా అభివర్ణించిన బంగ్లా ఇస్లాం ఛాందసవాదులు యూనస్ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా సృష్టించిన మ్యూజిక్, పిఇటి టీచర్ల పోస్టులను రద్దు చేస్తున్నట్లు విద్యా శాఖ అధికారి మసూద్ అక్తర్‌ఖాన్ ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టులను రద్దు చేయడానికి గల కారణాలను మీడియా ప్రశ్నించగా... ఆయన సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు. స్థానిక మీడియా వర్గాలు వెల్లడించిన కథనాల ప్రకారం.. యూనస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బంగ్లాలో ప్రభుత్వ నిర్ణయాల్లో ఇస్లాం ఛాందసవాదుల జోక్యం పెరిగిపోతోంది.

## మణిపూర్‌లో ఎన్‌కౌంటర్.. నలుగురు ఉగ్రవాదులు హతం



**ఇంఫాల్, నవంబరు 4:** భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో యునైటెడ్ కుకీ నేషనల్ ఆర్మీ (యుకెఎన్ఎ)కి చెందిన నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మణిపూర్‌లోని ఖన్పీ గ్రామంలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా బలగాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఖన్పీ గ్రామంలో 17 మంది యుకెఎన్ఎ ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న సమాచారం మేరకు ఆర్మీ బలగాలు, అసోం రైఫిల్స్‌కు చెందిన పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ డాన్ పేరుతో గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులు బలగాలపై కాల్పులు జరిపారు. దాంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మరో ఉగ్రవాదిని బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. మిగతా 11 మంది ఉగ్రవాలు పారిపోయారు.

## సూపర్‌పవర్‌గా ఎదుగుతున్న భారత్: అలెగ్జాండర్ స్టబ్

**హెల్సింకి, నవంబరు 4:** ప్రపంచ రాజకీయాల్లో భారత్ ప్రాముఖ్యత అంతకంతకూ పెరుగుతోన్న వేళ, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా, చైనాల తర్వాత ప్రపంచంలో తదుపరి సూపర్ పవర్‌గా భారత్ నిలుస్తుందని ఆయన జోస్యం చెప్పారు. అదే సమయంలో, ఇంతటి ప్రాధాన్యత కలిగిన భారత్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సి)లో శాశ్వత సభ్యత్వం లేకపోవడం సరికాదని స్పష్టం చేశారు. తాను భారత్‌కు గొప్ప అభిమానినని పేర్కొన్నారు. విదేశీ వ్యవహారాల్లో భారత్ అనుసరిస్తున్న స్వతంత్ర విధానాలను ఆయన ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికలపై, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితిలో భారత్ వంటి దేశాల పాత్ర మరింత పెరగాల్సిన అవసరం ఉందని స్టబ్ అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిని సంస్కరించాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు.

## ముందుగా మేం అణుపరీక్షలను పునరుద్ధరించం: పాక్



**ఇస్లామాబాద్, నవంబరు 4:** రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇస్లామాబాద్ స్పందించింది. ఈ విషయంపై పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి అంతర్జాతీయ మీడియాకు వివరణ ఇస్తూ.. తామెప్పుడు ఇతర దేశాల కంటే ముందుగా అణు పరీక్షలను పునరుద్ధరించబోమన్నారు. అణు పరీక్షలను నిర్వహించిన మొదటి దేశం కాదని.. అదేవిధంగా అణుపరీక్షలను తిరిగి ప్రారంభించే మొదటి దేశంగానూ తాము ఉండబోమని స్పష్టం చేశారు. ఈ విషయంపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ సైతం స్పందించారు. బాధ్యతాయుతమైన అణ్వాయుధ దేశంగా చైనా ఎల్లప్పుడూ ఆత్మరక్షణ అణువ్యూహాన్ని సమర్థిస్తుందన్నారు. అణు పరీక్షలు నిలిపి వేయాలనే విషయంలోనూ తాము అదే నిబద్ధతకు కట్టుబడి ఉంటామన్నారు.

# అమరావతి అభివృద్ధికి రూ.32,500 కోట్లు

- నిధుల సమీకరణకు సిఆర్‌డిఏ ప్రణాళికలు
- ఎడిబి, వరల్డ్ బ్యాంక్ నుంచి రూ.14,000 కోట్లు
- ఎన్‌ఏబిఎఫ్‌ఐడి నుంచి రూ.10 వేల కోట్లు
- నాబార్డు నుంచి రూ.7,000 కోట్లు రుణాలు
- ఎపిపిఎఫ్‌సి నుంచి రూ.1500 కోట్లు మంజూరు
- మరింత వేగంగా రాజధాని పనులు




విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అభివృద్ధి చేయడానికి రూ. 32,500 కోట్ల నిధులు సమీకరించేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సిఆర్‌డిఏ) ప్రణాళికలు సిద్ధం చేసింది. అందుకోసం ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, నాబార్డు సహాత పలు ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకోవాలని నిర్ణయించింది. కాగా, ఇప్పటికే సిఆర్‌డిఏ ప్రపంచ బ్యాంకు, ఎడిబిల నుంచి రూ.15,000 కోట్ల రుణం తీసుకుంది. హడ్కో నుంచి తీసుకున్న రూ.11 వేల కోట్లతో కలిపి మొత్తం రూ.26,000 కోట్ల లోన్ తీసుకుంది. ఇప్పుడు మరిన్ని నిధుల సమీకరణ కోసం ప్రయత్నిస్తోంది.



రూ.32,500 కోట్లలో.. ప్రపంచ బ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) సంయుక్తంగా రూ.14,000 కోట్ల రుణం మంజూరు చేయనున్నాయి. ఇక నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఏబిఎఫ్ఐడి) నుంచి రూ.10,000 కోట్లు నిధులు సమకూరనున్నాయి. నాబార్డు రూ.7000 కోట్లు సమకూర్చనుండగా.. ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎపిపిఎఫ్‌సి) రూ. 1500 కోట్లు మంజూరు చేయనుంది. ఎపిపిఎఫ్‌సి ఇవ్వనున్న లోన్‌పై ఇప్పటికే ఒప్పందం కూడా కుదిరింది.

అమరావతి ప్రాజెక్టుపై ప్రపంచ బ్యాంకు మొదటినుంచి సానుకులంగానే ఉంది. రాజధాని నిర్మాణం కోసం లోన్ ఇచ్చేందుకు 2019కి ముందు నుంచే సిద్ధంగా ఉంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ హయాంలో పనులు ముందుకు సాగకపోవడం వల్ల ఈ ప్రక్రియ నిలిచిపోయింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ప్రపంచ బ్యాంకుతో సంప్రదింపులు జరిపారు. ఈ నేపథ్యంలో రూ.15,000 కోట్లు లోన్ ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ఆమోదం తెలిపింది. ఈ మొత్తంలో ప్రపంచ బ్యాంకు, ఎడిబి సంయుక్తంగా సుమారు రూ.13,500 కోట్లు ఇచ్చాయి. మిగతా రూ.1,500 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. కాగా, ఈ నిధుతులతో సిఆర్‌డిఏ 50 పనులు చేపడుతుతోంది. రాజధాని నిర్మాణం కోసం ఇటీవల మరో రూ.14 వేల కోట్లు రుణం ఇచ్చేందుకు కూడా ప్రపంచ బ్యాంకు, ఎడిబి ఆసక్తి చూపించాయి. దీనికి సంబంధించిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఈ వారంలోనే కేంద్ర ఆర్థిక శాఖకు అందజేసే అవకాశం ఉంది. కేంద్రం ఓకే చెబితే.. ప్రపంచ బ్యాంకు, ఎడిబిల బోర్డుల ఆమోదం కోసం ఫైల్ వెళ్తుంది. కాగా, ఈసారి కూడా ఈ రూ.14,000 కోట్లలో కొంత మొత్తాన్ని మ్యాచింగ్ గ్రాంట్‌గా సమకూర్చాల్సి వస్తుంది. మరి గతంలో లాగానే దాన్ని కేంద్రం ఇస్తుందా లేక రాష్ట్ర ప్రభుత్వమే భరించాలా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ రుణం మంజూరు అయితే.. రాజధాని అభివృద్ధి పనుల్లో వేగం పెరుగుతుంది.



స్వర్ణముఖి నది తీరాన స్నానఘట్టాల దృశ్యం

# శ్రీకాళహస్తీరాలయంలో భక్తుల ఇబ్బందులెన్నెన్నో...

## ఈశ్వర భక్తులతోపాటు... అయ్యప్ప భక్తుల తాకిడి

## స్నానాలకు కటకట... పనిచేయని స్నానఘట్టాల షవర్లు

## నదిలో స్నానం చేద్దామంటే అనువుగా లేని చోటు

శ్రీకాళహస్తి, నవంబరు 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి కార్తీక మాసం ప్రారంభం నుంచి అయ్యప్ప భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ప్రతి రోజూ శబరిమల వెళ్ళు తెలుగు రాష్ట్రంలోని అయ్యప్ప భక్తులు, అలాగే దర్శనం చేసుకొని తిరుగు పయనంలో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వస్తారు. అయితే ఇక్కడకు వచ్చిన భక్తులు రాత్రి బస చేసి వేకువ జామున స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకోవటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తులు 'స్వర్ణముఖి తీరాన' కైలాసనాథ స్నానఘట్టాలను ఏర్పాటు చేసారు. ఇక్కడ మహిళలు, పురుషులు వేర్వేరుగా స్నానమాచరించటానికి స్నాన ఘట్టాలను ఏర్పాటు చేసారు. వాటికి షవర్లు ఏర్పాటు చేసారు. భక్తుల సౌకర్యార్థం సదుపాయాలు కల్పించుటకు దేవస్థానం లక్షలు వెచ్చిస్తుంది. కానీ పర్యవేక్షణ కొరవడుతుంది. భక్తులు పడుతున్న బాధలను దేవస్థానం అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రస్తుతం స్నాన ఘట్టాల్లో వాల్స్ పనిచేయక పోవటంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. స్నానమాచరించి దర్శనానికి వెళ్ళాలంటే కొళాయిలు పని చేయటం లేదు. పని చేస్తున్న ఒకటి ఆర కొళాయిల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. ఓ వైపు సూర్యోదయానికి ముందే స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలనుకునే భక్తులకు నిరాశ తప్పటం లేదు. స్వర్ణముఖి నదిలో దిగి స్నానమాచరిద్దామనుకుంటే 'ఇసుకాసురుల దాహానికి' నదిలో మడుగులు ఏర్పడ్డాయి. ఎక్కడ కాలుపెడితే ఏమౌతుందో అని భయభ్రాంతులు అవుతున్నారు. అధికారులు స్పందించి స్నానఘట్టాల వద్ద కొళాయిలు సరిచేసి భక్తులకు స్నానమాచరించే విధంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# 7న కళ్యాణదుర్గానికి మంత్రి లోకేష్

- మహిళలతో ప్రత్యేక సమావేశం
- 8న కనకదాసు విగ్రహం ఆవిష్కరణ
- ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



అనంతపురం, నవంబరు 4 ప్రభాత వార్త బ్యూరో: తెలుగుదేశం పార్టీ యువనేత, మంత్రి నారా లోకేష్ ఈ నెల 7, 8 తేదీల్లో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియో జకవర్గానికి వస్తున్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆహ్వానం మేరకు మంత్రి నారా లోకేష్ ఇక్కడికి వస్తున్నారు. 7న కళ్యాణదుర్గంలో ఆ నియోజకవర్గంలోని మహిళా మణులతో ఎమ్మెల్యే సురేంద్ర బాబు ఏర్పాటు చేసే ప్రత్యేక సమావేశంలో మంత్రి లోకేష్ పాల్గొననున్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న లక్ష్యంతో వారికి దిశ దశను మంత్రి లోకేష్ ద్వారా తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే సురేంద్రబాబు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 7వ తేదినే పార్టీ క్రియాశీలక కార్యకర్తలను కూడా కలుసుకుని, ఆ రోజు రాత్రి కళ్యాణదుర్గంలోనే బస చేయనున్నారు. 8వ తేదిన కురుబ కులస్తుల ఆరాధ్య దైవమైన కనకదాసు జయంతి ఉత్స వాలలో కళ్యాణదుర్గంలో మంత్రి లోకేష్ పాల్గొననున్నారు. ఇందులో భాగంగా ఎక్కడా లేనివిధంగా కళ్యాణదుర్గంలో కనకదాస సర్కిల్‌లో 9.50 అడుగులతో తయారు చేసిన కనకదాస విగ్రహాన్ని కూడా మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా ప్రారంభించనున్నారు. కనకదాస సర్కిల్‌ను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు భారీ సన్నాహాలు చేస్తున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వాల్మీ కులతోపాటు కురుబలు కూడా ఎక్కువగా ఉన్నందున భారీ కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేసి మంత్రి నారాలోకేష్ చేతులు మీదుగా ఆవిష్కరింప చేయాలని ఎమ్మెల్యే సురేంద్రబాబు గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. అందులో భాగంగా మంత్రి నారా లోకేష్ కళ్యాణదుర్గం రాక ప్రోగ్రాం కూడా ఖరారైంది. మంగళవారంలో మంత్రి నారాలోకేష్ పర్యటన విజయవంతం చేయాలన్న ఆలోచనతో ఎమ్మెల్యే సురేంద్రబాబు, ఎంపిలు అంబికా లక్ష్మినారాయణ, బికె పార్థసారథి, జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ డి.జగదీష్, ఇతర అధికారులతో పాటు టిడిపి నాయకులు అవినాష్, తేజ, బోరంపల్లి ఆంజినేయులు తదితర ముఖ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. 7, 8 తేదీల్లో జరగబోయే కార్యక్రమాలను మంత్రి నారా లోకేష్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సురేంద్రబాబు గట్టి పట్టుదలతో ఉన్నారు.

# ఆదరణ 3.0కి రూ.వెయ్యి కోట్లు

- చేతివృత్తిదారులను ప్రోత్సహించడమే లక్ష్యం
- మంత్రి ఎస్.సవిత వెల్లడి



విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: చేతివృత్తిదారులను ప్రోత్స హించేందుకు ఆదరణ 3.0 పథానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించినట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ . బిసిలకు ప్రభుత్వం అందగా ఉంటుందన్నారు. ప్రతి బిసి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో అధికంగా లబ్ధిపొందేది బిసిలేనని, మెగా డిఎస్సిలోను బిసి వార్గాల అభ్యర్థులు అధిక సంఖ్యలో ఎంపికయ్యారని వెల్లడించారు. ఆదరణ పథకం అమలుపై కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్ల సలహాలు, సూచనలు ప్రభుత్వానికి నివేదించి పథకాన్ని మరింత పారదర్శకంగా ఎటువంటి లోపాలు లేకుండా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.

### నేతన్నలను అన్ని విధాలా ఆదుకుంటాం

నేతలన్నలనను అన్ని విధాల అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయం లో మంత్రిని చేనేత ఐక్య కార్యాచరణ సమితి నాయ కులు కలిశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఆప్కో షోరూములు, ఆన్‌లైన్‌లో విక్రయాలు పెంచేలా చర్యలు తీసుకుంటు న్నట్లు మంత్రి తెలిపారు. మొంథా తుపాను కారణంగా నష్టపోయిన నేత కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుం టుందని చెప్పారు. 50 కిలోల బియ్యం, నిత్యావ సరాలు పంపిణీ చేయడంతోపాటు, నూలు, ఇతర రసా యనాలు నీటి పాలైన నేత కార్మికులకు రూ.5 వేలు సాయం చేస్తున్నట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో చేనేత ఐక్య కార్యాచరణ సమితి నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, పి.బాలకృష్ణ, రామనాథం, పూర్ణచంద్ర బాబు, కోటేశ్వరరావు, బాలజి, కుమారి, రామారావు కృష్ణారావు తదితరులు ఉన్నారు.

### లోకోమోటర్ దివ్యాంగులకు ఉచితంగా త్రీ వీలర్ మోటర్ సైకిళ్లు

# 25లోగా దరఖాస్తులు చేసుకోవచ్చు

విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో అర్హులైన లోకోమోటర్ దివ్యాంగులకు ఉచితంగా రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల మంజూరు పథకానికి అర్హులై అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర దివ్యాంగులు, వృద్ధుల సహాయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి. రవిప్రకాష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుకూల వాహానం నడపడానికి అవసరమైన డ్రైవింగ్ లైసెన్స్ ఉండి, రెగ్యులర్ డిగ్రీ, ఆ పై ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు, పదో తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధితో జీవిస్తూ రాష్ట్రానికి చెందినవారై ఉండాలన్నారు. అర్హులైన వారు, పూర్తి వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా 25 నవంబరు 2025 లోపు దరఖాస్తు చేసుకోవాలని రవిప్రకాష్ రెడ్డి తెలియజేశారు.



మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేస్తున్న ఎస్పీ తుషార్ డూడి

# భారీగా మొబైల్ ఫోన్లు రికవరీ

## చిత్తూరు ఎస్పీ తుషార్ డూడి వెల్లడి

చిత్తూరు, నవంబరు 4 ప్రభాతవార్త: చిత్తూరు క్రైం పోలీసులు చాట్‌బాట్, సిఇఐఆర్ సేవల ద్వారా మంగళవారం మరో 63 లక్షల రూపాయల విలువైన 315 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఎస్పీ తుషార్ డూడి 'మొబైల్ రికవరీ మేళా'ను నిర్వహించి ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 13 దశల్లో 8.55 కోట్ల రూపాయల విలువైన 4,106 మొబైల్ ఫోన్లను చాట్‌బాట్, సిఇఐఆర్ సేవల ద్వారా స్వాధీనం చేసుకుని మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి అందజేసినట్లు వివరించారు. మొబైల్ ఫోన్‌ను ఎలాంటి ఫిర్యాదు లేకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్ళకుండా, ఎఫ్ఐఆర్ నమోదు కాకుండా, ఇంట్లో కూర్చొని పోలీసు వారి చాట్‌బాట్, సిఇఐఆర్ సేవల ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను మళ్ళీ పొందవచ్చునన్నారు. జిల్లాలో 13వ విడతలో 315 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందిస్తున్నామన్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను చిత్తూరు క్రైమ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వర్‌రావుతో పాటు చాట్‌బాట్ సిబ్బంది బాపూజీ, రఘురామన్‌ల ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్లను రికవరీ చేశారన్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు మన రాష్ట్రంలోనిదే కాకుండా ఇతర రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాల నుండి మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందిస్తున్నామన్నారు. మొబైల్ ఫోన్లకు సంబంధించి మరిన్ని పెండింగ్‌లు వున్నాయని వాటిని సైతం త్వరలో రికవరీ చేస్తామన్నారు.

# ప్రభుత్వ రంగ సంస్థలు జవాబుదారీతనంతో పనిచేయాలి

### శాసన సభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్



విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ రంగ సంస్థలు పారదర్శ కంగా, జవాబుదారీతనంతో పనిచేయాలని రాష్ట్ర శాసన సభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మంగళ వారం కూన రవికుమార్ అధ్యక్షతన రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్, రాష్ట్ర వైద్య సేవలు. మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్, ఎపి ఏవియేషన్ కార్పొరేషన్, ఎపి ఎయిర్‌పోర్ట్స్ అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలపై కమిటీ సమీక్షించింది. కమిటీ చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి నిధులు పొందుతున్న ప్రతి సంస్థ విధిగా గణాంకాలు, ఆడిట్, విత్తం వివరాలు పక్కాగా ఉండాలన్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలోగా తనిఖీలు పూర్తి కావాలని స్పష్టం చేశారు. శాసన సభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ప్రభుత్వ రంగ సంస్థల పని సామర్థం, జవాబుదారీతనాన్ని పరిశీలిస్తుందని చెప్పారు. సంస్థలు మంచి పనితీరుతో పనిచేయడం వలన ఆదాయం పెరుగుటకు అవకాశం ఉందని తెలిపారు. ప్రతి సంస్థ వార్షిక కార్యకలాపాలు, వార్షిక ఆదాయం, వ్యయంపై విధిగా నివేదికలు సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి సంస్థ కార్యకలా పాలను క్షుణ్ణంగా విచారణ చేశారు. ఆడిట్ అభ్యంతరాలను సైతం సంస్థలు సమర్పించాలని ఆయన చెప్పారు. సంస్థలు నిర్దేశిత కాలంలో సమర్పించక పోవడానికి అంతర్యాలను ఆరా తీసారు. వచ్చే బడ్జెట్ సమావేశాల నాటికి నివేదికలు తాజా పరచాలని ఆదేశించారు. ఎపి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మినహా ఇతర అధికారులు హాజరు కావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ సమీక్షను నిర్వహించలేదు. డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ హాజరు కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఇతర అధికారులు హాజరు కావడం పట్ల సమీక్షను నిర్వహించలేదు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్, గిడ్డి సత్యనారాయణ, కుమార్ రాజా వర్లా, వసంత వెంకటకృష్ణ ప్రసాద్, బుమ్మిరెడ్డి రామగోపాల రెడ్డి, ఎపి అటవీ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా.ఎస్.ఎస్.శ్రీధర్, రాష్ట్ర వైద్య సేవలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీషా, ఎపి ఎయిర్ పోర్టుల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, కాంట్రాక్టర్ ఇషాక్ భాషా, గౌతు శిరీష ఐతబతుల ఆనందరావు, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజా వలి, డిప్యూటీ కలెక్టర్ విజయ లక్ష్మి, కమిటీ సహాయ కార్యదర్శి యు.నాగమునయ్య, ప్రిన్సిపాల్ ఆడిట్ అండ్ అకౌంట్స్ జనరల్ కార్యాలయ సీనియర్ ఆడిట్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### తుపాను బాధితులను పరామర్శించే అర్హత

# జగన్‌కు లేదు: మంత్రి సవిత

విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: మొంథా తుపాను బాధితులను పరామర్శించే అర్హత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లేదని మంత్రి ఎస్.సవిత అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తుపాను ఎప్పుడు రాష్ట్రంపై ప్రభావం చూపుతన్నా ఆయన రాష్ట్రంలో ఉండరని విమర్శించారు. తుపాను నష్టం అంచనాలు పూర్తయి కేంద్రానికి నివేదిక కూడా వెళ్లిపోయాక ఇప్పుడు పరామర్శ అంటూ జగన్ వెళుతున్నారని మండిపడ్డారు. రైతులను అప్పుడు ఇప్పుడు ఎప్పుడు ఆదుకున్న పార్టీ టీడీపీ, కూటమి ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. జగన్ అధికారంలో ఉండగా అమరావతి రైతులను ముప్పుతిప్పలు పెట్టారని, ఇప్పుడు రైతుల పరామర్శ అంటారా అంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి హయంలో కేంద్రం ఇచ్చే సాయంతో కలుపుకుని ఏడాదికి ఇచ్చింది రైతుభరోసాగా రూ.13,500 మాత్రమే అని చెప్పుకొచ్చారు. కానీ కూటమి సర్కార్ ఏడాదికి రూ.20 వేలు అన్నదాత సుఖీభవ కింద అందిస్తోందని, రైతుల సంక్షేమం చూస్తోందని తెలిపారు. రైతు అమ్మిన ధాన్యానికి డబ్బులు ఇవ్వకుండా జగన్ సర్కార్ ఎగవేస్తే వాటిని కూటమి తీర్చిందని చెప్పారు. పంట కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు.



# కార్తీక పౌర్ణమి సందర్భంగా పటిష్ట భద్రతా చర్యలు

నెల్లూరు క్రైమ్, నవంబరు 4 ప్రభాతవార్త: ప్రజలు సురక్షితంగా, ప్రశాంతంగా కార్తీక పౌర్ణమి పండుగ జరుపుకోవాలని ఎస్పీ అజిత వేజెండ్ల ఆకాంక్షించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నేడు జిల్లా పరిధిలోని శివాలయాలు, పవిత్ర దేవాలయాలు తదితర ప్రాంతాల్లో కూడా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో, జిల్లా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా చర్యలను చేపట్టిందని ఎస్పీ పేర్కొన్నారు. భక్తుల భద్రత, సౌకర్యం దృష్ట్యా అన్ని సబ్ డివిజన్ల పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఆలయాల వద్ద పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రద్దీ అధికంగా ఉన్న ప్రదేశాల్లో క్యూలైన్ వ్యవస్థలు, పార్కింగ్ సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలను సమగ్రంగా పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునే విధంగా క్యూలైన్‌లు ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేలా, మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, నిరంతర గస్తీ ఏర్పాటు చేయాలని సూచించారు. నదీ, సముద్రం తదితర స్నాన వాటికల వద్ద అప్రమత్తంగా ఉంటూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రద్దీగా ఉండే ఆలయాలు, ఘాట్ల వద్ద తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా క్యూ లైన్లలో మాత్రమే ముందుకు సాగాలన్నారు. రద్దీ అధికంగా ఉన్న సమయాల్లో ప్రజలు సహనం పాటించి, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు వందశాతం రాయితీలివ్వాలి

విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు రాయితీలను నూరు శాతం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. 7,675 దళిత, 1,320 గిరిజన పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం రూ.1,200 కోట్ల రాయితీలను తక్షణమే విడుదల చేయాల్సి ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి రాయితీలు అందకపోవడంతో దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు రాష్ట్రం స్వర్గధామమని దేశ విదేశాల్లో పెట్టుబడిదారుల వెంటపడి అనేక రాయితీలు కల్పిస్తుందని, రాష్ట్రానికి చెందిన దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు ఏళ్ల తరబడి రాయితీలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం సరైందికాదని అన్నారు. గత నాలుగేళ్లుగా వీరికి ఒక్క రూపాయి చెల్లించకపోవడం దుర్మార్గమని వెల్లడించారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు రూ.300 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, దళిత, గిరిజన పారిశ్రామికవేత్తల రాయితీల చెల్లింపునకు కేవలం రూ.206 కోట్లు కేటాయించడాన్ని తప్పుబట్టారు.

# కేంద్ర 8వ వేతన సంఘాన్ని ఏర్పాటుచేస్తూ గెజిట్ జారీ

గుంతకల్లు రైల్వే, నవంబరు 4 ప్రభాతవార్త: కేంద్ర 8వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటుచేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ అధ్యక్షతన పార్ట్ టైం సభ్యుడిగా ప్రొఫెసర్ పులక్ ఘోష్, మెంబర్ సెక్రటరీగా పంకజ్ జైన్‌లను నియమించారు. కేంద్ర ప్రభుత్వ సర్వీసులలోని మంత్రిత్వశాఖల పనితీరు, వేతన విధానం, సుప్రీంకోర్టు, వివిధ రాష్ట్రాల హైకోర్టులు, కేంద్ర పాలిత రాష్ట్రాల న్యాయాధికారుల వేతనాలు, ఉత్పాదకత ప్రతిపాదిత బోనస్ చెల్లింపు ప్రక్రియ, గ్రాట్యుటీ, జాతీయ పెన్షన్ పథకం, ఏకీకృత పెన్షన్ పథకాలను సమీక్షించి, అధ్యయనం చేసి నిర్ణీత 18 నెలలలోపు నివేదికను సమర్పించాలని కేంద్రం తన గెజిట్ నోటిఫికేషన్‌లో 8వ వేతన సంఘాన్ని ఆదేశించింది.

# అవినీతి రహితంగా పనిచేయండి: డిఆర్‌ఎం



గుంతకల్లు రైల్వే, నవంబరు 4, ప్రభాతవార్త: రైల్వే సిబ్బంది అవినీతి రహితంగా పనిచేసి రైల్వే పరువు ప్రతిష్టలను కాపాడాలని డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. విజిలెన్స్ వారోత్స వాల సందర్భంగా మంగళ వారం స్థానిక రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అత్యాశతో అక్రమార్జనలకు పాల్పడి విజిలెన్స్, సిబిఐలకు పట్టుబడి అవమానాలను ఎదుర్కోవడం కంటే ఉన్న దాంట్లో సంతృప్తి పొందాలన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడే వారికి సమాజంలో ఎంత మాత్రం విలువ ఉంటుందనేది ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. కేవలం సదరు వ్యక్తులపైనే కాకుండా దాని ప్రభావం కుటుంబ వ్యవస్థపై సైతం తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. విజిలెన్స్ వారోత్స వాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో హిందీ భాషలో తాండూరుకు చెందిన లోకో పైలట్ రవి రాబర్ట్ ముర్ముకు ప్రథమ బహుమతి లభించగా, గుత్తిలో లోకో పైలట్‌గా పనిచేస్తున్న భోలా ప్రసాద్‌కు ద్వితీయ బహుమతి లభించింది.

అలాగే ఆంగ్లభాషలో నంద్యాలకు చెందిన సీనియర్ ఏఎల్‌పి అఖిల్ సింగ్‌కు ప్రథమ బహుమతి లభించగా, ధర్మవరంకు చెందిన లోకో పైలట్ వి.కిశోర్ కుమార్‌కు ద్వితీయ బహుమతి లభించింది. విజేతలకు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే విజిలెన్స్ ఉన్నతాధికారులు బి.శివప్రసాద్, ఎస్ ఆర్ షెల్కే, డిపిఓహెచ్ ఎల్ఎన్ ప్రసాద్, ఆయా విభాగాల సంబంధిత అధికారులు రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బెదిరింపులకు భయపడం


## - వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శ

అనంతపురం, నవంబరు 4 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భూ కబ్జాలు, దౌర్జన్యాలు, డబుల్ రిజిస్ట్రేషన్లపై ప్రశ్నిస్తే వ్యక్తిగత బెదిరింపులకు పాల్పడుతున్నారని, మీ బెదిరింపులతో మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే భయపడే ప్రసక్తి లేదని వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లాలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల అవినీతి, దౌర్జన్యాలు, కబ్జాలను ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గపాటి ప్రసాద్ తనకు 450 ఎకరాలు ఉన్నాయని ఆరోపించారని ఆ భూములు ఎక్కడున్నాయో చూపిస్తే మంచిదని ఎద్దేవా చేశారు. తమ కుటుంబం సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్నా ప్రజా సంక్షేమం కోసమే పని చేశామని, తమ చరిత్ర తెరిచిన పుస్తకం లాంటిదని ఆయన స్పష్టం చేశారు. మీ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మీ దౌర్జన్యాలు, అక్రమార్జనలపై పోరాడుతూనే ఉంటామని హెచ్చరించారు. బెదిరింపులతో మా గొంతు నొక్కే ప్రయత్నం చేసినా వెనకడుగు వేసే ప్రసక్తి ఉండదని ఆయన స్పష్టం చేశారు.

కరువు మండలాల ప్రకటనలో అనంతపురం జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా ప్రకటించక పోవడంతో జిల్లా రైతాంగానికి తీరని అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతిని ధులు, అధికారులు కళ్లు తెరిచి కరువు మండలాలుగా ప్రకటించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పక్షాన ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో రైతు విభాగం జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెన్నోభిలేసు, ఎస్సీ సెల్ నగరాధ్యక్షులు పసలూరు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో పెట్టుబడులకు అపార అవకాశాలు

## నార్వే వ్యాపారవేత్తలతో ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు, నవంబరు 4 ప్రభాతవార్త: అధికారిక పర్యటనలో ఉన్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా ఏడుగురు సభ్యుల భారత ఎంపీల బృందం సోమవారం, మంగళవారంలలో అనేక ప్రత్యేక కార్యక్రమాలు, సదస్సులలో బిజీ బిజీగా పాల్గొన్నారు. సోమవారం ఉదయం నార్వే రాజధాని ఓస్లోలోని ఇన్స్టిట్యూట్ ఫర్ సోషల్ రీసెర్చ్ భవనంలో సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ జెండర్ ఈక్వాలిటీ వారు నిర్వహించిన లింగ సమానత్వంలో నార్వే ప్రయాణం అనే ప్రత్యేక కార్యక్రమంలో భారత ఎంపీల బృందం పాల్గొన్నారు. మధ్యాహ్నం నార్వే ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో భారత్‌తో ఇప్పటికే వాణిజ్య సంబంధాలు కలిగి ఉన్న పలువురు వ్యాపారవేత్తలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను నార్వే పారిశ్రామికవేత్తలకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వివరించారు. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న భారత మార్కెట్ పై దృష్టి పెట్టాలని నార్వే పారిశ్రామికవేత్తలను ఎంపీ కోరారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో నార్వే డైరెక్టర్ ఫర్ చిల్డ్రన్ యూత్ అండ్ ఫ్యామిలీ ఎఫైర్స్ వారు నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఎంపీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లింగ సమానత్వం కోసం నార్వే అనుసరించిన విధానాలు, అందులో ఎదురైన సవాళ్లు, అమలుచేస్తున్న చట్టాలపై నార్వే అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా భారత బృందానికి వివరించారు. పర్యటన మూడోరోజు మంగళవారం భారత ఎంపీలు నార్వే పార్లమెంట్‌ను సందర్శించారు. దేశ పార్లమెంట్‌లో వివిధ సభా సంఘాలతో సమావేశమయ్యారు. విదేశీ వ్యవహారాలు, సాంస్కృతిక, రక్షణ, పరిశ్రమలకు చెందిన స్టాండింగ్ కమిటీ సభ్యులతో జరిగిన సమావేశాల్లో పాల్గొన్న పుట్టా మహేష్ కుమార్ బృందం, పార్లమెంట్ సమావేశాలు జరిగే తీరును సభా గ్యాలరీల నుండి వీక్షించారు. నార్వేయన్ ఏజెన్సీ ఫర్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో డిజిటల్ పబ్లిక్ గూడ్స్ అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో భారత ఎంపీల బృందం పాల్గొంది. ఈ సమావేశంలో మాట్లాడిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ డిజిటలైజేషన్ ద్వారా భారతదేశంలో అమలు చేస్తున్న సేవలను వివరించారు.

# కొలికపూడి వర్సెస్ కేశినేని



## ఎమ్మెల్యే, ఎంపీ మధ్య మాటల వివాదం

## క్రమశిక్షణ కమిటీ ముందు ఇద్దరూ హాజరు

## ఎవరి వాదన వారు వినిపించిన నేతలు

## గీత దాటొద్దని అధిష్ఠానం హెచ్చరికలు



విజయవాడ, నవంబరు 4, ప్రభాతవార్త ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కొలికపూడి మధ్య వివాదం నేపథ్యంలో ఇరువురూ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరుకావాలని ఇటీవల పార్టీ ఆదేశించింది. ప్రభుత్వం ఏర్పడిన 16నెలల కాలంలో ఎమ్మెల్యే కొలికిపూడి 3వ సారి క్రమశిక్షణ కమిటీ ముందుకు వచ్చారు. ఎక్కడా లేని సమస్య తిరువూరులోనే ఎందుకు వస్తోందంటూ ఇప్పటికే పలుమార్లు అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం కొలికపూడి శ్రీనివాసరావు హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు క్రమశిక్షణ కమిటీలోని కొనకళ్ల నారాయణరావు, వర్ల రామయ్య, ఎంఎ షరీఫ్, పంచుమర్తి అనురాధ ఎదుట ఆయన హాజరై వివరణ ఇచ్చారు. ఎంపీ కేశినేని చిన్ని సైతం క్రమశిక్షణ కమిటీ ముందుకు వచ్చారు. వరుస వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్న ఇద్దరు నేతలపై తెలుగుదేశం అధిష్ఠానం సీరియస్‌గా ఉంది. ఇద్దరు నేతలను విచారణ అనంతరం క్రమశిక్షణ కమిటీ అధినేతకు నివేదించనున్నట్లు వివరించారు.

### ఇరువురి మధ్య వివాదం

గత కొన్ని రోజులుగా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ చిన్నిల మధ్య వాగ్వాదం నడుస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ మాటల యుద్ధం కాస్తా బ్యాంకు లావాదేవీల వరకు వెళ్లింది. ఎమ్మెల్యే టికెట్ కోసం డబ్బులు ఇచ్చానంటూ తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి బ్యాంక్ స్టేట్మెంట్ విడుదల చేశారు. ఎంపీ చిన్ని అనుచరులకు ఎంత డబ్బులు ఎక్కడ ఇచ్చింది వివరాలతో కొలికపూడి వాట్సప్ స్టేటస్ పెట్టారు. 2024 ఎన్నికల్లో తిరువూరు టీడీపీ టిక్కెట్ కోసం కేశినేని చిన్ని తనను రూ.5 కోట్లు అడిగితే వివిధ మార్గాల్లో వాటిని ఎంపీ మనుషులకు ఇచ్చినట్లు కొలిపూడి వెల్లడించారు. తాను ఇచ్చిన డబ్బు మొత్తం వివరాలపై రేపు మాట్లాడుకుందాం అని స్టేటస్‌లో పెట్టారు.కొలికపూడి ఆరోపణలపై స్పందించిన ఎంపీ కేశినేని చిన్ని వివాదం అధిష్ఠానం దృష్టికి వెళ్లిందన్నారు. అంతా అధిష్టానం చూసుకుంటుందని స్పష్టం చేశారు. మొన్నటివరకు కొలికపూడి తనను దేవుడన్నారని ఇప్పుడు దెయ్యం ఎందుకయ్యానో సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌ను విమర్శించే వారిని తాను శత్రువుల్లాగే చూస్తానని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ నేతలతో అంటకాగే నాయకుడిని తాను కాదన్నారు.

### కఠిన చర్యలకు వెనకాడబోను

తిరువూరు విభేదాలపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీకి అప్పగించారు. కొలికిపూడి శ్రీనివాసరావు, కేశినేని చిన్నీ ఇద్దరినీ పిలిచి మాట్లాడాలని సూచించిన సంగతి తెలిసిందే. ఇరు వర్గాల నుంచి వివరణ తీసుకుని తనకు నివేదించాలని ఆదేశించారు. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చాక తాను ఇద్దరితో మాట్లాడతానని తెలిపారు. పార్టీ క్రమశిక్షణ ఎవరు ఉల్లఘించినా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. విభేదాలు కొలిక్కిరాకుంటే కఠిన చర్యలకు వెనుకాడనని స్పష్టం చేసారు.

# విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎన్నారైల భాగస్వామ్యాన్ని పెంపొందించాలి

- ఎగుమతులు, దిగుమతులపై ఎన్నారైలలో అవగాహన పెంచే చర్యలు చేపట్టాలి
- ఎపి ఎన్నార్టీ ఐకానిక్ టవర్ నిర్మాణ పురోగతిపై సమీక్షలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గన్నవరం(కృష్ణా), నవంబరు 4 ప్రభాతవార్త: వివిధ దేశాలలో కీలక స్థానాల్లో పనిచేస్తున్న ఎన్నారైలతో ఓ క్లబ్ ఏర్పాటు చేసి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అన్ని అవకాశాలను వారికి వివరించి, వారి ద్వారా పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహాపరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. విదేశాల్లో స్థిరపడిన పారిశ్రామిక వేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే విధంగా వారిని ప్రోత్సహించాలని, పారిశ్రామిక విధానాన్ని వారికి అర్థమయ్యే విధంగా ప్రభుత్వం అమలుచేసే వివిధ కార్యక్రమాలను వారికి వివరిస్తూ పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలను ఎన్నారై క్లబ్ ద్వారా నిర్వహించాలని మంత్రి సూచించారు. విదేశీ సంస్థలలో కీలక స్థానాలలో పనిచేసే ముఖ్య కార్యనిర్వహణాధికారులు, ఛీఫ్ ఫైనాన్షియల ఆఫీసర్లు, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్లను ఈ క్లబ్‌లో భాగస్వాములను చేయాలని తెలిపారు. ఇదే సమయంలో ఎపి ఎన్నార్టీ అధ్యక్షుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఈ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో శక్తివంచన లేకుండా కృషి చేయాలని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా ఎగుమతిదారులు, దిగుమతిదారులతో సైతం ఓ క్లబ్ ఏర్పాటు చేసి అందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, ఎగుమతులు, దిగుమతులలో ఉన్న మెళకువలను తెలియజేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎగుమతులను ప్రోత్సహించాలని మంత్రి పలు సూచనలు చేశారు. 135 దేశాల్లో ఉన్న తెలుగువారికి ఎగుమతులు, దిగుమతులపై స్పష్టమైన అవగాహన పెంపొందించడం ద్వారా రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే వివిధ రంగాల్లోని వస్తువులను డిమాండ్ పెరిగే విధగా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. అమరావతిలో నిర్మించతలపెట్టిన ప్రవాసాంధ్రుల ఐకానిక్ టవర్ నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో ఎపి ఎన్నార్టీ అధ్యక్షుడు వేమూరి రవికుమార్, సిఈఓ కృష్ణమోహన్ పాల్గొన్నారు.



# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: కలెక్టర్ లక్ష్మీశా

విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త: ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ఆకాంక్షించారు. విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్యతో కలిసి ఇబ్రహీంపట్నం గుంటుపల్లిలో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. ఆకాంక్షిత మండలమైన ఇబ్రహీంపట్నం అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం ప్రణాళికల రూపకల్పనపై అధికారులతో మాట్లాడారు. మహిళలు స్వయం సంవృద్ధి సాధించటంతోపాటు, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా మహిళలకు వివిధ రంగాల్లో తర్ఫీదునివ్వాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళలు కొత్తకొత్త ఆలోచనలతో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. పదిమందికి ఉపాధి కల్పించే విధంగా ఆలోచించాలని, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం నుండి సహాయసహకారాలు అందిస్తామని హామి ఇచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని మహిళలు తమ శక్తిసామర్థ్యాలను గుర్తించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఏ పిడి ఏఎన్‌వి.నాంచారావు, ఎండిఓ శకుంతల, ఏబిపి కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

# దుర్గమ్మవారి ఆలయంలో నేడు కోటి దీపార్చన

## పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షణ

## జ్వాలాతోరణం, సాయంత్రం అన్నదానం

ఇంద్రకీలాద్రి, నవంబరు 4 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో కార్తీకమాస పౌర్ణమి పర్వదినాన కోటి దీపార్చన నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. బుధవారం ఉదయం 5.55లకు గిరి ప్రదక్షణను శ్రీ కామథేను మాత ఆలయం వద్ద ప్రారంభించి కుమ్మరిపాలెం, విధ్యాధరపురం, నాలుగుస్తంబాల సెంటర్, సితార, పాలఫ్యాక్టరి, కెబిఎన్ కాలేజ్, బ్రాహ్మణ వీధిలో శ్రీ స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షణ జరుగుతుందని ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషసంఖ్యలో పాల్గొనాలన్నారు. సాయంత్రం జరిగే కోటి దీపోత్సవం అనంతరం జ్వాలాతోరణం కార్యక్రమాన్ని శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల ఆలయం వద్ద నిర్వహిస్తామని అనంతరం 2500 మంది భక్తులకు అన్నదానం శ్రీ మల్లేశ్వరస్వామివార్ల ఆలయానికి వచ్చే దారిలో నిర్వహిస్తామన్నారు. 500 మంది సేవాదళ్ సభ్యులతో కోటి దీపోత్సవం నిర్వహిస్తామని ఇఓ, ఛైర్మన్‌లు తెలిపారు.

### వేదోక్తంగా కార్తీకమాస పూజలు



దుర్గమ్మవారి ఆలయంలో మంగళవారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, ఛైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ ఛైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామి వారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయం సంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.

### నిత్యాన్నదానానికి విరాళం

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీతేజ నందూరి పేరిట రు.1లక్ష విరాళాన్ని మంగళవారం దాతలు అందించారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# ఎపిలో కొత్తగా 8 నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు



## మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

విజయవాడ, నవంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో అప్పుడే పుట్టిన బిడ్డల కోసం అదనంగా మరో 8 ప్రత్యేక నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాలు నెలకొల్పనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. వీటి ద్వారా అదనంగా 80 పడకలు (వార్మర్స్) అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఒక్కో ఎస్ఎన్‌సియు ఏర్పాటుకు రూ.60 లక్షలు అవసరం కాగా, 8 ఎస్ఎన్‌సియులకు మొత్తం రూ.4.80 కోట్లు ఖర్చవుతుందన్నారు. అలాగే ఒక్కో ఎస్ఎన్‌సియుకు నెలకు రూ.8.91 లక్షలు చొప్పున 8 ఎస్ఎన్‌సియుల నిర్వహణకు దాదాపు రూ.1.07 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు.

### పిపిపి విధానంలో...

పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పిపిపి) విధానంలో ఈ 8 ఎస్ఎన్‌సియులు నడుస్తాయి. కోనసీమ జిల్లా అమలాపురం ఏరియా ఆసుపత్రి, చిత్తూరు జిల్లాలోని కుప్పం ఏరియా ఆసుపత్రి, అనంతపురం జిల్లా గుంతకల్ ఏరియా ఆసుపత్రి, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సీహెచ్సీల్లో ఈనెలాఖరులోగా సేవలు అందుబాటులోకొస్తాయి. ఏలూరు జిల్లా నూజివీడు ఏరియా ఆసుపత్రి, నెల్లూరు జిల్లా కావలి ఏరియా ఆసుపత్రి, సత్యసాయి జిల్లా కదిరి ఏరియా ఆసుపత్రి, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రులలో కొత్త ఎస్ఎన్‌సియులు నవంబరులో అందుబాటులోకొస్తాయి. రాష్ట్రంలోని టీచింగ్, జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో(దిబీద్బి) ఇప్పటికే 62 ఎస్ఎన్‌సియులు పనిచేస్తున్నాయని, వీటిలో 28 ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతమున్న 10 వార్మర్లు గల 11 ఎస్ఎన్‌సియులు, 5 వార్మర్లు గల 23 ఎస్ఎన్‌సియులలో అత్యవసర వైద్యాన్ని అవసరమైన శిశువులకు అందిస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా నవజాత శిశువులకు అధునాతన వైద్యం అందుతోంది.


### కూటమి ప్రభుత్వ హయాంలో ఇప్పటికే 4 ఎస్ఎన్‌సియులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఇప్పటికే అనకాపల్లి, ప్రత్తిపాడు, హిందూపురం, నంద్యాలలో నవజాత శిశు సంరక్షణ కేంద్రాల్ని వైద్యారోగ్య శాఖ నెలకొల్పింది. అలాగే సత్తెనపల్లిలోని న్యూబోర్న్ స్టెబిలైజేషన్ యూనిట్‌ను ఎస్ఎన్‌సియుగా అప్‌గ్రేడ్ చేశారు. వీటితో పాటు అదనంగా మరో 8 ఎస్ఎన్‌సియులు ఏర్పాటుకానున్నాయి.

### శిశువులకు ఉత్తమ సేవలు

పుట్టినప్పట్నించి 28 రోజుల వరకు ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రాల్లో సేవలందిస్తారు. తక్కువ బరువుతో పుట్టిన శిశువులు, పచ్చకామెర్లు(నియోనేటల్ జాండిస్) వచ్చిన శిశువులు, హైపో థెర్మియా, ఎఆర్‌డియస్(శ్వాశ కోస సంబంధిత సమస్యలు), సెప్సిస్ వంటి సమస్యలు గల నవజాత శిశువులకు ఇక్కడ చికిత్స అందిస్తారు.

# మంగళగిరిలో అయ్యప్ప స్వామి మహా పడిపూజలో మంత్రి లోకేష్




మంగళగిరి, నవంబరు 4 ప్రభాతవార్త: మంగళగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మహా పడిపూజ కార్యక్రమాన్ని మంత్రి ఆసక్తిగా వీక్షించారు. స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మధు నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, శివ స్వాములు, భవానీలతో పాటు పెద్దఎత్తున భక్తులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

నెల్లూరు క్రైమ్, నవంబరు 4 ప్రభాతవార్త: ప్రేమించిన అమ్మాయి దక్కదనే ఆలోచనతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళితే జిల్లా కేంద్రం నెల్లూరు నగరంలోని స్థానిక వెంకటేశ్వరపురంకు చెందిన వెంకయ్య, సుజాత దంపతులకు రోహిత్ (17) అని కుమారుడు మరో కుమార్తె ఉన్నారు. రోహిత్ తమ ఇంటికి సమీపంలోని యువతిని ప్రేమించాడు. విషయం అమ్మాయి తల్లిదండ్రులకు తెలియడంతో వారు రోహిత్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో రోహిత్‌ను తల్లిదండ్రులు మందలించారు. కొద్ది రోజులు మెదలకుండా ఉన్న రోహిత్ సోమవారం సాయంత్రం మద్యం సేవించి యువతీ ఇంటికి వెళ్లి ఘర్షణకు దిగాడు. దీంతో విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. రోహిత్ తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఇకపై ఎటువంటి పొరపాటు జరగదని హామీ ఇచ్చి రోహిత్‌ను ఇంటికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం రోహిత్ తన గదిలో ఉరి వేసుకుని విగతజీవిగా ఉండడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. వెంటనే నవాబుపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

# నేడు మరో 'సూపర్ మూన్'



కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆకాశంలో కనువిందు చేయనున్న బీవర్ సూపర్‌మూన్‌కు సంబంధించి నాసా విడుదల చేసిన చిత్రం

## ఖగోళంలో కార్తిక పౌర్ణమి అద్భుతం

## దుబాయ్ సహా గల్ఫ్ దేశాల్లో ప్రకాశవంతంగా చంద్రుడు

హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త: ఖగోళంలో బుధవారం నాడు మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. కార్తిక పౌర్ణమి రోజున బీవర్ సూపర్ మూన్‌గా చంద్రుడు మరింత పెద్దదిగానూ ప్రకాశవంతం గానూ కనిపించనున్నాడు. బీవర్ సూపర్ మూన్ దుబాయ్ సహా పలు గల్ఫ్ దేశాలలోనే పెద్ద దిగా, ప్రకాశవంతంగా కనిపిస్తుం దని భారత్ సహా ఇతర ప్రపంచ దేశాల్లో సాధారణంగానే కనిపించనున్నాడని భారత అంతరిక్ష పరిశోధనా శాస్త్రవేత్త లతో పాటు నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణ పౌర్ణమి చంద్రుడి కంటే ఎనిమిది శాతం పెద్దగా 16 శాతం అధిక కాంతితో చంద్రుడు ప్ర కాశవంతంగా కనువిందు చేయనున్నాడు. బీవర్ సూపర్ మూన్ సందర్భంగా చంద్రుడు భూమికి దగ్గరగా రానున్నాడు. ఈ ఏడాది అత్యంత పెద్ద ప్రకాశవంతమైన సూపర్ మూన్‌గా బీవర్ సూపర్ మూన్ నిలవనుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పౌర్ణమి రోజున చంద్రుడు భూమికి దగ్గరగా వచ్చే కక్ష్య బిందువుతో కలవడాన్ని సూపర్ మూన్‌గా పిలుస్తారు. కార్తిక పౌర్ణమి నాడు బీవర్ సూపర్ మూన్ కనువిందు చేయనున్న దుబాయ్ సహా గల్ఫ్ దేశాలలో చంద్రుడు భూమికి సుమారు మూడు లక్షల 56 వేల కిలోమీటర్ల దూరంలో వుంటాడని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది సాధారం కంటే 30 వేల కిలోమీటర్ల తక్కువ దూరంగా వారంటున్నారు. ఈ ఏడాది కనిపించిన బ్లడ్ మూన్, హంటర్ మూన్‌ల కంటే బీవర్ సూపర్ మూన్ పెద్దద ని వారు చెబుతున్నారు. కాగా బీవర్ సూపర్ మూన్‌ను తమ దేశ ప్రజలు వీక్షించేం దుకోసం దుబాయ్‌లోని అస్ట్రానమి గ్రూప్ ఆపరేషన్స్ భారీగా ఏ ర్పాట్లు చేసింది. ప్రస్తుతం అక్కడ చలికాలం మొదలవగా ఇంతకాలం ఎండ వేడిమితో ఇబ్బందులు పడ్డ ప్రజలు కొంత ఉపశమనం పొందారు. ఈ నేపథ్యంలో దుబాయ్ సహా గల్ఫ్ దేశాల్లో బీవర్ సూపర్ మూన్‌ను వీక్షించేందుకు ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు.




పోస్టర్, టీషర్ట్ ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీహరి, నిర్వాహకులు రమేష్ తదితరులు

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## డిసెంబరులో తెలుగు ప్రీమియర్ క్రికెట్ లీగ్

## పోస్టర్ ఆవిష్కరించిన క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటీ శ్రీహరి పిలుపునిచ్చారు. ఈమేరకు డిసెంబర్‌లో నిర్వహించతలపెట్టిన తెలుగు ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) క్రికెట్ పోటీల పోస్టర్‌ను తెలంగాణ క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి టీపీఎల్‌ను నిర్వహిస్తున్న జూపర్ ఎల్ఈడీ సంస్థ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి,ఆవిష్కరించారు. 'సే నో టూ డ్రగ్స్' ప్రచారాన్ని యువతలోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న ఈ టీపీఎల్ విజయవంతం కావాలని ఆకాంక్షి ంచారు. యువతను మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా క్రమశిక్షణ గల క్రీడాకారుడిగా, బాధ్యయుత పౌరుడిగా తయారు చేసే శక్తి క్రీడలకు ఉందని శ్రీహరి అన్నారు. క్రికెట్‌తో పాటు ఏదొక క్రీడలో యువత రాణించాలని, తద్వారా ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ కూడా అలవడుతుందని చెప్పారు. అనంతరం లీగ్ నిర్వాహక డైరెక్టర్ ఒ.రమేష్ మాట్లాడుతూ తమ సీఎస్ఆర్ నిధులతో ఈ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు.ఈ లీగ్‌ను కేవలం వినోదం కోసం నిర్వహించకుండా సమాజంలో ఆరోగ్య భద్రత, ఫిట్‌నెస్, క్రీడలపై అవగాహన పెంచేందుకు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 60 వేదికల్లో 600 టీమ్‌లతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. నాకౌట్ పోటీలకు తెలంగాణ నుంచి 4, ఆంధ్ర నుంచి 4 జట్లు ఎంపిక చేస్తామని అన్నారు. గ్రామీణ క్రికెటర్లకు పెద్ద వేదికలపై క్రికెట్ ఆడే అవకాశం కల్పించాలనేది కూడా తమ ఆలోచన అని తెలిపారు. ఈ టోర్నీ మొత్తం ప్రైజ్ మనీ రూ.80 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

# రేపటి నుండి పత్తి కొనుగోళ్లు బంద్

## అలాట్‌మెంట్, స్లాట్ బుకింగ్ సమస్యలు

## కొత్త విధానంతో రైతుల ఇబ్బందులు

## సర్కార్‌కు జిన్నింగ్ మిల్లుల అల్టిమేటం లేఖ

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా పత్తి వ్యాపారులు, జిన్నింగ్ మిల్లులు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 6వ తేదీ నుంచి పత్తి కొనుగోళ్లు చేయబోమని అల్టిమేటమ్ జారీచేశాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యవ సాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖ రాశారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అవలంబిస్తున్న అసమతుల్య అలాట్‌మెంట్, స్లాట్‌బుకింగ్ విధానాలతో ఎదురవుతున్న సమస్యల గురించి ఎన్నిసార్లు చెప్పినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో తామీ నిర్ణయం తీసుకున్నట్టు తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్పష్టంచేసింది. ప్రధానంగా పత్తి సేకరణ కోసం కాటన్ కార్పొరేషన్ ఇటీవల ప్రారంభించిన ఆండ్రాయిడ్ ఆధారిత అప్లికేషన్ అయిన కపాస్ కిసాన్‌ను యాక్సెస్ చేయడంలో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నవంబర్‌లో పంట కోతకు సిద్ధమవుతున్న పలువురు రైతులకు మారుమూల గ్రామాల్లో టెలికాం నెట్‌వర్క్ కవరేజ్ సరిగా లేకపోవడం వల్ల యాప్‌లో నమోదు చేసుకోలేక, స్లాట్‌లను బుక్ చేసుకోలేకపోతున్నారు.

గ్రామాల్లో సెల్ ఫోన్ల నెట్ వర్క్ కవరేజ్ సరిగా లేకపోవడం వల్ల పేరు, భూమి టైటిల్ వివరాలు, ఆధార్ నంబర్ నమోదు చేసుకోలేకపోతున్నట్లు చెబుతున్నారు. దీంతో స్లాట్ బుక్ చేసుకోలేకపోతున్నట్లు వాపోతున్నారు. మరోపక్క స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత మార్కెట్ మూసివేసినా, లేక అనివార్య కారణాల వల్ల ఆ తేదీకి రాలేకపోయినా మరుసటి రోజు పత్తిని విక్రయించవచ్చా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత లేదని రైతులు అంటున్నారు.

ఈ నేపథ్యంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మనేని రవీందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిసింది. సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని మండిపడుతున్నారు. మార్కెట్‌కు పత్తిని తీసుకొచ్చాకగానీ, తమకు కిసాన్ కపాస్ యాప్ గురించి తెలియదని కొందరు, ఒకవేళ తెలిసినా తమకు స్మార్ట్ ఫోన్లు లేవని మరికొందరు రైతులు ఆవేదన చెందుతున్నారు.

# నకిలీ సర్వే రిపోర్టులు, సిఎంపై తప్పుడు ప్రచారం

## ఇసికి ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ ఫిర్యాదు

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పలు మీడియా ఛానల్స్ తప్పుడు ఆరోపణలు చేస్తూ, నకిలీ సర్వే రిపోర్టులు ప్రసారం చేస్తున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రధాన ఎన్నికల అధికారి, జూబ్లీహిల్స్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేవారు. ఈ చర్యలు ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన మాత్రమే కాకుండా, భారత శిక్షాస్మృతి సెక్షన్ 499, 500 ప్రకారం దూషనాత్మక నేరం కిందకు వస్తాయని ఆయన అన్నారు.తప్పుడు ప్రచారాలు ముఖ్యమంత్రి ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, ఓటర్లను తప్పుదారి పట్టించే ప్రయత్నమని విమర్శించారు. ఎన్నికల సంఘం వెంటనే చర్యలు తీసుకుని, ఇలాంటి దుష్ప్రచారం, నకిలీ సర్వేలు కొనసాగకుండా అడ్డుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 238

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 4, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాఫూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 238 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 51, రెవెన్యూ శాఖకు సంబంధించి 46, మున్సిపల్ శాఖకు సంబంధించి 23, ఇందిరమ్మ ఇళ్ల కోసం 67, ప్రవాసీ ప్రజావాణికి 2 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 49 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# మెడికల్ పిజి మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకు కేటాయింపు

## ఇది చరిత్రాత్మక నిర్ణయం

## వైద్య ఆరోగ్య మంత్రి రాజనర్సింహాకు జూడాల కృతజ్ఞతలు

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభు త్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్(జూడా) ప్రకటించింది. చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాకి అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జె ఐజాక్ న్యూటన్, జనరల్ సెక్రటరీ డాక్టర్ అజయ్ నేతృత్వంలోని జూనియర్ డాక్టర్ల బృందం మంగళవారం మంత్రిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపింది.తమ దశాబ్దకాల ఆకాంక్షను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో స్థానిక డాక్టర్లకు పీజీ సీట్లు పొందే అవకాశాలు పెరుగుతాయని, తద్వారా రాష్ట్రంలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగుతుందని జూడాలు తెలిపారు.

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల బలోపేతానికి, నాణ్యమైన మెడికల్ విద్యను అందించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జూడాలు అభినందించారు.

ఇటీవలే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు పెంచడం, టీచింగ్ ఫాకల్టీ నియామకం, జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్లకు స్టైఫండ్ 15 శాతం పెంచిన విషయాలను జూడాలు గుర్తు చేశారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కాలేజీల్లో సౌకర్యాలు పెరిగాయని, దీంతో ఇటీవల జరిగిన అసెస్‌మెంట్‌లో ఒక్క సీటును కూడా నేషనల్ మెడికల్ కమిషన్ తగ్గించలేదని జూడాలు గుర్తు చేశారు. కాలేజీల అభివృద్ధితో పీజీ, యూజీ సీట్లు అదనంగా వచ్చాయని.. దీంతో తమకు అవకాశాలు పెరిగాయని డాక్టర్లు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని జూడాలు తెలిపారు.



# జన్‌ధన్‌లో బోగస్ .. 21.25 లక్షల ఖాతాలకు ఆధార్ నో

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జన్‌ధన్ పథకానికి వివిధ బ్యాంకులు మోకాలడ్డుతున్నాయి. బోగస్ ఖాతాలకు అడ్డుకట్ట వేయడానికి కేంద్రం ప్రతీ బ్యాంకు జన్‌ధన్ ఖాతాకు ఖాతాదారుడి ఆధార్ సంఖ్యను తప్పనిసరిగా అనుసంధానం చేయాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని మాత్రం కొన్ని బ్యాంకులు పట్టించుకోవడం లేదు. సంక్షేమ పథకాల సొమ్మును జన్ ధన్ ఖాతాలకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ విధానంలో కేంద్రం జమ చేస్తోంది. అయితే తెలంగాణలో 21,24,728 జన్ ధన్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో బోగస్ ఖాతాలను గుర్తిం చడం సాధ్యం కావడం లేదు. ఖాతాదారులకు ఇతర బ్యాంకుల్లో ఉన్న అకౌంట్లను గుర్తించడం సైతం కష్టంగా మారుతుంది. అందుకే వెంటనే అనుసంధానం పూర్తి చేయాలని గత ఏడాది రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సైతం ఆదేశించింది.

అయినప్పటికీ ప్రధాన బ్యాంకుల్లో దాదాపు సగం మేర ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడం గమనార్హం.

ఈ విధంగానే ఆదిలాబాద్ జిల్లాలో 5.82 లక్షల మంది పేదలకు జన్ ధన్ ఖాతాలుంటే వీటిలో 1.33 లక్షల ఖాతాలకు, హైదరాబాద్‌లో 12.47 లక్షల జన్ ధన్ ఖాతాలకు 1.60 లక్షల ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాలేదు. దీంతో ఈ ఖాతాల్లో ఎన్ని బోగస్ ఉన్నాయనేది గుర్తించడం కష్టతరంగా మారిందని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

# మౌలిక సదుపాయాల కల్పనలో బిఆర్ఎస్, కాంగ్రెస్ విఫలం



## మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ వంటి ప్రతిష్టాత్మక నియోజకవర్గంలో సైతం అభివృద్ధి జరగకపోవడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రంగా ఉండటం, బిఆర్ఎస్, కాంగ్రెస్ పాలనల అసలైన ప్రతిఫలమేనని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నగరంలో వర్షం పడితే రోడ్లు చెరువులుగా మారిపోతున్నాయని, డ్రైనేజ్ నీరు ఇళ్లలోకి వస్తుందని, ప్రజలు గోడలు కట్టుకుని బతికే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానిం చారు. ఇది అభివృద్ధి కాదు, ఇది పాలన వైఫ ల్యం అని ఎద్దేవా చేశారు. బస్తీల్లో మౌలిక సదుపా యాలు పూర్తిగా కూలి పోయాయని, వీధిలైట్లు పని చేయకపోవడం, చెత్త పేరుకుపోవడం ప్రజల జీవితాలను ఇబ్బం దులకు గురిచేస్తుందని తెలిపారు. ఇంత ముఖ్యమైన ప్రాంతంలో ఇలాంటి దుస్థితి ఉంటే, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల పరిస్థితి ఊహించుకోవచ్చునని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా, రాజకీయ ప్రలోభాలు, మాయ మాటలతోనే వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలు పక్కనపెట్టి, రియల్ ఎస్టేట్ లాభాలు, కాంట్రాక్టులు, రాజకీయ బేరసారాలు మాత్రమే ప్రభుత్వ ప్రాధాన్యం అయిపోయాయని ఆయన అన్నారు. ఎలక్షన్ కోడ్ నడుస్తున్న సమయంలో ముఖ్యమంత్రి ప్రజలను ప్రలోభపెట్టే విధంగా చేసిన వ్యాఖ్యలు అసహ్యకరమని డా. బూర నర్సయ్య గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీకి ఓటు వేయకపోతే ప్రభుత్వ పథకాలు ఆపేస్తామని చెప్పడం ప్రజాస్వామ్యానికి అవమానమన్నారు. ఇలాంటి వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకే నాణానికి రెండు వైపులన్నారు. ప్రజలు ఈసారి జూబ్లీహిల్స్ బైఎలక్షన్‌లో బిజెపికి మద్దతు ఇచ్చి, కాంగ్రెస్, బిబీఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేసిన హామీలను ప్రజలు ఇప్పుడు తీవ్రంగా ప్రశ్నిస్తు న్నారన్నారు.

# మక్కల కొనుగోలు పరిమితి 25 క్వింటాళ్లకు పెంపు

## కేంద్రం దృష్టికి జిన్నింగ్ మిల్లుల సమస్యలు

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త :** ఈ సీజన్‌లో మక్కల దిగుబడి ఎక్కువగా ఉంటుందనే అంచనాలతో పాటు, రైతుల విజ్ఞప్తి మేరకు వాటి కొనుగోలు పరిమితిని ఎకరాకు 18.5 క్వింటాళ్ల నుండి 25 క్వింటాళ్లకు పెంచాలని నిర్ణయించినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మక్కల కొనుగోలు కోసం 214 కొనుగోలు సెంటర్లు ప్రతిపాదించగా, 125 సెంటర్లు ప్రారంభించి, మిగిలిన వాటిని కూడా వెంటనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 125 సెంటర్ల ద్వారా 23,131 మెట్రిక్ టన్నుల మక్కలను సేకరించినట్టు చెప్పాంు. మొత్తం రూ.2500 కోట్ల ఖర్చుతో మక్కలను కొనేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలియచేశారు. కాగా జిన్నింగ్ మిల్లర్ల సమస్యలపై సిసిఐ సిఎండి లలిత్ కుమార్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. సిసిఐ అవలంబిస్తున్న అలాట్‌మెంట్ విధానం వల్ల కొనుగోళ్లు కొన్ని జిన్నింగ్ మిల్లులలో మాత్రమే జరుగుతున్నందున, అనేక జిన్నింగ్ మిల్లులు మూతపడే పరిస్థితులు నెలకొంటోందని చెప్పారు. అలాగే కపాస్ కిసాన్ యాప్ లో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందుల కారణంగా రైతులు, మిల్లుదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లులలో కొనుగోళ్లను రెండు రోజులలో ప్రారంభించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా తేమ శాతం 12 కు పైగా ఉంటుందని, దీనిని సీసీఐ వారు కొనకపోవడంతో, రైతులకు బహిరంగ మార్కెట్లో మంచి ధర రాకపోవడంతో నష్టపోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎకరాకు 7 క్వింటాల కొనుగోలు పరిమితి ఎత్తివేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన సవరణలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కీలక పరిణామం

## రామచందర్‌రావు, కిషన్‌రెడ్డితో జనసేన రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌గౌడ్ భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి జనసేన పార్టీ మద్దతు ప్రకటించింది. జనసేన రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో భేటీ అయి బిజెపికి పూర్తి మద్దతు ప్రకటించారు. రెండు పార్టీల నాయకులు బుధవారం మీడియా సమావేశం నిర్వహించి తమ భవిష్యత్ కార్యాచరణను వివరించనున్నారు. హైదరాబాద్‌లోని సాగర్ సొసైటీలో జరిగిన ఈ భేటీలో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి తోపాటు పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డితోపాటు రెండు పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ భేటీ జనసేన అధ్యక్షులు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు జరిగినట్టు నాయకులు తెలిపారు.

# కల్వకుంట్ల కుటుంబాన్ని రక్షించడమే రేవంత్‌రెడ్డి బాధ్యత?

## బిజెపి అధికార ప్రతినిధి రాణి రుద్రమ

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజలకు అనేక సందేహాలు ఉన్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రమే ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని బిజెపి అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు నయీం దోచుకున్న ఆస్తులను స్వాధీనం చేసుకుని ప్రజలకు పంచుతాం అని మాట్లాడారు. ఇప్పటికి 22 నెలలు అవుతున్నా, ఎందుకు నోరు మెదపడంలేదు? అంటూ ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబాన్ని, బిఆర్ఎస్ నాయకులను రక్షించడమే రేవంత్ రెడ్డి బాధ్యతా? ఫోన్ ట్యాపింగ్ కేసులో కెటిఆర్‌ని అరెస్ట్ చేయకుండా ఈ ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్–బిఆర్ఎస్ మధ్య ఎలాంటి చీకటి ఒప్పందం ఉన్నదో ప్రజలు ఇప్పుడు బహిరంగంగా అడుగుతున్నారు.

ఓటుకు నోటు కేసులో అప్పట్లో కెసిఆర్ రేవంత్ రెడ్డిని రక్షించారు. ఇప్పుడు ఆ రుణం తీర్చేసే ప్రయత్నం జరుగుతుందా అన్న అనుమానం కలుగుతుంద న్నారు. ఇదేనా కొత్త రాజకీయ నీతి?మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు సహా, బిఆర్ఎస్ కాలంలో ఉన్న ముఖ్య అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ నిశ్శబ్దం వెనుక ఏ ఒప్పందం దాగి ఉంది?పదేళ్లు బిఆర్ఎస్ దోచు కుంది. ఇప్పుడు అదే మార్గంలో కాంగ్రెస్ కొనసా గిస్తుందన్నారు. ఇద్దరూ కలిసి రాష్ట్రాన్ని దోచుకుని, నింద మాత్రం బిజెపిపై మోపుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిబిఐకి అప్పగించాలన్నారు. అని. కానీ 22 నెలలు అయినా, ఒక లేఖ కూడా రాయలేక పోయారు. ఎందుకు? ఎవరిని రక్షిస్తున్నారు?ప్రజలు ఇప్పుడు అన్నీ గమని స్తున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఒక్కటే కాదు, ఇది భవిష్యత్తు ఎన్నికల తీర్పు నకు సూచన. రేవంత్‌రెడ్డి ఎంత బురద చల్లినా, కమలం బురదలోనే వికసిస్తుంది. గత ఏడు సంవత్స రాలుగా ప్రజల ఆశీర్వాదంతో, బిజెపి ఒక అసెంబ్లీ సీటు నుంచి ఎనిమిది సీట్ల వరకు ఎదిగిందన్నారు.

# బహరెయిన్‌లో భర్త అంత్యక్రియలకు సమ్మతిస్తూ మృతుడి భార్య అఫిడవిట్ దాఖలు

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 4, ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లికి చెందిన శ్రీపాదనరేష్ ఐదేళ్ల క్రితం బహరెయిన్‌లో మృతి చెందడంతో అప్పటి నుంచి అతని మృతదేహం మార్చురీలో మగ్గుతున్నది. ఆయన మృతదేహాన్ని భారత్‌కు రప్పించడం సాధ్యం కాదని ఇండియన్ ఎంబసీ స్పష్టం చేయడంతో బహరెయిన్‌లోనే అంత్యక్రియలు నిర్వహించేందుకు సమ్మతిస్తూ మృతుని భార్య శ్రీపాద లత(మునికోట నాగమణి) నిరభ్యంతర పత్రంపై సంతకం చేసారు. తదుపరి తీసుకోవాల్సిన చర్యల కోసం కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన సిఎం ప్రవాసీ ప్రజావాణిని సందర్శించి మృతుడు సోదరుడు ఆనంద్‌తో కలిసి జి.చిన్నారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్‌చైర్మన్ మంద భీంరెడ్డికి అందజేసారు. ప్రభుత్వం.. బహరెయిన్‌లోని ఇండియన్ ఎంబసీతో సమన్వయం చేసి అక్కడే అంత్యక్రియలు జరిగేలా చూడాలంటూ ఎమ్మెల్యే కోరారు. మృతుడి సోదరుడు ధర్మపురి ఆనంద్ బహరెయిన్ వెళ్లి అంత్య క్రియలకు హాజరు కాను న్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై అడ్వైజరీ కమిటీ మెంబర్లు సంగి దేవేందర్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి సామాజిక సేవకులు మెరుపు తేజ, ఆకుల ప్రవీణ్, బొజ్జ అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బహరెయిన్‌లోని సామా జిక కార్యకర్తలు డి.వి. శివకుమార్, కోటగిరి నవీన్‌కుమార్, నోముల మురళి భారత కార్యా లయంతో సమన్వయంచేసి సాంప్రదాయంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు.




చిన్నారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్‌చైర్మన్ మంద భీమిరెడ్డి తదితరులు

# ఉపఎన్నికలో గెలుపే లక్ష్యం

## కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం: మేయర్ గద్వాల విజయలక్ష్మి

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించేందుకు కీలకమైన కోఆర్డినేషన్ కమిటీ సమావేశం గాంధీభవన్‌లో జరిగింది. కమిటీ చైర్ పర్సన్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, చైర్ పర్సన్ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించ బడింది. సమావేశంలో పాల్గొన్న కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు.7 డివిజన్ల ఇంఛార్జిలు, చైర్మన్‌లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు అందరూ ఏకమై కాంగ్రెస్ గెలుపు అనే ఏకైక లక్ష్యంతో కట్టుబడి పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ "జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌పై అపారమైన నమ్మకం ఉంచారు. ఈ నమ్మకాన్ని కాపాడుకుంటూ, ప్రతి డివిజన్‌లో సమన్వయంతో పనిచేసి, నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నదే మా సంకల్పం అని స్పష్టం చేశారు.మాజీ ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త, నాయకుడు ఒక్కొక్కరు ఒక్కో డివిజన్‌లో బూత్ లెవెల్ వరకు చురుకుగా పనిచేయాలి. ఐక్యత, సమన్వయం, క్రమశిక్షణ ఇవే మన విజయ సూత్రాలు అని పిలుపునిచ్చారు.

# ప్రజలను మోసం చేసే పార్టీ కాంగ్రెస్

## ఓట్ల కోసం, సీట్ల కోసం ఎంతకైనా దిగజారుతారు

## బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసే పార్టీ అని, ఓట్ల కోసం, సీట్ల కోసం, వాళ్లు ఎంత దిగజారడానికైనా సిద్ధమే అని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రజలను ఆకట్టుకునేందుకు ఆకాశాన్నే చేతిలో పెడతామని చెబుతారు, కానీ వాస్తవంలో మాట నిలబెట్టుకోరు. హామీలు ఇవ్వడమే వాళ్ల లక్ష్యం – కాని అమలు మాత్రం శూన్యం అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో డిక్లరేషన్ల పేరుతో వివిధ వర్గాల ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేశారన్నారు. మహిళల కోసం మహిళా డిక్లరేషన్, దళితుల కోసం దళిత డిక్లరేషన్, రైతుల కోసం కిసాన్ డిక్లరేషన్, యువత కోసం యువ డిక్లరేషన్ అంటూ.. ప్రతి వర్గానికి అనేక హామీల వర్షం కురిపించారు.

కానీ ఇప్పుడు ఆ డిక్లరేషన్లు అన్నీ ఎక్కడున్నాయి? మాయమైపోయాయి.. మసక బారిపోయాయి.. ప్రజలకు చేసిన వాగ్దానాలు బుట్టదాఖలయ్యాయి.ఓట్లు, సీట్లు దక్కించుకున్న తర్వాత కాంగ్రెస్ పార్టీకి ఆ హామీల విలువ మరిచిపోయింది. ఇదే వాళ్ల నిజస్వరూపం –మాటలు గొప్పగా, పనులు సున్నా! ఏ ఒక్క డిక్లరేషన్ అయినా కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఈరోజు గుర్తు చేసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదన్నారు.

దళితులకు సంబంధించిన హామీలు... ప్రతి కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పారు. విద్యార్థులు 10వ తరగతి పాస్ అయితే రూ.10,000, డిగ్రీ పూర్తయితే రూ.50,000, ఆపై ఉన్నత విద్య కోసం రూ.1 లక్షతో పాటు ప్రాజెక్ట్ లు, పరిశోధనల నిమిత్తం మరో రూ.5 లక్షలు ఇస్తామని మాటలు చెప్పారు... ప్రకటనలు గుప్పించారు. కానీ ఈ హామీలలో ఒక్కటీ నెరవేరలేదన్నారు. కాగితం మీద మాత్రమే ఉన్న దళిత డిక్లరేషన్ – ప్రజల జీవితాల్లో మాత్రం శూన్యం! అన్నారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అదే పాత నాటకం మొదలుపెట్టిందన్నారు. రెండేళ్ల క్రితం ఇచ్చిన హామీలు అమలు చేయకపోయినా, మళ్లీ అదే వాగ్దానాలతో పేద ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలు ఇవ్వకపోతే యుద్ధమే

## సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** ఫీజుల సమస్యలు చర్చించడానికి అఖిల పక్షం ఏర్పాటు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని 6 వేల కాలేజీలు మూసివేసి ఆందోళన చేస్తుంటే ప్రభుత్వానికి పట్టింపులేదని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తూ వెంటనే స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి 24 నెలలు గడుస్తున్న చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. బిసిలు ఉన్నత చదువులు చదువుకొని అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక పోతున్నారు. ఫీజులు చెల్లించడానికి డబ్బులు లేవనడం విద్యను నిర్లక్ష్యం చేయడమే అవుతుందని, బకాయిలు ఇవ్వకపోతే రాష్ట్రంలో యుద్ధమే జరుగుతుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు ఏంచేస్తున్నారని కృష్ణయ్య ప్రశ్నించారు.

# ఈ పొడగిరి ఎవరో !



అరడుగుల బుల్లెట్టు దూసుకుపోతే ఎంత నష్టమో! చూసాం కానీ అరడుగుల అబ్బాయిలనూ చూసాం తాజాగా ఓ అరడుగుల పది అంగుళాల పొడవున్న అమ్మాయిని తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీవారి దర్శనానికి వెళ్తున్నాపుడు భక్తజనం ఎగాదిగా చూసారు. ఆశ్చర్యపోయారు. వారికెంత విస్మయం కలిగిందంటే కళ్లార్పకుండా చూసారంటే నమ్మాల్సిందే మరి. ఆమె ఎవరో కాదు. శ్రీలంకకు చెందిన నెట్‌బాల్ ప్లేయర్ తార్జిని శివలింగం. సంప్రదాయ వస్త్ర ధారణల్లో భక్తి భావంతో ఆమె శ్రీవారి గుడిలోకి నడచివచ్చింది. సాధారణంగా మన పూర్వీకులు కొన్ని వేల సంవత్సరాల క్రితం బాగా పొడుగ్గా ఉండేవారని విన్నాం. ఇపుడు కాస్తంత పొడుగు తగ్గినా చూస్తున్నాం. □

# పిల్లలకు తాజా పాలు..



పిల్లల పోషణ.. పాలతో పరిపూర్ణమవుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తాజా పాలు దొరకడం కొంచెం కష్టమే. దాంతో చాలామంది..ముఖ్యంగా పట్టణాలూ, నగరాల్లోని వాళ్లు ప్యాకెట్ పాలను వాడటానికే మొగ్గు చూపుతుంటారు. అయితే వీటి ఎంపికలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అనారోగ్యాలు తప్పవని హెచ్చరిస్తున్నారు నిపుణులు. దీని మీద కార్నెల్ యూనివర్సిటీ చేసిన పరిశోధనలో ఎన్నో ఆశ్చర్యకర విషయాలు వెల్లడ య్యాయి. పేపర్‌బోర్డు లేదా టెట్రా ప్యాకింగుతో తయారైన పాల డబ్బాల్లో బ్యాక్టీరియా శాతం అధికంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కారణాలను అన్వేషిస్తే.. పాలను శుద్ధిచేసిన తరవాత వాటిని డబ్బాల్లో నింపడానికి వినియోగించే మెషిన్లే ఇందుకు కారణమని తేల్చిరు. ఇందులో భాగంగా మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్లలో పాల శాంపిళ్లను తీసుకుని పరీక్షించారు. వారం తరవాత వాటిల్లోని పాలు 30 శాతం పాడైతే, రెండు వారాలకల్లా 41 శాతం పాడైనట్లు గుర్తించారు. అంతే కాదు రుచిలోనూ తేడాను గమనించారట. మరో విషయం ఏంటంటే.. పెద్ద కంటైనర్లలోని పాలకంటే చిన్న కంటైనర్లలోని పాలు త్వరగా పాడవుతున్నాయనీ చెబుతున్నారు.యంత్రాల వాడకం పెరగడం, వాటిని శుభ్రం చేయడం క్లిష్టతరంగా ఉండటమే ఈ పరిస్థితికి దారితీస్తోంది. ఈ మెషిన్లను మరింత శ్రద్ధతో శుభ్రం చేయాలనీ, అవసరమైతే వాటి డిజైన్‌లోనూ మార్పులు చేయాలని ఆయా సంస్థకు సూచిస్తున్నారు పరిశోధకులు. వినియోగదారులు ఈ టెట్రా ప్యాకెట్లనూ, పేపర్‌బోర్డు కంటైనర్లనూ వినియోగించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ముఖ్యంగా గర్భిణులూ, పిల్లలూ వీటిని వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలట. పిల్లల పోషణ.. పాలతో పరిపూర్ణమవుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తాజా పాలు దొరకడం కొంచెం కష్టమే. దాంతో చాలామంది. □

# విశేష ఫలితాలనిచ్చే కార్తిక పూర్ణిమ



భారతీయ హైందవ సనాతన సంప్రదాయం ప్రకారం సంవత్సరంలో ఉన్నటువంటి పన్నెండు మాసాలకు పన్నెండు ప్రత్యేకతలు చెప్పబడినాయి. అన్నింటిలోకి అతి శ్రేష్ఠమయినది కార్తీకమాసం. కార్తీక మాసం శివకేశవులకు అబేధమయినది. పరమశివుణ్ణి, శ్రీమహా విష్ణువుని యిద్దరినీ పూజించవచ్చును.

శ్రీ మహావిష్ణువును 'కార్తీక దామెదరుడి'గా పిలుస్తారు. కార్తీకస్నానాలు అనేవి కార్తీక మాసంలో చాలా ముఖ్యమయినవి. నదీ స్నానాలు మంచిది. వీలయినంతవరకు కార్తీక మాసంలో నదీస్నానాలు చేయడానికే ప్రయత్నించాలి. కార్తీకమాసంలో నదీస్నానాలతోపాటు దానాలు, జపం, ఉపవాసాలు మంచివి. చాలా మంది పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం ప్రదోషవేళలో దేవుడికి పూజలు చేసి నక్షత్ర దర్శనం అయిన తరువాతనే భోజనాలు చేసారు. వీటినే 'కార్తీక నక్తాలు' అనే పేరుతో పిలస్తారు. కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమిని హిందువులకు పరమ పవిత్రమైన రోజు. ఇది మహా శివరాత్రితో సమానమైన పుణ్యదినం. 'త్రిపురి పూర్ణిమ' తిపురి పూర్ణిమ' దేవ దీపావళి అని కూడా అంటారు. ఆశ్వయుజ అమావాస్య అంటే దీపావళి వెళ్ళిన మర్నాడు కార్తీకమాసం ప్రారంభమవుతుంది. ఇక ఆరోజు నుండి కార్తీకమాసం ముగిసే వరకూ ప్రతిరోజూ సాయంవేళ దీపాలు వెలిగించి ప్రారంభం చేస్తారు.ఈ మాసంలో ప్రతి దినమూ పవిత్రమైనదే. సోమవారాలు, రెండు ఏకాదశులు, శుద్ధ ద్వాదశి, పౌర్ణమి దినాలు ఒకదానికంటే మరొకటి అధిక ప్రభావవంతమైనవి. నెలరోజులు చేసే కృత్యాల ఫలితం ఒక ఎత్తు, పౌర్ణమి నాటి కృత్యాల ఫలితం మరొక ఎత్తు, అందువల్ల అనేక వ్రతాలు, పూజలు, కృత్యాలకు దైవారాధనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలనీ పురాణాలు తెలిపాయి. . ఈ నెల అంతా కార్తీక మహా పురాణాన్ని పారాయణం చేస్తారు. దేవాలయాల్లో కార్తీక పురాణ శ్రవణం ఏర్పాటు చేస్తారు. మహాభారత కథనాన్ని అనుసరించి కార్తికేయుడు తారకాసురుని సంహరించిన రోజే కార్తీక పౌర్ణమి. ప్రజలను నానారకాలుగా హింసిస్తున్న తారకాసురుడు ఇక లేడన్న ఆనందంతో దీపాలు వెలిగించి సంబరం చేసుకున్నారు. వెయ్యేళ్ళ రాక్షసుల



పాలన అంతరించిన శుభసందర్భంగా మహాశివుడు తాండవం చేశాడని పురాణాలు చెప్తున్నాయి. కార్తీక పౌర్ణమి అటు శివునికి, ఇటు విష్ణు మూర్తికి కూడా ప్రియమైన రోజు. ఈరోజున దీపం వెలిగిస్తే మనం తెలిసీ తెలీక చేసే పాపాలన్నీ హరించుకుపోతాయి. కార్తీక సోమవారాల్లో, కార్తీక పౌర్ణమి రోజున రుద్రాభిషేకం చేయిస్తారు. ఈ విశిష్ట దినాన సత్యనారాయణ వ్రతం చేసుకోవడం చాలా శ్రేష్ఠం. ప్రధానంగా కార్తీక పౌర్ణమి నాడు తెల్లవారు జామున సముద్రంలో లేదా నదిలో స్నానం చేయడం శుభప్రదం. నదిలో స్నానం చేసే అవకాశం లేనివారు ఉదయానే లేచి స్నాన జపాలు ముగించి ఆలయానికి వెళ్ళి దేవుని దర్శించుకుంటారు. ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. రోజంతా ఉపవాసం ఉండి, సాయంత్రం 365 వత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తారు. రోజుకు ఒక ఒత్తి చొప్పున ఏడాది మొత్తాన్ని సూచిస్తాయి ఈ ఒత్తులు. కొందరు దీపాలను అరటి దొన్నెపై ఉంచి నదిలో లేదా కొలనులో వదులుతారు. ఇంకొందరు శివాలయంలో దీపాలు వెలిగిస్తారు. ఆ వీలు లేనివారు ఇంట్లోనే దేవునిముందు లేదా తులసికోట ఎదుట దీపం వెలిగిస్తారు.కార్తీక పౌర్ణమి నాడు శివాలయంలో దీపారాధన చేయడం అంటే ముక్కోటి దేవతలనూ పూజించడమే. సకల పుణ్యనదుల్లో స్నానం చేసిన ఫలం దక్కుతుంది. కార్తీక పౌర్ణమినాడు చేసే దీపారాధనతో ఇహలోకంలో సుఖసౌఖ్యాలు, పరలోకంలో ముక్తి లభిస్తాయి. కార్తీక పౌర్ణమి జైనులకు, పంజాబీలకు కూడా విశిష్ట పర్వదినం. గురునానక్ జయంతి కూడా ఈరోజే. ఈ విశేష పర్వదినాన గంగా మహోత్సవం కూడా నిర్వహిస్తారు. కార్తీక మాసంలో పదిహేనవ రోజున పౌర్ణమి వస్తుంది. అందువల్ల కార్తీక పౌర్ణమి అంటారు ఆ రోజున దీపావళి రోజున కేదారేశ్వర నోములు నోచుకోని వారు కార్తీక పౌర్ణమి రోజున నోముకుంటారు.కార్తీక పౌర్ణమి రోజునాడు మహిళలందరూ ఆలయాలకు వెళ్లి వత్తులు వెలిగిస్తారు. పౌర్ణమినాడు కృత్తికా నక్షత్రంలో చంద్రుడు ఉంటాడు. కార్తీకమాసంలో వచ్చేటటువంటి పౌర్ణమి అంటారు

- పర్వతాల శ్రీనివాస్

# సృష్టి రక్షణ

పురాణేతిహాసాల్లోవివిధ సందర్భాల్లో సప్తమాతృకల ప్రస్తావన కనిపిస్తుంది. ఆ విశ్వ శక్తిని నిర్వహణ శక్తిగా అభివర్ణించాయి. సృష్టి సంరక్షణ కోసం అవతరించిన దేవతా శక్తులే సప్తమాతృకలు. శాక్తేయులు అమ్మవారిని శాంతమూర్తిగానూ, ఉగ్రమూర్తిగానూ కూడా ఉపాసిస్తారు. ఆ పద్ధతిలో సప్తమాతృకా ఉపాసన విధానం ఒకటి. వర గర్వంతో లోకకంటకులుగా మారిన శుంభనిశుంభ, ధూమ్రలోచన, రక్తబీజ, మహిషాసురుల సేనాల్ని నిర్మూలించడానికి అమ్మవారు బ్రహ్మాది దేవతల్లోని శక్తులను ధరించినట్లు దేవీ భాగవతం, మార్కండేయ, వరాహ, అగ్ని పురాణాలు ఉన్నాయి. బ్రహ్మ నుంచి బ్రాహ్మి, విష్ణుమూర్తి నుంచి వైష్ణవి, పరమశివుడి నుంచి మహేశ్వరి, యముడి నుంచి కౌమారి, ఇంద్రుడి నుంచి ఇంద్రాణి, ఆదిశక్తి నుంచి చాముండి, యజ్ఞ వరాహమూర్తి నుంచి వారాహిగా అవతరించిన జగన్మాత దుష్ట శిక్షణ, శిష్టరక్షణ గావించింది. శివపురాణంలోనూ సప్తమాతృకల ప్రస్తావన ఉంది. ఈ మాతృకలకు శివపార్వతులు పూజార్హతను ప్రసాదించి, వీరిని అర్చించిన వారికి అభీష్టసిద్ధి కలుగుతుందని వరమిచ్చారు.



# మేలు చేసే క్యారెట్

రోజూ ఒక క్యారెట్ తింటే కంటిచూపు బాగుంటుందని చాలాసార్లు విని ఉంటాం. కానీ ఆ మాటను పెద్దగా పట్టించుకోక కళ్లజోళ్లు కొనితెచ్చుకుంటాం. క్యారెట్ కళ్లకే కాదు మరెన్నో విధాల మేలు చేస్తుంది..

✦క్యారెట్లో ప్రొటీన్లు, పీచు, ఎ, బి1, బి6, సి, కె విటమిన్లు, ఐరన్, క్యాల్షియం, మెగ్నీషియం, భాస్వరం, పొటాషియం, సోడియం విస్తారంగా ఉంటాయి.

✦ ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. నీ మధుమేహం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

✦ వీటితో ఎముకలు, దంతాలకు పటుత్వం వస్తుంది.

✦ తరచూ క్యారెట్లు తినేవారిలో క్యాన్సర్ వచ్చే అవకాశం తగ్గుతుంది.

✦ చర్మం పొడిబారదు. ముఖానికి మెరుపునిస్తాయి.

✦ జీర్ణప్రక్రియ సాఫీగా ఉంటుంది. సమయానికి ఆకలి వేస్తుంది. మలబద్ధక సమస్య రాదు.

✦ వీటిలోని విటమిన్‌ఎ కంటిచూపును మెరుగుపరుస్తుంది.

✦ ఊబకాయం రాదు.బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహారం.



✦ మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఇవి రక్తపోటును క్రమబద్ధం చేస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి, గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి.

✦ క్యారెట్లతో కూర, పచ్చడి, హల్వా, జ్యూస్ చేయొచ్చు, ఫ్రైడ్రైస్, సాంబార్లకు అదనపు రుచి తెస్తాయి. సలాడ్, కేక్, కుకీస్, ఐస్క్రీమ్, చాక్లెట్లు, విరాయిల్లో క్యారెట్లను ఉపయోగిస్తారు. వీటిని ఉడికించి లేదా పచ్చివి కూడా తినొచ్చు.□

# ఆరోగ్యానికి ఆరు సూత్రాలు



**ఇంటివంట అంటే ఎవరికి నచ్చకుండా ఉంటుంది... ఐతే, రుచికి దాసోహమై ఒక్కోసారి అదుపు లేకుండా తినేస్తూ ఉంటాం. ఫలితంగా బరువు పెరగడంతోపాటు ఇతర సమస్యలూ తలెత్తుతాయి. మరి ఇంట్లో ఆహారాన్ని పరిమితంగా తింటూ ఆరోగ్యంగా ఉండాలంటే...**

ఇవి పాటించాల్సిందే! పాటిస్తే ఎన్నో ప్రయోజనాలు ఆరోగ్యానికి ఆరు సూత్రాలు.. పాటిస్తే ఎన్నో ప్రయోజనాలు

ఆహారంలో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండేలా చూసుకోండి. ఇవి బరువు పెరుగుదలకు కారణమవుతాయి. బ్రౌన్‌రైస్, బ్రౌన్ బ్రెడ్‌లకు ప్రాధాన్యం ఇవ్వండి. వీటిలోని సంక్లిష్ట పిండిపదార్థాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. జంక్‌ఫుడ్ అంటే వెంటనే నోరూరుతుంది. కానీ వాటితో ఆరోగ్య సమస్యలూ వస్తాయి. బదులుగా తాజా కాయగూరలు, పండ్లు, ఆకుకూరలకు ప్రాధాన్యం ఇస్తే సరి. గుడ్లు, పాలు, పెరుగు తీసుకున్నా మంచిదే.నీళ్ల తాగడంవల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. రోజుకి కనీసం ఎనిమిది గ్లాసుల నీళ్ల తాగడం మర్చిపోకండి. తినేటప్పుడు టీవీ, సెల్‌ఫోన్ చూడొద్దు. తిండిపైనే దృష్టి పెట్టండి. రంగు, రుచి, వాసనను ఆస్వాదిస్తూ తింటేనే అది వంటపడుతుంది. నిద్ర అలవాట్లు కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, మేల్కొనడం అలవర్చుకోవాలి. అలాగే నిద్రకు గంట ముందు ఫోన్‌కు దూరంగా ఉంటే మంచిది.□

# రవితేజ, ఆషికా ఫ్యామిలీ డ్రామా





మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో హోల్సమ్ ఎంటర్‌టైనర్ ఆర్76 చేస్తున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను బిగ్ కాన్వాస్‌పై స్టైలిష్‌గా రూపొందిస్తున్నారు. ఈ రోజు నుంచి హీరో రవితేజ, హీరోయిన్ ఆషికా రంగనాథ్ పై మూవీ టీం ఒక పాటను చిత్రీకరిస్తోంది. ఈ పాట కోసం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రత్యేకమైన సెట్ వేశారు. శేఖర్‌మాస్టర్ కొరియోగ్రఫీలో రూపొందుతున్న ఈ పాట అదిరిపోయే డ్యాన్స్ నంబర్‌గా ప్రేక్షకులను అలరించనుంది.ఎలక్ట్రిక్ ఎనర్జీతో ప్రేక్షకులను అలరించే రవితేజ ఈ సినిమాలో న్యూస్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారు. ఇది హ్యూమర్, ఎమోషన్, రవితేజ మాస్ ఎలిమెంట్స్‌తో ఫుల్‌ఫ్లెడ్జ్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతోంది. ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమాకి సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సెసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ :ప్రసాద్‌మూరెళ్ళ, నేషనల్ అవార్డు గ్రహీత శ్రీకర్‌ప్రసాద్ :ఎడిటర్, ఏఎస్ ప్రకాష్ : ఆర్ట్ డైరెక్టర్. తారాగణం: రవితేజ, ఆషికా రంగనాథ్.సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కిషోర్‌తిరుమలనిర్మాత: సుధాకర్‌చెరుకూరి బ్యానర్: ఎస్ఎల్‌వి సినిమాస్ డిఓపి: ప్రసాద్ మూరెళ్లసంగీతం: భీమ్స్ సిసిరోలియోఎడిటర్: శ్రీకర్‌ప్రసాద్‌ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్‌ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ కుమార్ చాగంటి పీఆర్వో: వంశీశేఖర్

# 'ఫీనిక్స్' నవంబర్7న రిలీజ్



తప్పకుండా మీ అందరికీ కనెక్ట్ అవుతుంది: ప్రీరిలీజ్ ఈవెంట్ లో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతిమక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి హీరోగా పరిచమైన చిత్రం ఫీనిక్స్. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహించారు. ఏకే బ్రేవ్‌మ్యాన్ పిక్చర్స్ బ్యానర్ పై రాజలక్ష్మి 'అన్ల' అరసు ఈ సినిమాని నిర్మించారు. ఇప్పటికే తమిళ్ లో విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ చిత్రం తెలుగులో నవంబర్ 7 రిలీజ్ కానుంది. ఈ సందర్భం మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ,అందరికి నమస్కారం. ఈ వేడుకకు వచ్చిన గోపీచందికి థాంక్యూ. ఆయన చెప్పిన మాటలు మాకు ఎంతో ఆనందాన్నిచ్చాయి. ఇది మా అబ్బాయికి చాలా మంచి ఆరంభం. ఒక తండ్రిగా నేను చాలా ఆనందంగా ఉన్నాను.

## తెర

# పవర్ ఫుల్ కంటెంట్ సినిమా 'కృష్ణ లీల': డైరెక్టర్ దేవన్



యంగ్ హీరో దేవన్ హీరోగా, ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ 'కృష్ణ లీల'.'తిరిగొచ్చిన కాలం'అనేది ట్యాగ్ లైన్. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తోంది. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్‌పై జ్యోత్స్నజి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కథ మాటలు అనిల్ కిరణ్ కుమార్ జి అందించారు. ఈ సినిమా, టీజర్, ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. 'కృష్ణ లీల' నవంబర్ 7న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో, డైరెక్టర్ దేవన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**'కృష్ణలీల'సినిమా ఎలా మొదలైంది?**

నేను సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూనే సినిమా ప్రయత్నాలు చేసేవాడిని. రెండు సినిమాల్లో మంచి పాత్రలు చేశాను. ఆ తర్వాత అదే తరహా పాత్రలు రావడంతో కొత్త క్యారెక్టర్స్ కోసం ఎదురు చూస్తున్నప్పుడు నిర్మాత జోష్న, రైటర్ అనిల్ ఈ కథ చెప్పారు. కథ విని ఒక వారం రోజుల తర్వాత ఈ జనరేషన్‌కి ఈ కథని ఎలా చెప్పొచ్చో కొన్ని మార్పులు చేసి ఒక కొత్త రకం స్క్రీన్ ప్లేతో చెప్పాను. అది వారికి చాలా నచ్చింది.ఎవరు డైరెక్ట్ చేస్తారు అన్నప్పుడు నేనే డైరెక్ట్ చేస్తానని చెప్పాను.

**కృష్ణలీలా ఎలా ఉండబోతుంది?**

'కృష్ణ లీల' తిరిగి వచ్చిన కాలం .. లీల అంటే ఆట. ఆయన ఒక ప్రేమ కథని ఎలా ఆడారు? ఎలా ఆడించారనేది కృష్ణ లీల. మనిషి కాలాన్ని వెనక్కి తిరిగి తీసుకురాలేదు. .

**క్రిష్ణ తత్వం చాలా పెద్ద సబ్జెక్టు కదా.. జనాలకు అర్థమయ్యేలా ఎలా చెప్పారు?**

కృష్ణ తత్వం అనేది ఒక మహా సముద్రం. భగవద్గీతలో చెప్పే వాక్యాలు ఈ కథకి చాలా అద్భుతంగా కనెక్ట్ అయ్యాయి. నేను గంగాధర శాస్త్రి ప్రవచనాలు ఎక్కువగా వినేవాడి. ఆయనకి కథ చెప్పినప్పుడు నాకున్న చాలా సందేహాల్ని ఆయన నివృత్తి చేశారు. ఈ కథ విషయంలో హెల్ప్ చేశారు.

**ధన్య బాలకృష్ణ గురించి?**

ఈ కథ చెప్పినప్పుడు అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. నేను చెప్పిన కథను చాలా అద్భుతంగా పట్టుకున్నారు. చాలా మంచి పెర్ఫార్మర్. పృథ్వి, తులసి ఇలా చాలా మంచి నటులు ఉన్నారు. వాళ్ళ ఎక్స్పీరియన్స్ మాకు ఎంతగానో ఉపయోగపడింది.

**ఆడియన్స్‌కి ఏం చెప్తారు?**

ప్రేమ అనేది చాలా గొప్ప ఎమోషన్. అది భార్యాభర్తలు, తండ్రి కొడుకులు, మనకి మన ఫ్రెండ్స్‌కి, మనకి జంతువులకు మధ్య ఉన్నది ఏదైనా కూడా ప్రేమే. ఈ సినిమా చూసిన తర్వాత మన ఫ్రెండ్,మనతో పరిచయమున్న వ్యక్తులు అందరి పట్ల మనకి ఒక గొప్ప అనుబంధాన్ని ఫీల్ అవుతాము.

**అవుట్ పుట్ చూసినప్పుడు ఏమనిపించింది?**

-మేమేదైతే అనుకున్నామో స్క్రీన్ మీదకి అద్భుతంగా వచ్చింది. విఎఫ్ఎక్స్ టీం కూడా నాకు చాలా సపోర్ట్ చేశారు.

**మీరు డైరెక్టర్, హీరో. ఎందులో కొనసాగుతారు?**

-అది కాలమే నిర్ణయిస్తుంది. ప్రస్తుతానికైతే ఈ సినిమాని ఆడియన్స్‌కి దగ్గరికి తీసుకెళ్లాలనే సంకల్పంతో ఉన్నాను.ఆల్ ది బెస్ట్ థాంక్ యూ.

# చలన చిత్ర అవార్డులపై రాజీనా?



55వ కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల ప్రకటన సందర్భంగా నటుడు ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. బెస్ట్ యాక్టర్ అవార్డు మమ్ముట్టికి లభించగా, జాతీయ అవార్డులు ఇప్పుడు రాజీ పడ్డాయి. మమ్ముట్టి లాంటి గొప్ప నటుడికి అలాంటి అవార్డులు అవసరం లేదు" అని తన అద్భుత నటనతోనే కాకుండా, వివాదాస్పద వ్యాఖ్యలతో కూడా తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల ప్రకటన సందర్భంగా కూడా ఆయన అదే ధోరణి ప్రదర్శించారు.

# 'కె-ర్యాంప్' విజయం ప్రత్యేకంగా గుర్తుండిపోతుంది : కిరణ్ అబ్బవరం



సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటించిన 'కె ర్యాంప్' మూవీ హౌస్ ఫుల్ షోస్‌తో పెరుగుతున్న కలెక్షన్స్‌తో బ్లాక్ బస్టర్ విజయం దిశగా పరుగులు తీస్తోంది. ఈ సినిమా సక్సెస్ ఫుల్ గా థర్డ్ వీక్ ప్రదర్శితమవుతూ 40 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను సాధించి దీపావళి బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచింది. 'కె ర్యాంప్' సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మించారు. జైన్స్‌నాని దర్శకత్వం వహించారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ నేపథ్యంలో 'కె ర్యాంప్'ర్యాంపేజ్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నిర్మాత బండ్లగణేష్ అతిథులుగా హాజరయ్యారు. అతిథుల చేతుల మీదుగా మూవీ టీమ్‌కు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఎడిటర్ ఛోటా కె ప్రసాద్ మాట్లాడుతూ 'కె ర్యాంప్'సక్సెస్ సెలబ్రేషన్స్ లో పాల్గొనేందుకు వచ్చిన పెద్దలు అందరికీ ధన్యవాదాలు. మా సినిమా రోజు రోజుకూ కలెక్షన్స్ పెంచుకుంటూ బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించింది. మా టీమ్ లో ఎవరూ తక్కువ ఎవరు ఎక్కువ కాదు, టీమ్ ఎఫర్ట్ పెట్టి కష్టపడ్డాం. మా కష్టాన్ని గుర్తించి మా సినిమాను ప్రేక్షకులు హిట్ చేయడం హ్యాపీగా ఉంది అని అన్నారు.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ యంగ్ అండ్ డైనమిక్ టీమ్ 'కె ర్యాంప్' సినిమాను రూపొందించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులను నేను కోరేది ఒక్కటే, చిన్న చిత్రాలను ఆదరించండి. ఇలాంటి టీమ్ కు ప్రేక్షకుల ఆదరణ, ఆశీర్వాదాలు ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ మా అందరికీ హ్యాపీ ఈవెనింగ్ ఇది. 'కె ర్యాంప్' సక్సెస్ సెలబ్రేషన్స్ కు మా డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్, టీమ్ అందరూ వచ్చారు. మా సినిమా విజయాన్ని మా కంటే మీరంతా ఎక్కువ ఎంజాయ్ చేస్తున్నారు. మా టీమ్ అంతా ఒక ఫ్యామిలీలా మారిపోయాం. 'కె ర్యాంప్' సినిమా మనకు అన్నీ నేర్పింది. కె ర్యాంప్ సినిమా మాత్రం ఎప్పటికీ ప్రత్యేకంగా మిగిలిపోతుంది. ఈ సినిమా ఎంత వసూళు చేసింది అనేదాని కంటే థియేటర్స్‌లో ఫ్యామిలీ ఆడియెన్స్ అంతా కలిసి సినిమా చూస్తూ నవ్వుకోవడం హీరోగా ఎంతో సంతృప్తిని ఇచ్చింది. పండక్కి మీ అందరినీ ఎంటర్ టైన్ చేయాలనే సినిమా చేశాం. ఆ నమ్మకం నిజం కావడం హ్యాపీగా ఉంది. మీ వాడిగా భావించి ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. గతేడాది, ఈ ఏడాది దీపావళికి హిట్ ఇచ్చాం. మీ సపోర్ట్ ఉంటే వచ్చే దీపావళికి కూడా హిట్ సినిమా ఇస్తాను. అన్నారు.

## మహిళల వరల్డ్ కప్ ట్రోఫీతో..

# టాప్‌కు బ్రాండ్ వాల్యూ

### 20 నుండి 100% పెరిగిన ఫీజులు.. కొత్త తారలుగా ఉమెన్ ఇన్ బ్లూ టీమ్



**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్ విజయం భారత మహిళా క్రీడాకారిణులకు ఒక కొత్త శకానికి నాంది పలికింది. ఆటతో పాటు, ఆర్థికంగా కూడా ఈ విజయం ఒక బలమైన పునాదిని వేసింది. చరిత్ర సృష్టించిన భారత మహిళల క్రికెట్ జట్టుకు ప్రపంచ కప్ విజయం కేవలం ట్రోఫీని మాత్రమే అందించలేదు, వారి బ్రాండ్ విలువను కూడా అమాంతం పెంచేసింది. దేశవ్యాప్తంగా అపారమైన అభిమానం, ప్రశంసలు దక్కించుకున్న ఈ ఉమెన్ ఇన్ బ్లూ టీమ్ సభ్యులు ఇప్పుడు అడ్వర్టైజింగ్ ప్రపంచంలో కొత్త తారలుగా వెలుగుతున్నారు. ఈ గెలుపు తర్వాత భారత క్రీడాకారిణుల బ్రాండ్ ఎండార్స్‌మెంట్ ఫీజులు 25 నుంచి 100 వరకు పెరిగాయి. స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ, షఫాలీ వర్మ వంటి స్టార్ ఆటగాళ్ల కోసం బ్రాండ్లు క్యూ కడుతున్నాయి. ప్రధానంగా జెమీమా రోడ్రిగ్స్ ఫీజు రెట్టింపు (100 శాతం పెరుగుదల) అయింది. ఈ బ్రాండ్ విలువ పెరుగుదలలో, సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి భారత్‌ను ఫైనల్‌కు చేర్చిన జెమీమా ముందంజలో ఉంది. సెమీఫైనల్ మ్యాచ్ ముగిసిన వెంటనే బ్రాండ్‌ల నుంచి విపరీతమైన ఆసక్తి కనిపించింది. జెమీమా ఇప్పుడు ఒక్కో బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌కు రూ.75 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు ఛార్జ్ చేయనుంది. ఇప్పటికే రెడ్ బుల్, బోట్, నైక్ వంటి బ్రాండ్లకు అంబాసిడర్‌గా ఉన్న జెమీమా కోసం 10 నుండి 12 విభిన్న కేటగిరీలలోని బ్రాండ్‌లతో చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇతర ప్లేయర్ల పరిస్థితి చూస్తే ఇప్పటికే 20కి పైగా బ్రాండ్లను ఎండార్స్ చేస్తున్న స్టార్ ప్లేయర్‌లు స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్ ఎండార్స్‌మెంట్ ఫీజులు కూడా 30 నుండి 50 శాతం వరకు పెరుగుదల చోటు చేసుకుంది. వీరి ప్రస్తుత ఫీజు రూ.60 నుండి రూ.75 లక్షల వరకు ఉంది. ఇక యువ తారలైన షఫాలీ వర్మ, దీప్తి శర్మ కూడా బ్రాండ్‌ల నుంచి ఎక్కువ ఆసక్తి వ్యక్తమవుతోంది. వీరి ఫీజులు కూడా ఒక్కో బ్రాండ్‌కు రూ.40 నుండి రూ. 50 లక్షల వరకు పెరిగే ఛాన్స్ ఉంది.

## మే బ్యాంక్ ఛాంపియన్‌షిప్..

# ప్లేఆఫ్‌లోకి అదితి



**న్యూఢిల్లీ:** మేబ్యాంక్ ఛాంపియన్‌షిప్‌లో చివరి రోజున భారత్ ప్లేయర్ అదితి అశోక్ ఈవెన్ పార్ 72 రౌండ్ సాధించి టి27ను ముగించింది. మూడు బర్డీలు మరియు మూడు బోగీలతో,3వరౌండ్ తర్వాత టి12స్థానంలో నిలిచిన అదితి, 70-70-66-72 రౌండ్లతో నాలుగు రోజుల పాటు 10 అండర్ పార్ స్కోరుతో ఈ వారాన్ని ముగించింది. ఏడు అండర్ 65తో ఉన్న మియు యమషిత హై జిన్ చోయ్ (73) మరియు హన్నా గ్రీన్ (68)తో కలిసి ప్లే ఆఫ్‌లోకి ప్రవేశించింది. త్రీ వే ప్లేఆఫ్ కోసం వారందరూ 18అండర్‌తో టై అయ్యారు.మొదటి రౌండ్ నుంచి నాల్గవ రోజు ఇబ్బంది పడిన హై జిన్ చోయ్ ఒక ఓవర్ 73 పరుగులు చేసి ఫీల్డ్‌ను నడిపించగా, ఆ తర్వాత ఐదు స్ట్రోక్‌ల వెనుకబడి ఉన్న హన్నా గ్రీన్, ఫోర్‌అండర్ 68 పరుగులు చేసి ఆమెను అధిగమించింది. 18వ హోల్‌ను మొదటి ప్లే ఆఫ్ హోల్‌గా సెట్ చేయడంతో, జపాన్‌కు చెందిన యమషిత బర్డీ చేసిన తర్వాత టైటిల్‌ను దక్కించుకుంది, హన్నా గ్రీన్ మరియు హై జిన్ చోయ్ మాత్రమే సమానం చేయగలిగారు. ఇది టైటిల్ లేకుండా చోయ్ కెరీర్‌లో టాప్ 10లో 29వ స్థానాన్ని సంపాదించడాన్ని సూచిస్తుంది. నాల్గవ స్థానంలో నిలిచిన ఐదుగురు ఆటగాళ్లలో ప్రపంచ నంబర్ వన్ జీనో తితికుల్, సీ యంగ్ కిమ్, ఐ ఇవై, ఎ లిమ్ కిమ్ మరియు యాన్ లియు ఉన్నారు.




## వన్డే వరల్డ్ నంబర్1గా

# వోల్వార్ట్

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్‌ను తొలిసారి సాధించి సంబరాల్లో ఉన్న భారత్ మహిళా టీం వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు ఎదురు దెబ్బ తగిలింది. ఇప్పటి వరకూ ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్న స్మృతి తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. ఇదే సమయంలో భారత్ చేతిలో ఓటమి పాలైన దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ ఆ స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఐసిసి మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో స్మృతి ప్రస్థానం ముగిసింది. టోర్నమెంట్ అంతటా వోల్వార్ట్ సంచలనాత్మక ఫామ్‌తో సెమీఫైనల్, ఫైనల్‌లో వరుసగా సెంచరీలు చేయడం ద్వారా ఆమెను ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేర్చింది. 25 ఏళ్ల ఆమె అద్భుతమైన 571 పరుగులు, కెరీర్‌లో అత్యధిక రేటింగ్ 814 సాధించి అగ్రస్థానానికి చేరుకుంది. ఇక టోర్నమెంట్ అంతటా నంబర్ 1 లో నిలిచి, టీం ఆఫ్ ది టోర్నమెంట్‌లో కూడా స్థానం సంపాదించిన స్మృతి ఇప్పుడు 811 రేటింగ్ పాయింట్లతో 2వ స్థానంలో దిగజారింది. సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై జెమీమా రోడ్రిగ్స్ చేసిన మ్యాచ్ విన్నింగ్ సెంచరీ ఆమె కెరీర్‌లో తొలిసారిగా టాప్ 10లోకి ప్రవేశించడానికి దారితీసింది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికాకు చెందిన మారిజాన్ కాప్ సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌పై 20 రన్స్‌కు 5 వికెట్లు పడగొట్టి ఇంగ్లాండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్‌ను అధిగమించి అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ దీప్తి శర్మ ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో సెమీఫైనల్ మరియు ఫైనల్‌లో 7 వికెట్లు, 82 పరుగులతో సహకారం అందించడం ద్వారా నాల్గవ (392) స్థానానికి చేరుకుంది.

# నారాయణన్ 126వ రౌండ్‌కు అర్హత

### చెస్ వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా స్టీవెన్ ఓటమి



**న్యూఢిల్లీ:** చెస్ ప్రపంచ కప్ 2025 టైబ్రేక్ గేమ్ మొదటి సెట్‌లో దక్షిణాఫ్రికాకు చెందిన స్టీవెన్ రోజాస్‌ను ఓడించి, 128వ రౌండ్‌కు అర్హత సాధించిన మొదటి ఆటగాడిగా భారత ఎస్ఎల్ నారాయణన్ నిలిచాడు. మొదటి గేమ్‌లో నల్లజాతి వ్యక్తిగా సిసిలియన్ డిఫెన్స్‌ను ఆడి, వేగవంతమైన వెర్షన్‌లో నారాయణన్ పక్కా ప్రణాళికతో తెల్లజాతి డిఫెన్స్‌లను ఢీకొట్టాడు. అసమాన ఘర్షణతో తెల్లజాతి వ్యక్తితో కేవలం 22 కదలికలలో అద్భుతమైన విజయాన్ని సాధించాడు. టైబ్రేకర్ యొక్క మొదటి సెట్‌లో తన రెండు గేమ్‌లను గెలిచి ముందుకు సాగడంతో దీప్తయాన్ ఘోష్ చైనాకుచెందిన పెంగ్ జియోంగ్లియన్ కంటే మెరుగ్గా నిరూపించుకున్నాడు. కోల్‌కతాకు చెందిన ఈ భారత ఆటగాడు టైబ్రేకర్ యొక్క మొదటి గేమ్‌లో అత్యున్నత స్థాయిలో వైట్‌తో గెలిచాడు. తరువాత తన ప్రత్యర్థి చేసిన తప్పు ప్రదర్శనను సద్వినియోగం చేసుకుని అతనిపై ఆధిపత్యం సంపాదించాడు. మొదటి గేమ్‌లో నారాయణన్ తన పెంపుడు ఓపెనింగ్‌ను పునరావృతం చేసి సరైన స్పందనను పొందకపోగా, మిడిల్ గేమ్ సంక్లిష్టతలు ఎదుర్కొని దక్షిణాఫ్రికా ఆటగాడిని ఎదుర్కొన్నాడు. మొదటి గేమ్ పెద్దగా దెబ్బ లేకుండా ముగిసింది కానీ రెండవ గేమ్‌లో నారాయణన్ మొదటినుండే దాడితో తన సామర్థ్యాన్ని, ఆధిపత్యాన్ని సాధించాడు.

# రంజీ ట్రోఫీ: చివరి రోజు డ్రా

### ముంబయిపై రాజస్థాన్ ఆధిక్యం

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ 2025-26లో భాగంగా చివరి రోజు మ్యాచ్ డ్రాగా ముగిసింది. ముంబైపై రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంలో ఉంది. యశస్వి జైస్వాల్ మొదటి ఇన్నింగ్స్‌లో ఆపివేసిన చోటు నుంచి పుంజుకుని, రెండవ ఇన్నింగ్స్‌లో 156 (174 బాల్స్, 18 ఫోర్లు, ఒక సిక్స్) పరుగులు చేశాడు. కానీ రాజస్థాన్‌తో జరిగిన గ్రూప్ డి మ్యాచ్ డ్రాగా ముగియడంతో ముంబై ఒక్క పాయింట్‌తో సంతృప్తి చెందాల్సి వచ్చింది. రాజస్థాన్ బౌలర్లు మంగళవారం ఈ జోరును ఎదుర్కొనేందుకు శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ, జైస్వాల్ మరియు ముషీర్ ఖాన్ (63, 115 బాల్స్, 9 ఫోర్లు) ఓపెనింగ్ భాగస్వామ్యానికి 149 పరుగులు జోడించారు. జైస్వాల్ బౌండరీలు బాదగా, ముషీర్ సమయం తీసుకుని చివరికి అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. ఈ భాగస్వామ్యానికి అడ్డుకట్ట వేసేందుకు సీమర్ అనికేత్ మొదట ముషీర్‌ను కునాల్ సింగ్ రాథోడ్ క్యాచ్‌తో వెనక్కి నెట్టాడు. అయితే, జైస్వాల్ అజింక్య రహనేతో రాజస్థాన్ ఫాస్ట్ బౌలర్లను సులభంగా ఎదుర్కొన్నాడు. కానీ, అతను కూడా అజయ్ సింగ్ వేసిన బంతిని రాథోడ్ స్టంప్ చేయడంతో ఔట్ అయ్యాడు. యశస్వి పై 150 పరుగులు సాధించడంతో డ్రాగా ముగిసే అవకాశం తప్పనిసరి ఏర్పడింది. టీ విరామానికి కొద్దిసేపటి ముందు రోజు ఆటను రద్దు చేయడానికి జట్లు పరస్పరం అంగీకరించాయి. దీంతో ముంబై 3 వికెట్లకు 269 పరుగులు చేసింది.



బిజినెస్

# స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు



**ముంబయి, నవంబరు 4:** బంగారం ధరలు మంగళవారం తగ్గుముఖం పట్టాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, అంతర్జాతీయంగా అమెరికా డాలర్ బలపడటం వంటి పరిణామాలు పసిడి ధరలపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో పాటు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు బలహీనపడి బంగారం ధరల పతనానికి కారణం అయింది. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,19,916గా నమోదైంది. మరోవైపు, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.836 (0.69 శాతం) తగ్గి 10 గ్రాములకు రూ.1,20,573 వద్ద ట్రేడ్ అయింది. ఇదే సమయంలో డాలర్ ఇండెక్స్ 0.08 శాతం పెరిగి 99.95 వద్ద స్థిరంగా కొనసాగింది. బలమైన డాలర్, అమెరికా చైనా మధ్య తగ్గుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు, అమెరికాలో వడ్డీ రేట్ల కోతకు అవకాశాలు తగ్గడం వంటి అంశాలు బంగారం ఆకర్షణను దెబ్బతీశాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనలిస్ట్ మానవ్ మోడీ మాట్లాడుతూ, డాలర్ మూడు నెలల గరిష్ఠ స్థాయికి చేరడంతో బంగారం ధర ఔన్సుకు 4,000 డాలర్ల వద్ద కదలాడుతోంది. అమెరికా ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా కీలక ఆర్థిక గణాంకాలు అందుబాటులో లేకపోవడంతో, డిసెంబర్ పాలసీ సమావేశం ముందు ఫెడ్ అధికారుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని వివరించారు. మరోవైపు, ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం వినియోగదారు అయిన చైనా, కొన్ని గోల్డ్ రిటైలర్లకు చాలాకాలంగా ఇస్తున్న పన్ను మినహాయింపు విధానాన్ని రద్దు చేసింది.

ఇది అక్కడి బంగారం కొనుగోళ్ల జోరుకు కళ్లెం వేసే అవకాశం ఉంది. అయితే, వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు 2025 మూడో త్రైమాసికంలో బంగారం కొనుగోళ్లను త్రైమాసిక ప్రాతిపదికన 28శాతం పెంచాయి. నవంబర్ ఆరంభంలో బలహీనపడిన రూపాయి, కామెక్స్‌లో బంగారం 4,010 డాలర్ల పైన ఉండటం వంటివి పసిడికి మద్దతునిచ్చాయి. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా గణాంకాలు విడుదల కాకపోవడంతో ఇన్వెస్టర్లు ఈ వారం వెలువడనున్న మాన్యుఫ్యాక్చరింగ్, నాన్ మాన్యుఫ్యాక్చరింగ్ పీఎంఐ గణాంకాల కోసం ఎదురుచూసారని ఎల్‌కెపి సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు. అమెరికాచైనా, అమెరికా భారత్ వాణిజ్య చర్చల్లో చోటుచేసుకునే పరిణామాలు బంగారం ధరల్లో తీవ్ర ఒడుదొడుకులకు కారణమవుతాయని, ధరలు రూ.1,18,000 నుంచి రూ.1,24,000 మధ్య కదలాడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# నికరలాభాల్లో ఎస్‌బిఐ దూకుడు!

### రూ.18,331 కోట్ల లాభం ప్రకటించిన బ్యాంకింగ్ దిగ్గజం




**ముంబయి, నవంబరు 4:** ప్రభుత్వ రంగంలోని బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్రైమాసిక ఫలితాల్లో భళా అనిపించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జులై సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.20,160 కోట్ల నికర లాభాన్ని అందుకుంది. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఎస్‌బిఐ మొత్తం రూ.18,331 కోట్ల నికర లాభాన్ని అందుకగా ఈ ఏడాదిలో అది 10శాతం వృద్ధి నమోదుచేసింది. రూ.20 వేల కోట్లు దాటేసింది. సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికానికి గానూ స్టేట్ బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.1,29,141 కోట్ల నుంచి రూ.1,34,979 కోట్లకు పెరిగింది. ఇక వడ్డీ ద్వారా బ్యాంకుకు వచ్చిన ఆదాయం రూ.1,13,871 కోట్ల నుంచి రూ.1,19,654 కోట్లకు చేరింది. ఈ బ్యాంకు ఆస్తుల నాణ్యత సైతం మెరుగుపడినట్లు తెలిపింది. 2025, సెప్టెంబర్ 30 నాటికి ఎస్‌బిఐలో స్థూల నిరర్థక ఆస్తులు (జిపిఎ)లు గతేడాదితో పోలిస్తే 2.13 శాతం నుంచి 1.73 శాతానికి దిగివచ్చాయి. ఇక నికర మొండి బాకీల విలువ 0.53 శాతం నుంచి 0.42 శాతానికి తగ్గినట్లు బ్యాంక్ వెల్లడించింది. ఏకీకృత ప్రాతిపదికన ఫలితాలు చూసుకుంటే ఎస్‌బిఐ గ్రూప్ 7శాతం వృద్ధి నమోదు చేసింది. దీంతో రూ.21,137 కోట్ల నికర లాభాన్ని ఎస్‌బీఐ గ్రూప్ నమోదు చేసింది. గతఏడాది ఇదే సమయంలో ఈ గ్రూప్ మొత్తం రూ.19,743 కోట్ల నికర లాభాన్ని అందుకుంది. అలాగే కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ.1.63 లక్షల కోట్ల నుంచి రూ.1.75 లక్షల కోట్లకు చేరుకుంది. రాణించిన షేరు త్రైమాసిక ఫలితాల వేళ ఎస్‌బిఐ షేరు రాణించింది. క్రితం రోజు సరికొత్త గరిష్ఠాలను తాకింది. ఈ రోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ఇంట్రాడేలో చూసుకుంటే ఉదయం స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత కోలుకుంది. మార్కెట్ అంచనాలను ఎస్‌బీఐ అందుకుంటుందన్న వార్తల నేపథ్యంలో ఎస్‌బీఐ షేర్లు కొనేందుకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపారు. దీంతో మరోసారి ఆల్ టైమ్ హై స్థాయి రూ. 959.30ని తాకింది. మార్కెట్లు ముగిసే నాటికి 0.52 శాతం లాభంతో రూ.954.60 వద్ద స్థిరపడింది.

## హిందూజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ హిందూజా కన్నుమూత



**లండన్, నవంబరు 4:** హిందూజా గ్రూపు ఛైర్మన్‌గోపీచంద్ పి హిందూజా లండన్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసారు. 85 ఏళ్ల హిందూజా పారిశ్రామిక రంగంలో జిపిగా పేరుపొందారు. గడచిన కొన్ని వారాలుగా ఆయన అస్వస్థతతో ఉన్నారు. హిందూజా కుటుంబంలో రెండోతరం ప్రముఖునిగా పారిశ్రామిక వేత్తగా ఆయన పేరుపొందారు. ఆయన సోదరుడు శ్రీచంద్ హిందూజా కన్నుమూసిన తర్వాత గోపీచంద్ హిందూజా గ్రూపు ఛైర్మన్‌గా బాధ్యతలుచేపట్టారు. 2023నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఆయనకు భార్య సునీత, కుమారులు సంజయ్, ధీరజ్, కుమార్తె రీటా ఉన్నారు. కంపెనీ సమాచారం ప్రకారం ముంబయిలోని జైహింద్ కళాశాలనుంచి 1959లో ఆయన పట్టభద్రుడయ్యారు. వెస్ట్‌మినిస్టర్ వర్సిటీనుంచి లాలో డాక్టరేట్‌పొందారు. అలాగే ఆర్థిక శాస్త్రంలో లండన్‌లోని రిచ్‌మండ్ కళాశాలనుంచి డాక్టరేట్ పొందారు. కుటుంబ వ్యాపారంలో గోపిచంద్ హిందూజా1950లోనే చేరారు.భారత్ మధ్యప్రాచ్య ట్రేడింగ్ సంస్థగా నిలిచిన హిందూజా అనతికాలంలోనే గ్లోబల్‌గ్రూపుగా అవతరించింది. ఆటోమోటివ్, బ్యాంకింగ్, ఆర్థికసేవలు, ఐటిరంగం, హెల్త్‌కేర్, రియల్ ఎస్టేట్, పవర్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో బహుముఖంగా విస్తరించడంలో కీలకంగా వ్యవహరించింది. అశోక్ లేల్యాండ్, ఇండస్ ఇండ్ బ్యాంకు, నెక్స్ట్‌డిజిటల్‌వంటివి ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 2లక్షలమంది పనిచేస్తున్నారు. 1979లోనే ఇరాన్‌నుంచి లండన్‌కు కేంద్ర కార్యాలయాన్ని తరలించింది.

## భారత్‌కు అప్పగింతపై చోక్సీ సుప్రీంకోర్టులో అప్పీలు!




**న్యూఢిల్లీ, నవంబరు 4:** పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణంలో ప్రధాన నిందితుడు, పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ భారత్‌కు తనను అప్పగించే ప్రక్రియను నిలిపివేసేందుకు మరో న్యాయ పోరాటానికి దిగాడు. తనను భారత్‌కు అప్పగించ వచ్చంటూ బెల్జియంలోని ఆంట్వెర్ప్ అప్పీల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అక్కడి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు అక్టోబర్ 30న పిటిషన్ దాఖలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. చోక్సీ అప్పీల్ కారణంగా, సుప్రీంకోర్టు తీర్పు వెలువడేంత వరకు అతడిని భారత్‌కు అప్పగించే ప్రక్రియ నిలిచిపోనుంది. ఈ విషయాన్ని ఆంట్వెర్ప్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కెన్ విట్పాస్ తెలిపారు. రూ. 13,000 కోట్ల పీఎన్‌బీ స్కామ్‌లో చోక్సీపాత్ర రూ. 6,400కోట్లుగా ఉందని సిబిఐ ఆరోపించింది. ఈ కుంభకోణం బయటపడటానికి కొద్ది రోజుల ముందు, 2018 జనవరిలో చోక్సీ దేశం విడిచిపారిపోయి ఆంటిగ్వా అండ్ బార్బుడాలో తలదాచుకున్నాడు. ఇటీవల అనారోగ్య చికిత్స నిమిత్తం బెల్జియంవెళ్లగా భారత ఏజెన్సీలు గుర్తించాయి. ముంబైలోని ప్రత్యేక న్యాయస్థానం జారీ చేసిన అరెస్ట్ వారెంట్ల ఆధారంగా, 2024 ఆగస్టు 27న భారత్ చోక్సీని అప్పగించాలని బెల్జియంను కోరింది. ఈ అభ్యర్థనను విచారించిన ఆంట్వెర్ప్ జిల్లాకోర్టు, 2024 నవంబరు 29న చోక్సీని భారత్‌కు అప్పగించవచ్చని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ చోక్సీ ఆంట్వెర్ప్ అప్పీల్ కోర్టును ఆశ్రయించాడు. భారత్‌కు వెళ్తే తనకు ప్రాణహాని ఉందని, సరైన న్యాయం జరగదని, హింసకు గురిచేసే అవకాశంఉందని వాదించాడు. అయితే, చోక్సీ వాదనలను అప్పీల్ కోర్టు అక్టోబర్ 17న తోసిపుచ్చింది. అతని వాదనలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేసింది. భారత్‌లో చోక్సీ భద్రత, జైలు సౌకర్యాలు, వైద్య అవసరాలు, మానవ హక్కుల పరిరక్షణపై భారత ప్రభుత్వం బెల్జియంకు పలు హామీలు ఇచ్చింది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు!

### ఐటి, మెటల్ రంగాల్లో పెరిగిన అమ్మకాల ఒత్తిడి



**ముంబయి, నవంబరు 4:** భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ట్రేడింగ్ రెండో అర్ధభాగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), మెటల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు పతనమయ్యాయి. ఉదయం లాభాలతో సానుకూలంగా ప్రారంభమైనప్పటికీ, ఆ జోరును నిలబెట్టుకోలేకపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 519.34 పాయింట్లు నష్టపోయి 83,459.15 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ కూడా 165.70 పాయింట్లు క్షీణించి 25,597.65 వద్ద ముగిసింది. ఇంట్రాడే సెషన్‌లో సెన్సెక్స్ ఒక దశలో 0.11 శాతం లాభపడినప్పటికీ, చివరికి నష్టాల్లోకి జారుకుంది. బెంచ్‌మార్క్ సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా బలహీనపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.42 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.82 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, ఒక్క నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీ మాత్రమే 0.39 శాతం లాభంతో గ్రీన్‌లో నిలిచింది. అత్యధికంగా నిఫ్టీ మెటల్ సూచీ 1.44 శాతం పతనమవ్వగా, ఆటో రంగం 0.86 శాతం, ఐటీ రంగం 0.06 శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో పవర్ గ్రిడ్, టాటా మోటార్స్, టాటా స్టీల్, మారుతీ సుజుకీ ప్రధాన నష్టాల్లో నిలిచాయి. మరోవైపు, టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు లాభాలను నమోదు చేశాయి. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలు, కొన్ని హెవీవెయిట్ స్టాక్స్‌లో లాభాల స్వీకరణ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. సెలవుల కారణంగా ఈ వారం ట్రేడింగ్ రోజులు తక్కువగా ఉండటంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించారని వారు తెలిపారు. నిఫ్టీ 25,600 మార్కు దిగువకు చేరడంతో స్వల్పకాలికంగా బలహీనత కొనసాగవచ్చు. తక్షణ మద్దతు 25,570 వద్ద ఉంది. ఒకవేళ నిఫ్టీ నిర్ణయాత్మకంగా 25,800 స్థాయిని దాటితేనే బేరిష్ ధోరణి ముగిసి, మార్కెట్‌లో కొత్త కొనుగోళ్లు రావచ్చని మార్కెట్ నిపుణులు అంచనావేసారు.




## సత్వరసేవలకోసం ఇండియా పోస్ట్ 'డాక్‌సేవా యాప్'

**న్యూఢిల్లీ, నవంబరు 4:** తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువచేసే లక్ష్యంతో ఇండియాపోస్ట్ మార్పులు చేస్తోంది. శరవేగంగా సేవలు అందించేందుకు కొత్తయాప్‌ను ప్రవేశపెట్టింది. తపాలాశాఖ మొత్తం సేవలన్నీకూడా స్మార్ట్‌ఫోన్‌ద్వారానే వినియోగించుకునేలా డాక్‌సేవ పేరిట యాప్‌ను విడుదలచేసింది. ఇక పోస్టాఫీస్ మీజేబులోనే అన్న నినాదంతో పోస్టల్ శాఖ తన ఎక్స్ ఖాతాలోకూడా పోస్టుచేసింది. పార్సిల్‌ట్రాకింగ్, పోస్టేజి కాలిక్యులేషన్, ఫిర్యాదుల నమోదు, బీమా ప్రీమియం చెల్లింపులు వంటి సేవలు పొందవచ్చు స్పీడ్‌పోస్టు, మనీ ఆర్డర్ వివరాలను రియల్‌టైమ్‌లోట్రాక్‌చేసుకోవచ్చు. దేశీయ అంతర్జాతీయ పార్సిల్ సేవలకు ఎంత ఛార్జి అవుతుందో తక్షణమే లెక్కించుకోవచ్చు. స్పీడ్‌పోస్టు, రిజిస్టరుపోస్టు, పార్సిల్‌బుకింగ్‌సేవలను గంటల తరబడి లైన్‌లోఉండాల్సి అవసరంలేకుండా యాప్‌ద్వారానే పూర్తి చేయవచ్చు.కార్పొరేట్‌కస్టమర్లకోసం ప్రత్యేక యాక్సెస్‌ను కూడా ఏర్పాటుచేసారు. ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో డాక్ సేవా యాప్ అని టైప్‌చేసి డౌన్‌లోడ్‌చేసుకోవచ్చు. మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ అయ్యాక ఈమెయిల్ ఐడి, లేదా మొబైల్ నంబరుతో రిజిస్టరుఅవ్వాలి. ఒటిపితో లాగిన్ అయి సేవలు పొందవచ్చు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.